... పైసలు

ఆంధ్ర సచిత్ర వా...
పత్రిక

22-11-68



రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాతప్రతులని తిప్పిపంపమని కోరే రచయితలు వ్రాతప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపనవసరం లేదు. 100 అరఠావు పేజీల పైయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణించ బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపకోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయమయి ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఉత్తరాలు

ముఖచిత్రం

1—11—68 తే. వారపత్రిక ముఖచిత్రం శీలా ఎంతో చూడముచ్చటగావుంది. సీరియల్స్ సుజాత, జీవిత వలయాలు చాలా బాగుగా నడుస్తున్నవి. అందులకు నేను రచయిత్రులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కథలు కూడ బాగున్నవి. ఎక్కువగా నన్ను పాతబొమ్మలు కొత్త కబుర్లు, ఇంకా రంగుల రాట్నము నాకు ఎంతగానో బాగున్నవి. నటి సంధ్యారాణి వివిధ ఫోటోలతో పరిచయం బాగున్నది.

—మరిశెట్టి నాగేశ్వరరావు (పిఠాపురం)

* *

8—11—68 సంచికలో హిందినటి 'విమి' ముఖచిత్రం చాలా బాగుంది. ముఖ్యంగా కార్టూన్లు నన్నెంతో ఆనందింప చేశాయి. ఇలాగే ప్రతివారం ఎక్కువగా కార్టూన్లు ప్రచురిస్తారని ఆశిస్తాను.

—తమ్మనలక్ష్మి వెంకటేశ్వరరావు (భట్టిప్రోలు)

సీరియల్స్

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తున్న సీరియల్స్ పాఠకులను ఎంతో ఆనందపరుస్తున్నవి. చదువు తున్నంతసేపు మరలవారం ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నాము. ఆ సీరియల్సు ప్రచురిస్తున్న మీకు, రచయిత్రులకు నా హృదయ పూర్వక అభివందనములు.

జి. హెచ్. పార్వతి (గుంటూరు)

* * *

మీ వారపత్రిక చదివే పాఠకులలో నేనొకణ్ణి. ఎన్ని ఆలోచనలున్నా మీ వారపత్రిక కంటపడగానే ఆలోచనలన్నీ పటాపంచలు అవుతాయి. మీరు ప్రచురించిన సీరియల్ కథ "జీవితవలయాలు" నన్నెంతో ఆకర్షించింది. ప్రచురించిన మీకు రచించిన రచయిత్రిగార్కి నా ధన్యవాదములు.

—పి. వెంకటేశ్వర్‌రావు (హైదరాబాద్)

* * *

కథలు

ముచ్చటగా వెలువడిన (25—10—68) దీపావళీ ప్రత్యేక సంచికయందు "మనసు—మమత" అనే కథ చాలా బాగున్నది! దీనికి మొదటి బహుమతి యివ్వడం సమంజసమే. మరియూ, రంగధాంగారు వ్రాసిన కథ గాజు కిటికీ ఉత్తమమైన పంథాలలో నడచి, అశేష పాఠకులను ఆకర్షించగలదు. ఎప్పటికినీ నిత్య నూతన సుమాలతో వెలువడుచున్న పత్రికకు మా థ్యాంక్స్.....

కుమారి వి. రాధ, మోహన్‌కుమార్ అండ్ టీ శాస్త్రి, (హైదరాబాద్)

* * *

1.11.68 పత్రికలో ప్రచురింపబడ్డ 'చార' కథ బాగుంది రచయిత ఎమ్. ఆర్. ప్రసాద్ నిజంగా అభినందనీయుడు.

నవలల్లోలాగూ, సినిమాల్లోలాగూ ముగింపు నిజజీవితంలో సంభవంకాదు—అది అసహజమని పేర్కొంటూనే ఆ అసహజత్వానికి వాస్తవికతను ఆపాదించాలని ప్రయత్నించటంలో సఫలీకృత అయ్యారు రచయిత. రాజ్యం నిష్క్రమణ తర్వాత తానే ఆ రాము అని రామకృష్ణ వాపోవటంతో కథను ముగించారు. ఆ ముగింపు కథకు ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించి పెట్టింది.

చిన్న పిల్లల మనస్తత్వాల నాకళింపు చేసుకొని ఈ కథను ఎంతో రమ్యంగా నడిపిన రచయితకూ అట్టి కథను ప్రచురించిన మీకూ నా ధన్యవాదాలు.

పి. శ్రీలక్ష్మి, (శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ).

*

శ్రీ రంగథామ్ రచించిన "గాజు కిటికీ" కథ చాలా బాగుంది. రచయితకు నా అభినందనలు.

ఎదుటి వ్యక్తుల కులగోత్రాలను, పుట్టుకలను, విమర్శించి వాళ్లను అవమానించే దుష్టులు మన సంఘంలో ఈనాటికీ వేనకువేలు ఉన్నారు. తమ కళంకమును, అసమర్థతను, కప్పిపుచ్చుకొని ఎదుటి వారిని కించపరచడమే వీరి ధ్యేయం. ఇటువంటి చులకు ఈ కథ ఒక మంచి గుణపాఠం.

దాము సత్యనారాయణ (సికిందరాబాదు).

* * *

1—11—68 తేది వారపత్రికలోని కథలు 'ఎవరు భర్త', 'ఇది కన్నీరు' కథలు చాల బాగావున్నవి. ఈ కథలు రాసిన యర్రంశెట్టి శాయికి, "యు" గార్కి నాకృతజ్ఞతలు తెలుప కోరుచున్నాను. ముఖచిత్రం కూడ బాగావున్నది.

—మహమ్మద్ నూరుద్దీన్ (నందిగామ)

6-12-1968 సంచికనుండి ప్రారంభం!

1969 లో మీ రాశిఫలం

ప్రతివారం రెండేసి రాసులచొప్పున ఆరు వారాలు ప్రచురించ బడుతుంది


ASP-MT-24TEL
మీకు టీ కావలసిస్తే మూడిస్ కోసం అడగండి
MUDIS Consort Superior leaf TEA
MUDIS Rani TEA
సూపర్ ఫైన్ టీ
క్రౌన్ ఫ్లవర్ డార్జిలింగ్ టీ
మీకు టీ కావలిస్తే, మూడిస్ టీ కొనండి. మీరు మూడిస్ టీ కోసం అడిగితే, దానిలో ఎంచుకోవడానికి, ఆనందకరమైన ఎన్నో వివిధ మిశ్రమములు మీకు లభిస్తాయి.
హాయికరమైన రుచిగల రాణీ డస్ట్, ఉత్సాహాన్నిచ్చే టి. బి. డస్ట్, ఎక్స్ట్రా స్పెషల్ క్రౌన్, శుద్ధమైన డార్జిలింగ్ టీ, ఆహ్లాదకరమైన సువాసనతో బాగా మిశ్రమము చేయబడిన లీఫ్ టీ, సంతృప్తికరమైన విక్టోరీ కాన్సర్ట్ లీఫ్ టీ మరియు పొదుపైన మంచి రుచిగల సూపర్ ఫైన్.
మీకు టీ కావలసినప్పుడల్లా, తప్పకుండా మూడిస్ టీ కోసమే అడగండి.
ప్రతి వ్యక్తి మూడిస్ టీనే త్రాగును — మీరూ ఎందుకు త్రాగకూడదు?
అందువలన మీకు నచ్చిన మూడిస్ మిశ్రమము ఎంచుకొని,
ప్రతిసారి దాని పేరు చెప్పి, అడగండి.
మూడిస్ టీ
భారతదేశములో 1863 నుండి,
బొంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ వారి ఉత్పత్తి

ఉత్తరాలు

25.10.68 ఆంధ్రసచిత్ర వార పత్రిక దీపావళి సంచికలో ప్రచురితమయిన మొదటి బహుమతి పొందిన "మనసు—మమత" కథ, టి. విజయలక్ష్మిగారి ప్రప్రథమరచన అయినప్పటికీ సర్వ జ్యోతులచే కాంతిని ప్రజ్వరిల్లింప చేయుచూ మనస్సుకు మంచి మమతను ప్రసాదించినది. కథ ట్రాజెడీ అయివుంటే మరింత ఉన్నత స్థాయిని పొందగల్గియుండేది.

రంగధామ్‌గారి "గాజు కిటికీ" శకుంతలగారి "వరలక్ష్మి" ముచ్చటగా వున్నవి. ఒకరిది కొలను అయితే ఇంకొకరిది కొలనులోని తామరపుష్పం.

ఇంపైన కథలుతో సొంపైన సీరియల్సులో ఘటలు పెంచి అనవసర ప్రసంగములతో నింపి పాఠకులకు విసుగు కల్గించకుండ పత్రికను అమృతాయమానముగ తయారుచేసి స్వల్పమయిన ధరతో మావద్దకు (వచ్చి) పంపి మమ్ములను ఆనందపర్చినందుకు చాలా సంతోషించు చున్నాము.

బహుమతులు పొందిన ముగ్గురు రచయిత(త్రు)లకు మాహృదయ పూర్వక శుభాకాంక్షలు

—మూర్తి, రావు, రవి. నారాయణ, శంకర్.

సినిమా

8—11—68 మా(మీ) ఆంధ్రసచిత్రవార పత్రిక 57వ పేజీలో "శ్రీరామకథ"లో ఒక దృశ్యం అని శోభన్‌బాబు, దేవిక ఫోటోలను ప్రచురించినారు. అది సరియైనది కాదని నా ఉద్దేశ్యం. సీరియల్స్ "జీవితవలయం" "సుజాత" ఎంతో ఉత్సాహంగా సాగుచున్నవి. వాటిరచయి(త్రు)లకు ప్రచురించుచున్న మీకు నాహృదయపూర్వక ధన్యవాదములు. —కె. రత్నపాప (తెనాలి)



చాచానెహ్రూ. చిత్రం: ఎం. వి. సుబ్బరాజు

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 22—11—'68
కీలకనామ సం॥ మార్గశిరమాసం శుద్ధ తదియ

సంపుటము : 61 సంచిక : 13

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
'బంగారు సంకెళ్లు'లో నర్తకి జ్యోతి


మామూలు పద్ధతి

పాత కొత్తల సంఘర్షణ

డా. సుశీలానయ్యార్, ఆమె సోదరుడు ప్యారేలాల్‌నయ్యార్, ఇద్దరూ మహాత్మ గాంధీ శిష్యబృందంలోనివారే. శ్రీప్యారేలాల్ మహాత్మాగాంధీ జీవితచరిత్ర రాయటంలో మునిగిఉన్నారు. డా. సుశీలానయ్యార్ రాజకీయాంలోకి దిగారు. కొంతకాలం మాత్రం ఉన్న ఢిల్లీ రాష్ట్రంలో ఆరోగ్యశాఖ మంత్రి అయ్యారు. మంత్రిగా ఉన్న కాలంలో వారికి తమ ముఖ్యమంత్రి శ్రీచవుదరీ బ్రహ్మప్రకాష్‌తో తీవ్రమయిన అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఢిల్లీ రాష్ట్రం సృష్టించిన శ్రీ నెహ్రూగారు రాజీ చేదామని చూశారు. విఫలు లయ్యారు. దానితో కాంగ్రెసు పార్లమెంటరీ దినుసు ప్రజాస్వామ్యంలో సాధారణంగా కలిగే సంచలనం ఒకటి ఏర్పడింది. ఈ సంచలనంవల్ల స్పీకర్ సర్దార్ గురుబక్ష్‌సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. చవుదరీ బ్రహ్మప్రకాష్ మామూలు మంత్రి అయ్యారు. డా. సుశీలానయ్యార్ స్పీకర్ అయ్యారు!

ఢిల్లీ రాష్ట్రం రద్దు అయింది. డా. నయ్యార్ ప్రాక్టీసు పెట్టారు. ప్రాక్టీసు చేస్తూనే ఢిల్లీలో అసభ్యపు పోస్టర్లమీద ఉద్యమం లేవదీశారు. ఇందులో విఫలులు అయ్యారు.

బందిపోటు దొంగల సంస్కరణ

ఆ తర్వాత బందిపోటు దొంగల సంస్కరణని తలపెట్టారు. ఈ సంస్కరణకోసం 'గాంధీపద్ధతులని' వాడాలన్నారు. ఇందు లోనూ విజయం సాధించలేకపోయారు. ఈవారం కూడా ఒక పెద్ద దోపిడీ జరిగింది. ఆమె సోదరుడికి అంత పేరు ప్రతిష్ఠలు లేవు. ఆయన ఒక ప్రమాదంలో మరణించారు. శ్రీ నెహ్రూ ఆమెని మంత్రివర్గంలోకి తీసుకున్నారు.

పర్యటనలో ప్రథమం

ఆమె పదవిలో ఉన్నన్ని రోజులూ డా. నయ్యార్ పర్యటించినంత—దేశం లోపలా, బయటా — శ్రీయుతులు కరణ్ సింగ్, ఫక్రూద్దీన్ అలీ అహమ్మద్‌లు కూడా పర్యటించి ఉండరు. ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆమె పరిశ్రమల మంత్రి బాధ్యతలని కూడా నిర్వహించటానికి ఎంతో కష్టపడేవారు. పేటంటు చట్టాన్ని మార్చాలనేవారు. ఆమె సూచించిన మార్పులు రాలేదు. అవి వెనుకబడ్డాయి. వాటితో బాటే డా. నయ్యార్ కూడా వెనుకబడ్డారు.

ప్రస్తుతం ఆమె మద్యపాన నిషేధం గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు. శ్రీ మొరార్జీ దేశాయితో బాటు గాంధీగారి ప్రాతినిధ్యపు కీర్తి పంచుకుంటున్నారు ఈ విషయమయి; అక్టోబరు2, 1969నుంచి పూర్తి మద్యపాన నిషేధం కోసం ప్రయత్నిస్తున్నారు. మద్యపాన నిషేధ యుద్ధం నిషేధం లేని గోవాలో జరుగనున్నది (ఇది రాసే సమయానికి) ఒక పక్షం నాయకుడు శ్రీ దేశాయి.

అజ్ఞానంలో ఆనందం

కొందరు కాంగ్రెసు నాయకులు అనుశీలనమూ, పఠనమూ బుద్ధికి మంచిది కాదనుకుంటారు. డా. నయ్యార్, శ్రీ దేశాయి ఈ కోవకి చెందినవారు. 1962లో ఆండ్రూసిన్‌క్లేర్ అనే అతను అమెరికాలో మద్యపాన నిషేధం గురించి ఒక పుస్తకం రాశాడు. అందులో ఒకచోట ఇలా ఉంది—

'అమెరికాలో 1920 నుంచి 1933 దాకా మద్యపాన నిషేధం ఉండేది. ఈ నిషేధం ఉన్న కాలంలో పెద్దరకం దొంగముఠా నాయకుల కథలు చాలా పుట్టాయి. అంతేగాని, 'అసలు నిషేధం అనే విధానం ఎలా పుట్టింది, బతికింది: నశించింది?' అనే ప్రశ్నకి ఎవరూ సరయిన సమాధానం ఇవ్వలేదు. కొంత జాగ్రత్తగా పరిశీలిస్తే 'నిషేధ విధానం' అమెరికాలోని గ్రామ ప్రాంతాల వారు నగర ప్రాంతాలవారికి ఎదురుగా చేసిన తిరుగుబాటు అనిపిస్తుంది. అమెరికాలో కొంతకాలంగా గ్రామ ప్రాంతం వారు స్థిరపడి పోయి ఉన్నారు. నగరాలు పెరగటం ప్రారంభించే కాలానికి యూరప్ నుంచి ఎందరో వలసరావటం మొదలు పెట్టారు. వీరికి 'బీర్' పానం బాగా అలవాటు. ఈ అలవాటు గ్రామీణ ప్రజలకి ఇష్టంలేదు. అసలు ఈ అయిష్టానికి మూలకారణం పారిశ్రామికాభివృద్ధి ద్వేషమే. సాంప్రదాయం సంస్కరణని ఎదిరించే చిహ్నం.

కొత్త ప్రపంచం

'ఇప్పుడు ఆలోచించిచూస్తే, 'అమెరికాలో మద్యపాన నిషేధోద్యమానికి ఎలా విజయం వచ్చింది?' అనే సందేహం కలుగుతుంది. ఉడ్రో విల్సన్ (అధ్యక్షుడు)కి జోసెఫస్ డేనియల్స్ అనే నావికదళ కార్యదర్శి ఉండేవాడు. ఆయనని గురించి ఆయన కొడుకు జొనాథన్ ఇలా రాశాడు: 'తర్వాతితరం వారెవరికీ మద్యపాన నిషేధ వాదుల వాలకం అర్థం కాదేమో, మానాన్నగారు మాత్రం మద్యపాన నిషేధం ఉద్యమానికి చాలా ఆశాభావం, హృదయపూర్వకమయిన విశ్వాసం తీసుకువచ్చారు. వివేకవంతులయినవారిలో ఆశాభావం, విశ్వాసం ఎలా కలుగుతాయో తెలుసుకుంటే మద్యపాన నిషేధం ఉద్యమం కొంత అర్థం అవుతుంది. విక్టోరియా యుగంలో ఎందరో అభివృద్ధి, శాస్త్రం, సంస్కరణ, పాండిత్యం మద్యపాన నిషేధాన్నే బలపరుస్తున్నాయని నమ్మేవారు. సారాయి మానివేస్తే మానవజాతి మొత్తం మీద బాగుపడుతుందని కొందరు జన్య

శాస్త్రజ్ఞులు చెప్పేవారు. పెద్ద నగరాలలో అవినీతిగూండాతనానికీ మద్యపానానికీ సంబంధం ఉందనీ, నిషేధంవల్ల సంస్కరణ, అభివృద్ధి సాధ్యమనీ నమ్మేవారు. వైద్యులు సారాయి ఆరోగ్యానికి ఎంత చెడుపో వివరించేవారు. బీదవర్గాలలో మద్యపానం ఎంత దుఃఖానికి కారణమో సంఘసేవకులు కళ్లారా చూడగలిగారు. స్త్రీ జనోద్ధరణ ఉద్యమం మద్యపాన నిషేధాన్ని బాగా బలపరిచింది. ఆడవారికి వోటింగు హక్కులు మద్యపాన నిషేధానికోసమే పనికి వస్తాయని ఎందరికో అనిపించింది...

'అసలు మద్యపాన నిషేధం కావాలనే వారి వాదం ఎందుకు నెగ్గిందో అర్థం చేసుకోవటం తేలిక. వారి చేతుల్లో బలమయిన ఆయుధాలు చాలా ఉండేవి—డబ్బు, ధ్యేయం, స్పష్టమయిన కార్యక్రమం, ఇవన్నీ. ఇవికాక అసంఖ్యాకులయిన విద్యార్థుల తల్లులు మద్యపాన నిషేధం కావాలని వారి పిల్లలకి నూరి పోసేవారు. చరిత్ర, ఆశాభావం నిషేధం కావాలనే వారి పక్షం ఉన్నట్లు కనిపించేవి. విశ్వాసంతో, ఆశతో సారాయిలేని ప్రపంచం; తద్వారా నేరం, పాపం లేని ప్రపంచం కోసం ఎదురు చూసేవారు...

సారాయి రాక్షసుడు

'సారాయి రాక్షసుడితో యుద్ధాన్ని గెలువగలమనే గట్టినమ్మకం నిషేధవాదులకి ఉండేది. దేవుడూ, చరిత్రా కూడా వారి వయిపే అనుకునేవారు. అమెరికా అంతర్యుద్ధం సమయానికి 13 రాష్ట్రాలు మద్యపాన నిషేధం అమలుపరిచి చూశాయి. యుద్ధానంతరం ఈ పదమూడు రాష్ట్రాల సంఖ్య మూడుకి తగ్గింది! కాని, 1880కి మరొక అయిదు రాష్ట్రాలు మద్యపాన నిషేధం అమలుపరిచాయి. ఈ పరిస్థితి ఎంతోకాలం నిలువలేదు. ఎనిమిది కాస్తా మూడు అయింది. అయితే మూడవసారి మద్యపాన నిషేధం ఉద్యమం బాగా జోరుగా జరిగింది...మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మద్యపాన నిషేధం ఉద్యమం విజయం సాధించింది. 1920 నుంచి 1933 దాకా అమెరికాలో పూర్తి మద్య పానీయ ఉత్పత్తి నిషేధం అమలులో ఉంది. మద్యపానాన్ని నిషేధించే చట్టం మాత్రం అమలు కాలేదు. చివరికి నిషేధం పూర్తిగా అపజయం పొందింది.'

1927 లో వాల్టర్ లిప్‌మాన్ అనే వ్యాఖ్యాత కూడా ఇదే ధోరణిలో రాశాడు. పెద్ద సాంఘికమయిన మార్పువస్తే దానికి ఇష్టపడనివారు చాలామంది ఉంటారనీ, ఈ ఇష్టపడకపోవటం ఎన్నోతరాలుగా ప్రదర్శించబడుతుందనీ ఆయన అన్నాడు.

లింకన్–రూస్‌వెల్ట్

అమెరికాలో గ్రామీణ ప్రాంతాలు మారిన కొద్దీ, నాగరిక జీవన పరిమాణం పెరిగిన కొద్దీ మద్యపాన నిషేధం వేడి తగ్గిపోయింది. అబ్రహామ్ లింకన్ అమెరికా, ఫ్రాంక్లిన్ రూస్‌వెల్ట్ అమెరికాగా పూర్తి పోయింది. పాతవాసనలే ఎల్లప్పుడూ ఉండిపోతాయనుకోవటం పొరపాటు.

నేడు భారతదేశంలో పాత — కొత్తల మధ్య పోరాటం జరుగుతోంది. గ్రామీణ — పట్నవాసాల మధ్య ఘర్షణ ఏర్పడింది. మహాత్మాగాంధిగారి దృష్టిలో పారిశ్రామికమయిన అభివృద్ధికి స్థానంలేదు.

కానీ, మహాత్మాగాంధీగారు ఒక్క మద్యపానం మాత్రమే నిషేధించారా అంటే అదిలేదు. ఆయన కుటుంబ నియంత్రణం వద్దన్నారు, డా. సుశీలానయ్యార్ కుటుంబ నియంత్రణ పథకాలని గట్టిగా బలపరిచేవారిలో ఒకరు. ఒక కుటుంబనియంత్రణ సాధన కర్మాగారం ఆమె ప్రోత్సాహం వల్లనే నెలకొల్పటం జరిగింది. ●



అమెరికా కొత్త అధ్యక్షుడుగా ఎన్నికైన శ్రీ నిక్సన్.



ఇదే ప్రపంచం

శ్రీమతి లొమర్ల మహేశ్వరీదేవి

మే—13

"స్వప్న జగత్తులో విహరించడం చాలించు మహీ! వాస్తవిక ప్రపంచంలోనికి తరచి చూడు. తాజమహల్ సౌందర్యాన్ని ఆస్వాదించడం చాలించి మనవూరి వెలుపలి పూరిపాకల్ని అవలోకించు, వూహలు చెరిగిపోతాయి. అనుభవాలే నిలుస్తాయి." రావుగారు ఉత్తరంలో వ్రాశారు. నాకు చిరాకేసింది. రోజంతా కలలుకంటూ కూర్చుంటానని ఆయన అనుకుంటారు. ఇవాళ మా ఆఫీసులో కొత్తగా చేరిన గుమాస్తా, ఒకప్పుడు మా ఆఫీసరుగారి భార్య క్లాసుమేటు అట. అప్పుడే ఎలా తెలిసిందో గాని మా ఆఫీసుపక్షిగాళ్ళంతా ఒకటేగొడవ. ఆడవాళ్ళపై సామెతలు పేర్చారుగానీ ఈ మగాళ్ళు వాళ్ళకంటే ధ్వాన్నమయిపోయారు. ఆఫీసుపని చెయ్యటానికి ఏడుస్తారు గానీ అభాండాలు వేసే కార్యక్రమాలు అర నిమిషం ఆలశ్యం లేకుండా అమలు జరిపేస్తారు. ఈ జబ్బు తాలూకు లక్షణాలు నాకూ అంటుకున్నాయేమో! మరేమోగానీ, సాయంత్రం దీని గురించి ఆలోచించుకుంటూ కాఫీపొడి, హార్లిక్సు బాటిలూ కొనడం మరిచిపోయాను. అమ్మ ద్వారం దగ్గరే రెండు, ఆ తర్వాత కాఫీఇస్తూ నాలుగూ వాట్లు పెట్టింది. అన్నట్టు హార్లిక్సు బాటిల్సు దొరకడంలేదు. బాబుగాడికి రెండు రూపాయలు ఎక్కువిస్తే ఎక్కడన్నా తెచ్చి పెడతాడు. కానీ బ్లాక్ మార్కెటీర్లను ప్రోత్సహించడం..... అమ్మకోసం తప్పదు మరి.

మే—15.

ఆఫీసునుండి యింటికి వచ్చేటప్పటికి సత్య ఎదురుచూస్తూ కూర్చొనివుంది. పిక్చర్‌కు పోదాం రమ్మని బలవంతం. ఖాళీపర్సు చూపించాను. సగం నెల గడవకముందే ఎన్. బి. (నిల్ బాలెన్సు) ఏమిటి? అంది. రమపెళ్ళికి రింగ్ పంపిన విషయం గుర్తుచేశాను. 'నా దగ్గరవుందిలే రా' అంది. ఫ్రెండ్స్ నెత్తిన ఆయుధం రుద్ది సినిమాలకి, హోటళ్ళకి వెళ్ళడమంటే రావుగారికి చిరాకు. 'ఫ్రీ' అంటే సరువు నిగొట్టే 'పోర్'అంటారు. కానీ సత్య వదలదని వెళ్ళాను. హాలువరకూ హేపీ మూడ్. కానీ లీలను చూశాక మనసంతా పాడయిపోయింది. లీల గురించి యేం వ్రాసుకోను?

లీల పి. యు. సి.లో మా క్లాస్‌మేట్. మంచికి కొలబద్ద ఏది? దేనితో కొలిచి మంచి చెడ్డలు నిర్ణయిస్తారోగాని మొత్తానికి లోకానికి చెడ్డది. నా మట్టుకు నాకు మాత్రం మంచిదే! చదువుకొనే రోజుల్లో తనకి మగాళ్ళంటే కిట్టేదికాదు. ఆ తర్వాత ఎవరో పేద కుర్రాడిని ప్రేమించింది. హృదయంలో నిం కొని ఆరాధించింది. అందుకే లక్ష రూపాయల ఆస్తి వస్తుందని తెలిసి అతని పెళ్ళి మరొకరితో జరగడానికి అతన్ని ఒప్పించి తన ప్రేమను త్యాగం చేసింది. పెళ్ళయ్యాక అతనిభార్య అవిటిదని తెలియడంతో అతను తిరిగి తన ప్రేమను, శరీరాన్ని కోరినప్పుడు కాదనకుండా అర్పించింది. ఆ తర్వాత అంతా కల్లోలం. ఇటు తనను తనవారం

దిగా నిరాకరించారు. అటు అతను లక్షాధికారులైన అత్తవారింట్లో బందీ అయ్యాడు. మొత్తానికి పెళ్ళి కాకుండానే తల్లిగా నిలబడాల్సి వచ్చింది.

ఆ ధైర్యశాలి శిశుహత్యగ్గాని, ఆత్మహత్యగ్గాని తలపెట్టలేదు. తన ప్రేమ చిహ్నం కోసం బ్రతికే వుంది. ఇప్పుడు రెండేళ్ళవాడయ్యాడు ఆ కొడుకు. ముద్దుగా, బొద్దుగా చిట్టిచిట్టి అడుగులేస్తున్నాడు. ప్రస్తుతం తను ఎవరో మహారాష్ట్రుల ఇంట్లో ఆయాగా వుంటోందిట. గౌరవనీయమైన కుటుంబంలో పుట్టి గారాబంగా పెరిగి ఆఖరికి ఆయాగా లోకం దృష్టిలో పతితగా బ్రతకాల్సిన గతి పట్టింది దా?

...వుగారు వ్రాసినట్లు ప్రపంచం రంగు నాకిప్పుడు నల్లగా వున్నట్టనిపిస్తోంది. లీల వంటి త్యాగశీలను, పవిత్ర మూర్తిని పతితగా నిలబెట్టిన ఈ ప్రపంచం నిజంగా కసాయిది.

లీలను మాతోపాటు క్లాస్ టికెట్‌కు రమ్మంటే నిరాకరించింది. "దని వున్న లీలను కాదు సుమీ! ఒకరింట్లో పని చేసే పేద లీలను. నాకీ లోక్లాస్ అలవాటయిపోయింది. దయచేసి బలవంతం చేయకండి." జీవంలేని నవ్వుతో గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయింది. అప్పటి నా కన్నీటికి సత్య వ్యాఖ్యానం. "నెత్తిపై వుండే నీళ్ళు కడవ నీకు. ప్రతిచిన్న విషయానికీ కన్నీరే. ఇప్పుడేమయిందని"..... "లీలను చూస్తే బాధ కలగడం లేదూ?" అంటే "బాధేముంది? కళ్ళు మూసుకొని ప్రేమంటూ బయల్దేరి పతనమయింది. చేతులారా చేసుకున్నదానికి ఎవరేం చెయ్యగలరు? ఇంకా నయం! మనతోరాలేదు" అంది. నాకు కోపం వచ్చింది. 'మరి నువ్వు కూడా ప్రేమించే పెళ్ళాడావుగా' అన్నాను. "అవును పెళ్లి చేసుకున్నాను. అర్థంలేని త్యాగాలు చేసి, ఆతర్వాత పెళ్ళయిన వాడితో వెధవ తిరుగుళ్ళు తిరగలేదుగా" సత్య తను లీలతో పోల్చబడ్డం చాలా అవమానంగా భావించినట్లుంది. ఈసారి కోపంలో సత్య మునుపటిలా అందంగా వున్నట్టనిపించలేదు. ఏమయినా సత్యకంటే లీల ఉన్నత పథంలో వుంది. ఆ విషయమే రవుగారికి వ్రాశాను.

మే —18

ఇవాళ ఆదివారం కదా! ఆఫీసు లేదుగదా అని బద్ధకంగా పడుకున్నాను. వీధిలో ఏదో గొడవ. కేకలు విని లేచి కిటికీలోనించి క్రిందికి చూశాను. వీధి చివర పాక దగ్గర సీత అరుస్తోంది.

"అమ్మో! ఎంతలావు కొట్టేవురో! నీ సొంద! నీ చేతులిరగ! నీకన్నా కాలూ పడ!" ని తలమీది దెబ్బనుండి రక్తం ధారలుగా కారుతోంది. ప్రొద్దుటే రక్తం చూశానేమిటా అనుకున్నాను.

సీత ఏడుస్తూ రెండు చేతులతోనూ రక్తం రాకుండా తల పట్టుకొని చింతచెట్టు క్రింద బండ మీద కూలబడి తిడుతోంది. "పాముకి పాలోసినట్టు పెంచా నానిన్ను. ఇస్సోసం లేని కుక్కా! నీకే పోగాలంరా! నేను సత్తే నీకు గెంజోసే దిక్కన్నా లేదురా!" ధారా ప్రవాహంలా తిడుతోంది. ఎవరో తలకి కట్టుకట్టారు.

సీత కథ మామూలే. దాని మొగుడు నారాయణ పదేళ్ళ క్రిందట తాడి చెట్టు మీదనుంచి క్రింద పడ్డాడు. కాళ్ళు విరిగిపోయాయి. ఏ పని చెయ్యడానికి పనికిరాకపోయినా పెళ్ళాన్ని సాధించడానికీ, కర్రకీ చేతికీ అందినంత దూరంలో వుంటే కొట్టడానికే పని కొస్తాడు.

సీతను చూస్తే అమ్మకు మంట. అది మంచిది కాదట. "భర్తను ఇరువైనాలుగ్గంటలూ తిడుతూ వుంటుంది. ఇది చస్తే నరకానికిపోతుంది" అంటుంది. "యేం! ఎందుకు తిట్టదు? వాడు ఏ పనీ చెయ్యడు. అది కష్టపడి సంపాదించి తెచ్చి పెడ్తోంది. ఇంకా పీడు తిని నోరుమూసుకుని కూర్చోక అది కావాలి, ఇది కావాలి అని అరుస్తాడు. తాగడానికి డబ్బులివ్వకపోతే తంతాడు. ఎప్పుడన్నా కూర వండకపోతే, వంట ఆలస్యమైతే పెద్ద గొడవ. మగాడు సంపాదించి పెడుతున్నా మాటంటే పడరీ రోజుల్లో. ఇదే వాడ్ని పోషించి ముప్పూటలా కాఫీకి, కల్లుకి డబ్బులిస్తోందే..... మరి..... దానికి కష్టం కలిగి తిడితే పడలేడూ? చచ్చినట్లు పడవలసిందే! నన్నడిగితే సీత నరకానికి పోదు. దేముడు నిజంగా పురుష పక్షపాతి కానట్లయితే సీతకి తప్పకుండా స్వర్గంలో స్థానం వుంటుంది. అవిటివాడ్ని వాడి ఖర్మానికి వదిలేయకుండా పదేళ్ళనుండీ పోషిస్తూ, నలుగురు పిల్లల్ని పెంచుతూ ఇంకావాడి చేత దెబ్బలు తింటూ బ్రతుకు ఈడ్చుతుందంటే అది అనసూయకన్నా అరుంధతికన్నా వేయిరెట్లు నయం."

అమ్మకి నా భావాలు విప్లవాత్మకంగా వుంటాయి. 'పాపం! సీత! ఆనాటి సీతకన్నా బాధ పడుతోంది. పగలంతా రెక్కలిరగ కష్టపడాలి. ఇంటికి రాగానే భర్తకీ, పిల్లలకీ వండిపెట్టాలి.' ఈ మాటంటే అమ్మకు మహాపరాధం చేసినంత బాధ కలుగుతుంది. "ఛీ! దాన్ని సీతమ్మవారితో పోల్చకు. దీనికీ, తాపీ మేస్త్రి సుబ్బారావుకి సంబంధం వుందట. అయిదూ, పదీ ఇస్తే తెచ్చి ఇంట్లో గడపుతోంది. ముదనష్టపుది. లేకపోతే అది కష్టపడి తెచ్చే రూపాయి డబ్బులూ అంతమందికి సరిపోతుందేమిటి?" అంటుంది రహస్యంలా.

ఈ విషయం గట్టిగా ఆలోచిస్తే సీతపై గౌరవం ఇనుమడిస్తుంది. కానీ అంత హీనంగా బ్రతికేకంటే గోదావర్లో దూకి చస్తే మంచిదంటుంది సత్య. ఈవిడా అమ్మలాంటిదే. కాకపోతే సీత ఆవు స్తత్యం ఎందుకు అర్థం కాదు?

సీతకి నారాయణ అంటే ఎంతో ప్రేమ. అది ఆ అవిటి వాడికోసమే బ్రతికుంది. ఆమెలేకపోతే అతనికీ, పిల్లలకీ నిలువ నీడలేదు. కష్టపడి తెచ్చే చాలీచాలని తిండితో వాళ్ళను చంపక తన శరీరాన్ని కూడా అమ్ముకొని వారికిలోటు లేకుండా పెంచుతోంది. యే స్త్రీ అయినా అంతకన్నా చేయగల త్యాగం మరేముంటుంది? ఉత్తప్పుడు సీత అంటుంది. "నేను చెడ్డదాన్నే, చెడినదాన్నే! న మొగుడ్నీ పిల్లల్నీ పస్తులతో సంపకుండా చూసుకుంటున్నాను. కలిగి వోళ్ళందరూ కోరికల కోసం యేదుత్తుంటే, నేను నా సంసారం కోసం గడ్డి తిన్నాను. నలుగురిచేతా మాటపడ్డా పైనున్న దేవుడే ఎరుగును నా మంచి. నేనూ నా సుకంకోసం ఎవడితోనో పోతే ఈళ్ళందరూ ఏమయిపోదురో? నన్నంటుకోకు నా మాలకాకి అని మడికట్టుకుంటే రాకలిచ్చేవోడెవరు? నా మొగుడూ కష్టపడి సంపాదిస్తే ఇంట్లోనుంచి బైటకు ఎల్లకేపోదును. బుద్ధిలేవోళ్ళు పదిమందికి నేనే సెప్పను."

సీతమాటల్లో సత్యం వుంది. అది అందరికీ కనిపించదు.

రాత్రి అమ్మతలకు అమృతాంజనం రుద్దుతూ తిట్టింది. "అనవసర విషయాలన్నిటి గురించీ ఆలోచించి తల నొప్పి తెచ్చుకుంటావు. ఇది మారని లోకం పాపా! నీకలం పోట్లకు పగలని పచ్చి బండ."

అమ్మ మాటలు అనుభవపూర్వకమైనవి.

మే —20.

రవుగారినుంచి ఉత్తరం వచ్చింది. మిస్ బెలో జ్యోరాప గురించి రెండోసారి వ్రాశారు. వీరొకరు. మాటిమాటికీ నా సహనానికి పరీక్షలు పెడ్తారు. ఎందుకో.....ఆలోచించే కొద్దీ స్త్రీ పురుష సంబంధం తప్ప ప్రపంచంలో మరే విషయానికీ ప్రాధాన్యత నివ్వరా అనిపిస్తోంది. ఆయన ఎంతమందితో సంబంధం కలిగివున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. బాధపడాల్సింది అసలే లేదు. అవకాశం దొరికితే ఎదురుకొనే ప్రవరాఖ్యులు ప్రపంచంలో బహు అరుదు. అందునా ఈయన 'వెరైటీ' కోరేతత్వం. అలా అని నాకు దూరవవుతారని కాదు. ఎక్కడవున్నా, ఎలావున్నా యేం చేస్తున్నా వారిలో నిలబడే బింబం నాది మాత్రమేనని నాకు బాగా తెలుసు. ఆ విషయమే ఆయనకి వ్రాశాను.

మే —22.

లోకంపోకడ ఎలా వర్ణించి వ్రాసుకోను? 'నిప్పు లేనిదే పొగరాదు.' దన్ని తిరగేస్తే 'పొగవస్తే అక్కడ నిప్పు అంటుకున్నట్లే!' పాపం! ఎమ్. బి. గుమాస్తా రఘుకి, ఆఫీసరుగారి పర్సనల్ కళ్యాణికి లేనిపోని సంబంధం అంటగట్టి పూరేగారు మా ఆఫీసు తదితర ఉద్యోగబృందం. నిప్పులేనిదే పొగను పుట్టించారు. కానీ ఈపొగనుచూసి నిజంగానే నిప్పు అంటుకుందికళ్యాణి. సినిమాలో ప్రక్కనే కూర్చొని మొరుగుతున్న కాషియరు కామేశ్వరరావు ముఖంమీద ఉమ్మి 'ఇప్పట్నుంచి నిజంగానే తిరుగుతాను' అని సవాలు చేసి లేచి వచ్చేసిందట. ఇప్పుడు రఘు, కళ్యాణి పబ్లిక్‌గా, సినిమాలకి,షెల్లకీ తిరుగుతున్నారు. ఈ మాలకాకులన్నీ అరవడం మానేసి మూగనోము పట్టాయి.

మా ఆఫీసరు సీతారాంగారు అయిదుపదులు దాటాక మూడోసారిగా రెండుపదుల కళ్యాణిని చేసుకున్నారు. ప్రవహించే జలపాతానికి ఎంతో కష్టపడి మురుగునీటి గొయ్యిదగ్గరకి కాలవ త్రవ్వినట్లయింది. కళ్యాణిలో రేగిన కోరికల వరదకి సీతారాంగారు ఆనకట్టవెయ్యాలని చూడలేదు. వేసినా నిలబడదని ఆయనకి తెలుసు.

కళ్యాణి 'పరిచయం'తో రఘు దశ మారింది. ఆఫీసుకి స్కూటరుపై వస్తున్నాడు. మడత నలగని టెరిలిన్ సూటింగ్స్‌లో. వాళ్ళావిడ శాంత, కళ్యాణి షాపింగ్‌కు రావడం నేను చూశాను. కళ్యాణి బర్త్‌డే పార్టీలో మాసిన నవ్వుల గాజులు కొంత చేతులకి వుండడం, కళ్యాణి ప్రాకెట్ శాంత కూతురి

ఇదీ ప్రపంచం

మెడలో వ్రేలాడ్డం చూశాను. కళ్యాణి పిచ్చిదయిందనిపించింది. కొంత అంతా తెలిసి పూరుకొనడంలో పెద్ద త్యాగం చేసిందనుకోను. అదొక రకమైన స్వార్థం. సాటి స్త్రీ పతనానికి దోహదం చేసే బలహీనత.

ఇంకా విచిత్రం ఏమిటంటే ఒకప్పుడు గుసగుసలాడిన ఆఫీసు స్టాఫ్ ఇప్పుడు రఘు వెనక బాబు తగిలించి రఘుబాబుగారి అనుగ్రహం కోసం కాఫీలు, టిఫిన్లు, సిగరెట్లు, సినిమా ఖర్చులు నైవేద్యం సమర్పిస్తున్నారు. కళ్యాణి గురించే ఎక్కువ బాధగా వుంది. రఘు రాక పూర్వం ఆఫీసులో ఒకరిద్దరు ఆమె అనుగ్రహం కోసం తాపత్రయపడినా అణిచే వుంచింది. కానీ రఘురాక కాలేజీ స్మృతులు రేపిందో, లేక లోకం వేసిన 'నింద' 'నిజం' కావాలని పగ బట్టిందో కాని తిరగ పడింది. ఆమె పథవిహీన అయ్యిందా? సత్యకు చెబితే వాళ్ళంతా 'చరిత్రహీనులు' అంది పెద్ద బెంగాలీ కవిలా......

మే 24.

ఇవాళ అన్నీ చెడువార్తలే విన్నాను. పెద్దక్కయ్యగారి అబ్బాయికి మశూచి అట. మా అత్తగారి చిన్న కోడికోడలు అచ్చమాంబ విషం మ్రింగి చచ్చిపోయిందిట. కారణం "భర్త వదిగి వచ్చిన పిల్లలకి పెళ్ళిళ్ళన్నా చెయ్యకుండా చెడు తిరుగుళ్ళు తిరగడం."

ఆమె అలా చెయ్యడం తప్పు తెలివి తక్కువ అంటుంది సత్య. కానీ నాకు కొంతవరకూ మేలే అనిపిస్తోంది. ఇప్పుడయినా అతడు తెలివి తెచ్చుకొని కుటుంబ విషయాలు పట్టించుకుంటాడేమో! ఎలాగూ పిల్లల భారం తెలిసి వస్తుంది కదా! ఇలా అంటే సత్య అంది: "నీవి పరస్పర విరుద్ధ భావాలు సుమా! సీత విషయంలో ఎంత పతితగా నయినా బ్రతికి వారిని పోషించాలంటావు. అచ్చమాంబగారు చచ్చిపోవడమే మంచిదంటావు." అవును మరి. సీత భర్త అవిటి. పిల్లలు చిన్నాళ్ళు. కష్టపడి సంపాదించే దిక్కులేదు. ఇంక అచ్చమాంబ గారు: అనుభవించాల్సిన సుఖాలేవీ లేవు. పిల్లలంతా పెళ్ళీడువాళ్ళు. నెరవేర్చవలసిన బాధ్యతలున్నా తనవలన జరిగేవి కావు. తను లేకపోతే తన పిల్లల భవిష్యత్తు చక్కబడుతుందనే ఆశవుంటే ఏ స్త్రీ అయినా ఆ మాత్రం త్యాగం చేసి తీరుతుంది. ఏమయినా ఈమె చావు భర్తకు కనువిప్పు కలిగిస్తుందనే నా పూర్తి నమ్మకం.

ఈ ఆలోచనలతో ఇవాళ జ్వరం తెచ్చుకున్నాను.

మే 26.

మా అత్తవారు ఉత్తరం వ్రాయించారు. ఉద్యోగం మాని రావలసిందని. తనను నలుగురూ నాలుగు మాటలూ అంటుంటే తల తీసి ప్రక్కన పెట్టినట్లు వుందట. మా అబ్బాయి రీసెర్చి పూర్తయే వరకూ చేస్తానంటే అంగీకరించాను గాని, వాడు అమెరికాలో ఇంకా రెండేళ్ళు వుంటే, నువ్వు నీ అమ్మగారింట్లో వుంటూ ఉద్యోగం వెలగ బెడతానంటే నేను ఒప్పుకొనేది లేదు. త్వరలో రిజైన్ చేసి రావలసిందని సారాంశం.

ఆ అనే నలుగురూ ఎవరు? ఎందుకు అంటున్నారు? చదువుకోవడం, ఉద్యోగం చెయ్యడం పెద్ద ఆశ్చర్యం కాదు. కానీ ఇంకా అనుకొనే రీతిలోనే వుంది ప్రపంచం. రావుగారు అమెరికాలో వుంటే నేను గోళ్ళు గిల్లుకుంటూ అత్తవారింట్లోనే కూర్చుంటే.... అప్పుడిక ఎవరూ ఏమీ అనుకోరు. అనరు. కాలం గడవక ఉద్యోగం చేస్తే నలుగురూ నాలుగు మాటలు..... ఆరుగురూ ఆరు మాటలు...... ఛీ.... పాడు ప్రపంచం..... మగవాడు ఉద్యోగం దొరక్క ఇంట్లో కూర్చుంటే చేతకాని వాడని గుసగుసలు. ఆడది ఉద్యోగం చేస్తే చక్రాలు తిప్పేస్తోందని నిందలు. ఆలుమగలిద్దరూ ఉద్యోగాలు చేస్తే సంపాదించేసుకుంటున్నారని ఏడుపులు.

ఉద్యోగ విషయంలో నిర్ణయం రావుగారికి వ్రాసి కనుక్కోవాలి.

మే 30.

ఏమిటీ మలుపులు? రఘుకి కళ్యాణికి గొడవ రేగింది. మా ఆఫీసు వాళ్ళకి కడుపునిండా కలహ భోజనం. నోటినిండా తాంబూలం, కాప్షియురు కామేశ్వరరావు నారదుడు. టైపిస్టు దుర్గుణ (సుగుణ) సూర్పణఖ. కామేశం ప్రోద్బలంతో సుగుణ వెళ్ళి రఘు తనను పిక్చర్‌కు రమ్మన్నాడని చెప్పిందట. కళ్యాణి కాళి అయింది. ఋజువు కోసం సుగుణతో కలసి నో షైముకి హాలు దగ్గరికి వెళ్ళింది. కామేశ్వర్రావు బలవంతంగా రఘుని హాలు దగ్గరికి లాక్కొచ్చి నిలబెట్టి ప్రక్కకు తప్పుకున్నాడట. కళ్యాణిని వదిలి సుగుణ అతని దగ్గరికి వెళ్ళింది. ఏమీ తెలియని రఘు సుగుణతో నవ్వుతూ మాట్లాడాడు. ఇంకేముంది? అనుమాన బీజాలు మొలకెత్తాయి.

అసలు కళ్యాణి తత్వం ఏమిటి? రఘు తాళి కట్టిన భర్త కాదుగా! అతని భార్య ఎదురుగా తామిద్దరూ తిరిగినప్పుడు కాంతకులేని బాధ అతను మరొక స్త్రీతో సినిమా కెళ్తే తప్పేమిటి?

ఇందులో కామేశానికి లాభించేది లేదు. సుగుణకు కామేశం ఇచ్చే డబ్బు, ప్రపంచం ఇచ్చే చెడ్డపేరు తప్ప మరేం రాదు. కానీ దీని పర్యవసానం కళ్యాణిపై తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చు.

రావు గారన్నట్టు వాస్తవిక ప్రపంచంలోకి తరచి చూస్తే ఆశ్చర్యం అసహ్యం తప్ప ఏముంది?

జూన్ 2.

లీల కన్పించింది. దాని కొడుకును కాన్వెంటులో చేర్పించిందట. తను మిలటరీ నర్సింగ్‌కు వెళ్ళిపోతుంది. దాని కళ్ళలో అనిర్వచనీయమైన కాంతి. ముఖంలో వెలుగుతున్న ప్రశాంతి. దాని త్యాగం, తత్వం అరుదైనవి. వెళ్తూ అంది. "గుడ్ బై మహీ! బాబు విషయంలో ఎడబాటు బాధే అయినా నాకీ మార్గమే ఉత్తమంగా కన్పిస్తోంది. బాబుని అంటిపెట్టుకొని పెంచి సంఘంలో వాడిని చిన్నబుచ్చడం కంటే వాడిని సరియైన

పోషణలో వుంచి దూరంగా ప్రజాసేవ, దేశసేవ చేయడమే సక్రమంగా తోచింది. అందుకే వెళ్లి పోతున్నాను. నా బాబు నేను లేకపోయినా కాన్వెంటు వాతావరణంలో సరియైన శిక్షణలోనే పెరుగు తాడన్న నమ్మకం నాకుంది. మహీ! శ్రమ అనుకో కుండా అప్పుడప్పుడూ మా ప్రభును చూస్తుండు.' అంది నా కన్నీళ్ళు తుడుస్తూ. "విత్ ప్లజర్" అన్నాను తలూపి. ఆది నా నుదుటిపై సున్నితంగా ముద్దుపెట్టుకొంటూ అంది. "పూర్‌గర్ల్! ప్రపం చాన్ని ఇంకా తరిచి చూడవోయ్! హృదయం గట్టి పడుతుంది."

అది వెళ్ళిపోతుంటే అనిపించింది. 'అర్థం లేని త్యాగాలు చెయ్యకుండా అతన్ని పెళ్ళాడి, వున్నంతలోనే తృప్తి పడివుంటే ఈనాడు పధ విహీనయై పారిపోవాల్సిన గతి పట్టేది కాదని.

లీల విషయం సత్యకు చెప్పాను. 'పాపం!' అని వూరుకొంది. ఆమె గురించి నాతో వాదించదు సత్య. లీల మంచిదని ఎక్కడ తన చేత వప్పించేస్తానేమో నని ఆమె భయం. "పాత చింతకాయ పచ్చడి" అన్నాను కసిగా. "నీ కిష్టమే కదా! తినేసెయ్!" అంది నవ్వుతూ. నాకు చిరాకేసింది. లీల మంచి తనం వప్పుకుంటే వీళ్ళకు చిన్నతనం ఏమిటో....

జూన్ 4.

రావుగారు సమాధానం వ్రాశారు. "ఉద్యోగ విషయంలో నీ నిర్ణయమే నా నిర్ణయం. నువ్వేం చేసినా ఆలోచించి చేస్తావన్న నమ్మకం నాకుంది. ఎవరేమన్నా బాధ పడవద్దని తొంబై తొమ్మిదో సారి నీకు వ్రాయడం." ఈ సమాధానం నన్ను తృప్తి పరచింది. కాని నే నింకా ఏ నిర్ణయానికీ రాలేదు.

అమ్మ ఉత్తరం చూసి అడిగింది. "మీ ఆయన ఎప్పుడు వస్తాడే?" నాకు నవ్వొచ్చింది. 'రెండ్రోజుల్లో' అన్నాను. "నిజమేనటే!" అంది. "అదేలే "రెండేళ్ళు." అన్నాను స్నానానికి పోతూ. "ఇదో పిచ్చిది." అనుకోడం విన్నాను.

సాయంత్రం సత్య 'నా డైరీలో ఒక పేజీ' చదివిందట. "మహీ! అప్పుడప్పుడూ పిచ్చిరాతలు వ్రాస్తావని తెల్సుగానీ, డైరీలో కూడా అలాగే రాస్తావనుకో లేదు. నీ గురించి వ్రాసుకోవాల్సింది పోయి ఇతరులు— వాళ్ళ తత్వాలు వ్రాస్తావేమిటి?" అని అడిగింది. "ఇతరుల గురించి నా అభిప్రాయాలు నన్ను గూర్చి వ్రాసుకొనడమే కదా! నా చుట్టూ జరిగే విషయాలు నా ఆలోచనలను ఎలా త్రిప్పు తుందో, నాలో ఎలాంటి భావాలను కలిగిస్తుందో వ్రాస్తాను. పాలవెల్లి రంగుల్లో వూహించడం మాని చీకటి ప్రపంచాన్ని చీల్చుకు చూడ్డానికి ప్రయత్నిస్తాను. నాకు తెలిసింది, మనసుక తోచింది. సమీక్షించి వ్రాసుకొని తృప్తి పడతాను. ఏమీ చెయ్యలేను సత్యా! ఇది ఆగని ప్రపంచ చక్రం. అంచులో బలవంతంగా తిరిగే రేఖలం మనమంతా." అన్నాను.

సత్య తెరపార చూసింది. సున్నితంగా విన్నాను మహీ! నీదొక వింత మనస్తత్వం.' అంది. నిజమే కాబోలు మరి—

జూన్ 10.

జీవితంలో మొదటిసారిగా ఎన్నడూ కలుగ నంత వేదన అనుభవించాను. కారణం సీత... కళ్యాణిల శిథిల జీవితాలు.

కళ్యాణి రఘువీరాది కసితో శేషుతో స్నేహం కలిపింది. ఆమె భర్త సీతారాంగారు ఆత్మహత్య చేసుకున్నారు. తను బ్రతికి వున్నట్టయితే అడ్డు అని. తర్వాత తగిన వాడిని ఎవరినయినా పెళ్ళాడి సుఖించమని ఉత్తరం వ్రాసి పెట్టారట. పిల్ల లెవరూ లేరుగనుక రెండు లక్షల ఆస్తి, ఇన్సూ రెన్సు, ప్రావిడెంట్ ఫండ్ అంతా మొత్తం ఆమె పేరనే వ్రాసేశారుట. కానీ ఏం లాభం? ఆ ఉత్తరాన్ని చదవగానే పిచ్చిగా నవ్వి, కేకలు పెట్టి స్పృహతప్పిన కళ్యాణికి ఇంకా తెలివి రాలేదు. మెంటల్ షాక్! కళ్యాణి దుర్బల హృదయ. రఘు వీరాది అనుమానంతో శేషు వైపు తిరిగింది. భర్త అవమానం భరించలేక ఆత్మహత్య చేసు కుంటే మతి చెడి పిచ్చిదయింది. ఇలాంటి స్త్రీ లెందరో? ......


సీత! దని మొగుడు నారాయణ మళ్ళా చావ బాదాడట. అది విసిగి నూతిలో పడి చచ్చిపోయింది. ఇది వాడికి భరించలేనంత శిక్ష. ఇప్పుడు పిల్ల లతో సహా దిక్కులేని వాడయ్యాడు. వాళ్ళ గోల చూడలేక పోయాను. వీధిలో వాళ్ళంతా మేడ్చారు. మంచి నీట బావిలో పడి చచ్చి నీళ్ళు త్రాగకుండా చేసిందని. ఆ క్షణంలో భగవంతుడ్ని తల్చుకొంటే అసహ్య మేసింది. మనుష్యుల నిలా సృష్టించి నందుకు .... సీతలాంటి స్త్రీ లెందరో!

భర్త, పిల్లలకోసం శరీరాన్ని ప్రాణాన్ని ధార పోసిన పేద సీత...... నీతికోసం నిలబడి పతితగా పిలువబడ్డ చదువుకొన్న లీల.... ప్రపంచాన్ని ఎదిరించి ఆ గాడిలో పడి నలిగి పోయిన కళ్యాణి...... బాధ్యత తెరుగని భర్తతో వేగలేక ఆత్మహత్య చేసుకున్న అచ్చమాంబ....... డబ్బుకోసం భర్త ఎలా తిరిగినా ప్రోత్సహించిన శాంత.... అసహ్యించు కొనే అమ్మ..... బాధపడే నేను.... తటస్థంగా వూరుకొనే సత్య.... అంతా స్త్రీలే! కానీ..... ఎంతో వ్యత్యాసం.

ఆఫీసుకు వెళ్తే కళ్యాణి విషాదగాథ ఆఫీసు మెంబర్ల నోటి వెంట బుర్రకథలా విన్పిస్తోంది. ఇంటికొస్తే ఎదురుగా సీత పాకలో పిల్లల యేడుపులు నారాయణ మూలుగులు. అబ్బ! ప్రపంచం లోకి చూడలేక కళ్ళు బరువెక్కుతున్నాయి.

ఈ రోజే రావుగారికి జాబు వ్రాశాను. ఉద్యో గానికి రిజైన్ చేసి అత్తగారి దగ్గరకు వెళ్ళిపో తున్నట్టు. సత్య ప్రశ్నకు సమాధానం చెప్పాను. "వాస్తవాన్ని భరించలేక పోతున్నాను సత్యా! మిథ్యలో జీవించడమే సుఖతరం. అందుకే నా ఆలో చనలను, బాధలనూ రేపే ఈ పరిసరాలను వదిలి వెళ్తున్నాను. అక్కడా ఏవో వుంటాయి. కానీ కొన్నాళ్ళ వరకూ పట్టించుకోవాల్సిన పని వుండదు. క్రొత్తకదా. నువ్వన్నట్టు నేను విరుద్ధ భావాలు కల వ్యక్తినే కావచ్చు. కానీ చూస్తూ ఆలోచించ కుండా, ఆలోచిస్తూ బాధ పడకుండా వుండలేను." కన్నీరు తుడుచుకున్నాను.

మధ్యాహ్నం లీల కొడుకు ప్రభును చూసి చాకలెట్లు టిన్ ఇస్తూ అనుకొన్నాను 'ఇదే ప్రపంచం' అని.



ప్రశ్నావళి ?

కె. రామలక్ష్మి

కె. వి, జగిత్యాల

మానసిక వ్యాధులు ఎక్కువగా స్త్రీల లోనే కనబడుతూ ఉంటాయి. కారణం ఏమై ఉంటుందండీ ?

మనస్సులో కుమిలే తత్వం ఆడవారికే ఎక్కువ కావడం వల్లనేమో!

పి. ఏ. ఎస్. పి, హైదరాబాదు

సుఖంలేని బ్రతుకు ఎన్నాళ్ళు అనుభవిస్తేనేమి ? ప్రాణంమీద తీపిచేత చేదుగా బ్రతకటం లోకం ఆనందమేమిటో బోధపడడం లేదు.

నిజమే. ప్రాణం మీద తీపి లేకుంటే బ్రతకడం కష్టం— ఎవరికేనా. అందుకేగా సుఖం లేకపోయినా, పూర్తిగా కృంగిపోయినా, ముందు కాలం బాగుండవచ్చు— నన్న ఆశ ఆధారంగా బ్రతికేస్తూ ఉంటాం బ్రదర్.

యస్. వి. ఎమ్. కె, అనంతపురం

రచయిత, రచయిత్రులు తమ నవలలో సృష్టించిన పాత్రల ఆదర్శములు తమ వాస్తవ జగత్తులో ప్రోత్సహించ కంరా ?

అంటే ధైవందిన జీవితం తప్పించి, వ్యక్తిగత ఔన్నత్యం మినహాయించి రచన చేయకూడదనా మీ ఉద్దేశ్యం?!

జె. ఎమ్, డబ్ల్యు, కొత్తగూడెం

హృదయంలో రహస్యం దాచాలంటే స్త్రీలా ? పురుషులా ? ఎవరిసంఖ్య ఎక్కువ?

మగవారే ఎక్కువ గుంభనగా ఉంటారని తోస్తుంది— ఈ నమ్మకానికి సంఖ్యల సాక్ష్యం నేను సేకరించలేదను కోండి— అయినా మన సామెత ఉండనే ఉందిగా ఆడదాని నోట నువ్వు గింజ నానదని!

కె. వి. మిర్యాలగూడ

నగలు నాణ్యాలు యివ్వలేనట్టి మగవాడు భువిలోన కాడా మగడు వాడు సతికి ఎప్పుడు?

నగలు నాణ్యాలు...... భౌతికంగా కాదు యివ్వ వలసినది. కాముల పేరు దిగవేసినంత మాత్రాన ఒరిగే దేముంటుందండీ.... నగ నాణ్యాలూ— సుఖ సంతోషాలకి పర్యాయ పదాలని భావించండి మాను గారూ.

ఎన్. ఎమ్, తణుకు

పొదుపు ప్రస్తుత కర్తవ్యంఅంటూ ఒక పక్క లెక్చర్లు దంచుతూనే మన మంత్రులు పెడుతున్న అనవసరపు ఖర్చులు చూస్తుంటే మనదేశ దారిద్ర్యం ఇప్పుడు కాదుకదా, ఇంకొక ఏభైయేళ్ళకి కూడా పోదని నొక్కి చెప్పకలను...

ఈ సంగతి మంత్రి వర్యులకీ తెలుసు భాయీ! వర్తమానంలో తమ అధికారంలో అరచేత వైకుంఠం చూపిస్తామని వల్లె వేయడం రాజకీయ నాయకుల బ్రతుకు తెరువు. వారిని మనం అపార్థం చేసుకో కూడదు.

ఎమ్. ఎ. ఎమ్, యర్రపోతవరం

కొందరు రచయిత్రులు తాము వ్రాసి పబ్లిషుచేసిన కథలు సంపుటానికి ఆకథలలో ఒకదాని పేరు పెడతారెందుకు?

మరా పుస్తకాన్ని ఏదో పేరుతో పిలవాలిగా? అందుకని. కథల లిస్టు అంతా పెట్టి పిలిస్తే బాగుండదు కదా? అందుకని. మనలో శ్రీ వీర వెంకట వరాహ నరసింహమూర్తి అని పేరుంటే సుఖంగా మూర్తి అంటాము, అలాగే ఇదీ అనుకోండి.

ఎస్. ఎస్. కె. పి. ఆర్. చిట్వేలి

జీవితంపై విరక్తి కలిగినప్పుడు ఆత్మహత్యకంటే మరేదైనా ఉపాయం ఉంటే చెప్తారా?

వృత్తి మార్చుకోవడం, ఉత్సాహంగా పని చేయడం— ఒక ఉపాయమే నండీ.

ఆర్. ఎన్. ఆర్, మహబూబ్‌నగర్

ఈ కాలములో కీర్తి గడించవలెనన్న ధనమా? గుణమా?

ధనమనే తొలి మెట్లు ఉంటే — సులభం. తరువాత గుణగణాలు చాలా దోహదం చేసి పైకి తెస్తాయి.

వై. సిహెచ్, పోతుకల్లు పోస్టు గుంటూరు

తెలుగు విద్యార్థిఅనే పత్రిక చిరునామా సంవత్సరచందా తెలియచేస్తారా?

తెలుగు విద్యార్థి పత్రిక కొద్ది కాలంగా నేను చూడడం పడలేదు. 'తెలుగు విద్యార్థి', బందరు అని రాసి వివరాలు తెలుసుకోండి.

బి. డి. ఆర్, సిద్దిపేట

మన చలనచిత్రములలో స్త్రీని సాధ్యమైనంత వస్త్రవిహీనగా మరీ ఎబ్బెట్టుగా కనబర్చుటచే పురుషునికి స్త్రీపట్ల ఆకర్షణ తగ్గిపోదా?

బహుశా అదే వారి ధ్యేయమేమో!

డి. పి. ఆర్, ద్రోణాచలం

నేనుమాత్రం వారభోజనములతో గడుపుతూ చదువు సాగిస్తున్నాను. ఇట్టి పరిస్థితులలో నేనేంచేయాలో చెప్తారా!

కష్టపడ్డా ఫలితం దక్కేలా పాటుపడాలి తమ్ముడూ, ఆచదివేది శ్రద్ధ తగ్గించక సర్టిఫికేటు వచ్చేలా చూసుకో. తరువాత ఏదో ఉద్యోగం దొరక్క పోదు—ముఖ్యంగా ట్రైనింగు అయిన వాడివి కనుక సులభంగా వస్తుంది. బి బ్రేవ్. అంతే.

వి. ఎస్. ఎన్, దార్లపూడి

మెరుపుతీగ రామలక్ష్మిగారూ ప్రతి శుక్రవారం ఆంధ్రపత్రిక చేతిలో పడేసరికి వారంవారం ఒక్కసారి మిలమిల మెరుస్తూ మీ జవాబులలో కన్పిస్తూంటారు వరుస పదినారం క్షణం ఒక యుగంగా...ఈ మనస్సు నిరీక్షిస్తుంది...

నిరీక్షణలో ఉన్న అందం అర్థం అవుతోంది కదూ?!

ఎ. ఎస్. ఎమ్, పార్వతీపురం

భర్తలని బజారులోకూడా సణుగుడుతో ఆడిపోసుకొనే స్త్రీలకి ఎలా నచ్చచెప్పాలి?

అది వారి భర్తల పాటు సోదరీ, మధ్య నీకెందుకు... ? అదిసణుగుడో స్వీట్ నథింగ్సో మన కెలా తెలుస్తుంది? దూరంగా ఉండడం మంచిది.

ఎమ్. వి, కలవ్వూరు

ఏమండీ రామలక్ష్మిగారూ, అష్టమి దినాలలో ప్రయాణం చెయ్యకూడదంటారు పున్నమిముందు పుట్టింటికి అమావాస్య ముందు అత్తింటికి వెళ్ళకూడ దంటారు. వీటిని మీరు నమ్ముతారా! పాటిస్తారా ?

బుకింగు దొరికిన రోజే మంచి రోజనుకోవాలి సోదరీ, యీ రోజుల్లో, అష్టమి నవమీలూ రాహుకాలాలూ చూస్తే రైళ్ళు అందుతాయా?

ఎస్. బి. ఆర్, హైద్రాబాదు

నీకు దేవుని పై గట్టిగా నమ్మకమున్నదా ?

ఉంది తమ్ముడూ, ఎక్కడైనా కనిపించాడా ఏమిటి ?



"సత్వవంతులయిన ఉత్తములకు సంపదలు లభిస్తాయి. సత్వహీనులను పెళ్ళాం బిడ్డలుకూడ వదలి పెడతారు." అని కళింగ దత్తుడు మహా రాజ తారాదిత్తుతో అంటూ మరొక కథ చెప్పాడు.

ఉజ్జయినీ అనే నగరి వుంది. అది ఈశ్వరునికి గౌరిలాగ ప్రియమైనది. ఆనగరం జనాల సంప దలకే పుట్టినిల్లు.

ఆనగరాన్ని విక్రమ సింహుడనే రాజు ఏలే వాడు. అతడు మహాబలవంతుడు. అతని మనో రథమే యుద్ధంలో అతని శత్రువుల నందరినీ నిశ్శేషం చేసింది. అయినా అతనికి యుద్ధం చేద్దామనే మనసు చాల వుండేది. బుజాలు దర్పంతో తిమ్మిరెక్కేవి.

అతని మంత్రి పేరు అమరగుప్తుడు. అతడు ఒకనాడు రాజుతో ఇలా అన్నాడు:— "దేవ, పూర్వం బాణాసురుడనే ఒక అసురుడు వుండే వాడు. అతడు వేయి చేతులతో పోతరించి వుండే వాడు. తనతో యుద్ధం చేయగల యోధుణ్ని అనుగ్రహించవల సిందని ఈశ్వరుణ్ని వేడాడు. అప్పుడు విష్ణువు, అతనితో బాహుయుద్ధం చేసి, ఓడించి వాని భుజ మండలిని చక్రాయుధంతో నరికి వేశాడు. అందు వల్ల గర్వించిన రాజులకు అభిమానం అవమా నంగా పరిణమిస్తుంది.

"కాని యుద్ధానికి మారు నృపులకు తగినది మరొక టున్నది. దానిని యుద్ధ ప్రతినిధి అం టారు. అది మృగయా—వేట. అయితే ఈమృగ యను కూడా మునులు తప్పు పెదరు. మంచి గుర్రాలు ఒకొక్కప్పుడు పొరపాట్లు చేస్తుం టాయి. రాజులకు అది—వేట వ్యసనంగా పరిణ మిస్తుంది. ఈమూడు సందర్భాలలో మాత్రం మృగయ దుఃఖం కలిగిస్తుంది. అందువల్ల వ్యస నం వదలి మృగయా క్రీడకు వెళ్ళు."

మంత్రి మాటలు రాజుకు నచ్చాయి. పరివా రంతో పాటు అడవికి వేటకు కెళ్ళాడు. అడవిలో ఏనుగులు, అడవి పందులు, శరభాలు, పులులు, సింహాలు కోలాహలంగా తిరుగుతున్నాయి. రాజు అవలీలగా వనమృగాలను సంహరించాడు. చాల సేపు వేటాడడం వల్ల అలసి పోయి రాజధానికి బయలు దేరాడు.

దారిలో ఏకాంతంగా ఇద్దరు మనుష్యులు పరస్పరం ఏవో కథలు, వార్తలు చెప్పుకుంటూ వున్నారు. రాజు వారిని చూచాడు. వారు ఎంత సేపో సంభాషించారు. రాజుకు సందేహం కలి గింది, ఇంత సేపు వీరు మాట్లాడుతూన్నారు, దొంగలో ఏమో అని. వారిని తన సమక్షానికి పిలుచుకొని రమ్మని ప్రతీహారుణ్ని పంపాడు. తను రాజధానికి వెళ్ళాడు.

మాట్లాడుతున్న వారిద్దరూ బ్రాహ్మ ణులు. ప్రతిహారుడు పిలువగానే చాల భయ కంపితులు అయ్యారు. ఉదయం గడగడవణుకుతూ రాజాస్థానం ప్రవేశించారు. రాజు వణికిపోతున్న వారిని చూచి, వారికి అభయమిచ్చాడు. వృత్తాంతం చెప్పమని ఆజ్ఞాపించాడు. వారిద్దరిలో ఒకడు ఇలా విన్నవించాడు.

"మహారాజా నాసంగతి వినండి. నాకు చిన్న తనంలోనే తలిదండ్రులు మరణించారు. నాకు దుష్టసావాసం ఏర్పడింది. నియుద్ధం—బాహు యుద్ధం—లోను, శస్త్రాస్త్రాలలోను కుశలు ణ్నయాను. జూదం వ్యసనమయింది. దేహబలం సాహసం మొదలైన వాటివల్ల మదమెక్కింది.

"ఒకమారు ఒక అడవి దారిని ఎవరో పెళ్లి వారు పెళ్లి కూతురితోపాటు తిరిగి తమ గ్రామా నికి వెళ్ళుతున్నారు. వారు నా కంట పడ్డారు.

...బృహత్కథామంజరి

నవవివాహిత చేతికి మంగళ కంకణాలున్నాయి. పెద్దమీద కూర్చుంది. సంతోషంగా వెళ్లుతున్నారు అందరూ. వివాహ మంగళ వాద్యాలు మోగుతున్నాయి.

"దురదృష్టం! ఆవాద్యాల మహారవానికి వెర్రెత్తిపోయిన ఒక ఏనుగు కట్లు తెంపుకొని అడవి పొదల్లో దాక్కొన్నట్టిది, ఎక్కడినుంచో దూసుకొని వచ్చి పెళ్లివారి మీద పడింది. పెళ్లివారు మద గజభయంతో ఎక్కడివారక్కడ పెళ్లికూతుర్ని వదలి పెట్టి కాలికి బుద్ధి చెప్పారు. పెళ్లి కూతురు భయంతో అక్కడే పడివుంది. ఆ ఏనుగు తామర తీగలాగ వున్న ఆవధువును వాసన చూద్దామనుకందో ఏమో తొండం కదిలిస్తూ దగ్గరికి వెళ్లింది. నామనస్సు ఆసమయంలో కరిగింది. ఏనుగులను ఒకరకంగా కూతలు పెడుతూ మోసం చేసి దారి తప్పించేవిధం నాకు తెలుసు. నవ వధువు మొదట్లోనే ప్రయాణపు బడలిక వల్ల సలిగి పోయింది. ఏనుగు భయంతో విహ్వలు రాలయింది. నేను ఏనుగును దారి తప్పించే ధ్వనులు చేసి వంచనతో తోలివేసి, ఆపెళ్లికూతురిని రక్షించాను.

"ఏనుగుభయం తీరిన తర్వాత, ఆనవవధువు నాతో కళ్లు పెద్దవి చేసి ఇలా అన్నది:

"ఈవ్యక్తికి ఇకనీవే వల్లభుడివి. ప్రాణాలకు నాధుడువి. నన్ను భయంతో వదలి పరుగెత్తి పోయాడే అతనికి భర్తను భర్త అని ఎలా అనగలను? ఛీ! ఛీ! నన్ను ఆమూర్ఖుడు చెరపలేదు సరికదా, తాకనైనా తకలేదు. నన్నునావారి వద్దకు చేర్చు. నీవు రహస్యంగా నావెంట రా. త్వరలో మనం కలుసు కొందాము."

"పెళ్లికూతురు నాకు అలా మాట ఇచ్చింది. నేను ఆమెను వారి బంధువులకు అప్పగించాను. ఆమె తనమనస్సంతా నాకే అప్పగించి భర్తయింటికి వెళ్లింది. ప్రేమపాశం పట్టిలాగగా నేనూ ఆమె వెంటే ప్రచ్ఛన్నంగా వెళ్లాను. ఆమె భర్తవూరు చేరాను. అక్కడ మారువేషంతో ఒక పాడు పడిన దేవాలయంలో బసచేశాను. మనసంతా ఆమె మీదే ఆశపెట్టుకుంది.

"ఆశూన్య దేవాలయంలో ఈ విప్రుణ్ని చూచాను. ఇతడు నేను ఎవరికోసమైతే వెళ్లానో ఆమె భర్త సోదరికి ప్రచ్ఛన్న కాముకుడు. ఆమె పైన ఇతనికి గల అనురాగం ప్రగాఢమైనది. కాని, అతి గూఢంగా ఉంచుకున్నాడు. ఇతనితో నాకు మైత్రి కలిగింది. ఇతని సహాయంతో నేను ఆ కామినిని, నాతాపాన్ని పోగొట్టె ఓషధి వంటిదానిని రహస్యంగా చేరుకున్నాను. ఇతడేమో ఆమెవదిన గారితో సంతృప్తి పడ్డాడు. ఈసంగతులే మహారాజా మేము ఆశూన్య స్థలంలో చాలసేపు మాట్లాడుకుంటున్నాము".

వారు నిజంచెప్పినందుకు విక్రమసింహ మహారాజు సంతోషించాడు. వారికి డబ్బిచ్చి పంపించి వేశాడు. సత్వావంతో ఎవరు సంతోషించరు? ఇలా సత్వసాంద్రుడైన విప్రుడు తన ప్రియురాలిని పొందగలిగాడు. సత్వహీనుడు భీరువు అయిన వాడు భార్యను పోగొట్టు కుంటాడు.

కళింగదత్తుడు ఒక దాని తర్వాత ఒకటిగా చెప్పిన కథ లన్నిటినీ తారాదత్త విన్నది. ఆనందంతో ఆమె ముఖం వికసించింది.

రాజు ఆమె దౌహృద చిహ్నాలకు, ఆశలకు అనుగుణంగా దోహదాలు చేకూర్చాడు. నెలలు నిండినతర్వాత ఆమె చంద్రకళవంటి ఒకకుమార్తెను ప్రసవించింది.

కుమార్తె కలిగిందని విని రాజు మనస్సు ఉద్విగ్నమయింది. కన్య అనేది మూర్తీభవించిన చింత. అలాటి కన్యవల్ల ఎవరి మనస్సు సంతోషపడుతుంది? అని ఆలోచిస్తూ, శంభు మందిరంలోని విహార మండపం లోనికి వెళ్లి తనమోహనివృత్తి కోసం భిక్షువులు చెబుతున్న ధర్మోపదేశం విన్నాడు:

"అహింస ఉత్కృష్టమైన ధర్మం. సన్యాసం శ్రేష్ఠమయిన సంపద. మోక్షమనేదే ఉత్కృష్టమైన కామం. ఈ గుణాలు, కారుణ్యం, క్షమ, మైత్రి ఇవి అలవరచుకోండి. క్షమ సకల జీవులకు పుణ్యసీయూషవాహిని. మైత్రి అనేది సంసారమరుభూమికి వర్షమేఘం వంటిది."

వారిలో ఒక భిక్షువు ఈగుణాలకు ఉదాహరణంగా ఒక కథ చెప్పాడు:– పూర్వం ఒక తపోవన సమీపంలో ఒక రాజపుత్రుడు తన ప్రియురాండ్రతో పాటు, విహరిస్తున్నాడు. ఆతపోవనం సమీపంలోనే మామిడి వనం వుంది. అది అప్పుడే ఫలిచింది. గాలికి చెట్లకొమ్మలు రెమ్మలూ ఊగుతున్నాయి. వారు అక్కడ విహరించిన తర్వాత రాజకుమారుడు మద్యపానంతో కైపెక్కి నిద్రపోయాడు. రాజకుమారికలకు వనం పరిసరాలు చూద్దామని కుతూహలం కలిగింది. విలాసంగా తిరగడం ప్రారంభించారు.

అక్కడ సమీపంలో ఒకముని కళ్లుమూసుకుని ధ్యాన నిమగ్నుడై వున్నాడు. అతనిని చూచారు. అతని చుట్టూ మూగి విలాసాలు వినోదాలు చేయడం ప్రారంభించారు.

ఇంతలో రాజపుత్రునికి మెలకువ వచ్చింది. చూచాడు. తనప్రియురాండ్రు ఎవడో అపరిచితుని చుట్టూ మూగి కేరింతలు కొడుతున్నారు. కోపం పెల్లుబికింది. ఈర్ష్య రెచ్చి పోయింది. లేచి, కత్తి దూసి, ఆవ్యక్తిని విసురుగాకొట్టాడు. ఆముని మహాక్షమా శీలుడు. ఆరాజపుత్రుడుఎన్ని సార్లు కత్తితో కొట్టినా కోపపడలేదు. క్షమావంతులు మిత్రుని మీద, శత్రునిమీద ఒకే చూపుతో వుంటారు. ఇదినిజం.

ఆపాపిష్ఠి రాజపుత్రుణ్ని తపోవనదేవతలు కాల్చివేయడానికి పూనుకున్నారు. క్షమా సాగరుడైన ఆముని వారిని వారించాడు. ఆ పని తగదన్నాడు. కత్తిదెబ్బలకు అతని దేహం తెగి వేలాడుతున్నది. అయినా అతడు కరుణను కోల్పోలేదు. తపోవ

దేవతలు అతనిని తాకారు. అతడు ముందు లాగే వజ్రకాయుడయ్యాడు.

పూర్వం హూకి అనే రాజు ఉండేవాడు. అతనికి మహా రూపవంతులైన ఏడుగురు కుమార్తెలు వుండేవారు. వారందరికీ ఈసంసారంపై రోత కలిగింది. అందువల్ల ఈ సంసారవాసన వదిలి పెట్టి వైరాగ్యంతో శ్మశానానికి వెళ్లిపోయారు. బంధుమిత్రులు వారిని బ్రతిమాలారు అలాటి పని చేయవద్దని.

'ఈశరీరం ఎముకలు, మాంసం, నరాలు, కమ్ముకున్న నిచవస్తువు. ఈ శరీరమూ, శ్మశానమూ ఒక్కటే. ఏమిటి ఈ రెండింటికీ భేదం? ఈ దేహంలోను, శ్మశానంలోను సప్త ధాతువులు నిప్పు మండిస్తుంది.'' అని ఆరాజకుమారికలు బంధుమిత్రులకు చెప్పి వెళ్లిపోయారు.

పూర్వం ఒక రాజపుత్రుడు వుండేవాడు. వాడికి రాజ్యమంటే విరక్తి కల్గి సన్యాసం పుచ్చుకున్నాడు. నియమంతో భిక్షతెచ్చుకొని గడిపేవాడు.

ఒక నాడు అతడు యధా రీతిగా భిక్షకు వెళ్లాడు. ఒక ఇంటిలో ప్రవేశించాడు. ఆయింటిలో ఒక సుందరి రూపానికే రూపం వంటి, యవ్వనానికే యవ్వనం వంటి, ఆసన్యాసిని చూచి కామపరవశురాలయింది. భిక్ష తీసుకొని వచ్చి,

''ఓసుందరుడా'' మనస్సును చల్లబరచే అమృత కిరణుడైన చందమామవంటి నీరూపం 'ఎంత మనోహరంగా వుంది! ఎంత ఆశ్చర్యం! నీకళ్లు కమలాలలాగ వున్నాయి. అమృతం కురిపిస్తున్నాయా అన్నట్టున్నాయి'' అని అతని నేత్ర సౌందర్యం వర్ణిస్తూ ఆశతో చూడసాగింది.

అతడు వెంటనే తన ఒకకన్ను ఊడదీసి ''అమ్మా ఇది నీవు వర్ణిస్తున్న నేత్రాబ్జం కాదు. చర్మం లోని నీరు. చూచావా? ఈ అసహ్యమైన దేహంలో మనోహరమైనది ఏమిటుంది?'' అన్నాడు.

ఆమె ఆ సన్యాసి సాహసానికి ఆశ్చర్య పడింది. అతని బోధతో ఆమెకు కూడా విరక్తి కలిగింది. జన్మ సంతాపాన్ని, జరామరణాలను తొలగించే సత్యశాసనాన్ని అవలంబించింది.

కళింగదత్తుడు ఈ ధర్మోపదేశాన్ని, కథలను విన్నాడు. అయినా కుమార్తె పుట్టిందనే దుఃఖం పోలేదు. అప్పుడొక బ్రాహ్మణుడన్నాడు:

''మహారాజా, కుమార్తె పుట్టినందుకు ఎందుకు వ్యర్థంగా సంతాపపడుతారు? కొడుకులు చేయలేని పనిని కుమార్తెలు చేస్తారు. దీనికొక కథ చెబుతాను వినండి.

పూర్వం చిత్రకూటాచల ప్రాంతాన్ని సుషేణుడనే రాజు పాలించే వాడు. అతనికీర్తి స్వర్గలోకం వరకు వ్యాపించి, దేవవనితలకు కర్ణాభర కుండలాలయింది. అతనిభార్య గొప్ప గుణ వంతురాలు. మహిళలసృష్టి ఆమెతోనే ఆరంభమయిందా అన్నంత సుందరి.

అతడు దివినుంచి భువికి వచ్చిన దేవ విమానం వంటి నూతనోద్యానం వేయించాడు. వివిధ వృక్షాలు నాటించాడు. అది మన్మథుడికి సంకేత గృహంలాగ, వసంతమే పునస్సృష్టి అయినట్లు ఉండేది. దానిలో రాజు తన ఇష్టులతో ఇంద్రుడు నందనోద్యానంలో విహరించినట్లుగా విహరించేవాడు.

ఒకమారు అతనికి దేవనర్తకి రంభ కనిపించింది. ఆమెను చూడడమే లోకం కండ్లకు అమృత ప్రవాహం. రాజు ఆమెను చూశాడు. ఆమె రాజును చూసింది. అతడు ఆమెకు కొమ్మలు విచ్చిన శృంగార కల్ప వృక్షంలాగ, బ్రహ్మ తన సర్వోత్తమ సృష్టి చేసిన పుణ్యదినం లాగ అనిపించాడు.

ఆమె అతని కళ్లకు పూర్ణచంద్రుని నవలావణ్య చంద్రిక లాగా, కౌశికీ రసికుడైన మన్మథుని రతి భూమిక లాగ కనబడింది.

మన్మథుడు వారిద్దరిమీద ఒకేమారు బాణ వర్షం కురిపించాడు. ఆబాణాలకు కట్టిన ఈకల గాలి సోకడంవల్లనో ఏమో, ఇద్దరి ఒళ్లూ గగుర్పొడిచింది. కంపించింది.

పెద్ద పాలిండ్లతో మరీ అందంగా వుండే ఆ రంభ పూర్వం దేవకామిని అయిన గంగ శంతనుణ్ణి చేరినట్లు మానవ రూపంతో సుషేణ మహారాజును చేరింది. ''నేనెవరో అడగరాదు. ఇదీ మన ఒప్పందం. అంతవరకు నీవద్ద ఉంటాను'' అని రంభ అతనితో ఒడంబడిక చేసుకొంది.

ఆమె లభించగానే, రాజు తను స్మరసామ్రాజ్యానికి పట్టం కట్టుకొన్నట్లు భావించాడు. రతీదేవిని విడువని మన్మథుడి లాగ నిరంతరం ఆమెతోనే వుంటూ, నూతనోద్యానంలో తిరుగుతూ దానికి వసంతశోభ చేకూరుస్తూ గడిపాడు.

కొంతకాలానికి రంభ గర్భవతి అయింది. కుమార్తెను ప్రసవించింది. ఆ శిశువు శరీర కాంతిముందు వెన్నెలలు తీసికట్టు. కుమార్తె పుట్టగానే రంభ రాజుతో అన్నదిగదా: ''నాథా ఇక స్వస్తి. నేను దేవ వనిత రంభను. దేవలోకానికి తిరిగి వెళ్లుతాను. పిల్లలు కలిగే వరకే మనకు సంబంధం ఈ భూలోకంలో. ఈ కుమార్తె ప్రభావం వల్ల ఇకమీద మళ్లీ కలుసుకుంటాము'' అని.

రంభ మాటలకు రాజు విస్తుపోయాడు. అయితే ఏం? మెరుపులాగా ఆకాశమార్గంలో వెళ్లిపోయింది. రాజు భుజంగి (ఆడపాము) కాటు వేస్తే విషంతో మూర్ఛపోయినట్లు పోయినట్లు ఆ భుజంగి (కాముకి) విరహ విషంతో మూర్ఛపోయాడు.

రాజు తనకుమార్తెకు సులోచన అని పేరు పెట్టాడు. విధి సృష్టించిన విలాసవాహిని వలె వున్న ఆసులోచన తన తలిదండ్రులకు మళ్లీ కలయిక కలిగించడానికా అన్నట్టు పెరుగ సాగింది. యవ్వన వసంతం రాగానే చిగిర్చి పూచి, పూల గుత్తులతో అందంగా కనిపించే తీగలాగా అందాలు చిందింది.

ఒకమారు యవ్వనమధ్యస్థ అయిన ఆ సులోచనను కశ్యపుడనే మునికుమారుడు చూచాడు. అతడూ చాల సుందరుడు, తేజస్వి. ఆ సులోచన తన పేరుకు తగినట్టు లేడికన్నులది. తనపై అభిలాష వున్నట్టే కనబడింది. ఇక మన్మథుడు ఊరికే వదులుతాడా? అతన్ని వేచసాగాడు.

రాజు వద్దకు వెళ్లి సులోచనను తనకిచ్చి వివాహం చేయమన్నాడు. ఆ భూపాలుడు అతనికి రంభా వృత్తాంతం వినిపించాడు. విరహంతో వేగిపోతూ ''మునికుమారా, ఈ నాకుమార్తె నాకు రంభ మరల కనిపించడానికి కారణమవుతుంది. కనుక ఆమె మళ్లీ కనిపించే వరకు నేను ఈ కన్యను నీకు దానం చేయలేను.'' అన్నాడు.


ముని పుత్రుడు రాజు విరహగాథ, నిశ్చయం విన్నాడు. ''మహారాజా, నాతపస్సులో సగం నీకు దానం చేస్తున్నాను. నీవు దాని ప్రభావంతో బొందెతోనే స్వర్గానికి వెళ్తావు. రంభాసమాగమం పొందుతావు. ఇక సులోచనను నాకు నిరభ్యంతరంగా దానం చేయి. పూర్వం భృగువంశంలో రురుడు అనే మునికుమారుడు ఉండే వాడు. అతనిభార్య పేరు ప్రమద్వర. ఆమెను ఒకమారు పాము కాటు వేసింది. ఆమె ఆ విష వేగంతో మరణించింది. అప్పుడు రురుడు తన ఆయుస్సులో అర్ధం దానం చేసి ప్రమద్వరను బ్రతికించుకున్నాడు'' అన్నాడు.

మునికుమారుడు తన తపోబలంతో రాజుకు స్వర్గంలోనే రంభను కలుసుకొనే అవకాశం కల్పించాడు. తర్వాత మన్మథామృత తరంగిణిలాగ వున్న సులోచనను పెండ్లాడాడు.

''మహారాజా, ఇలా కుమార్తెల ప్రభావంతో మానవుల కోరికలు సిద్ధిస్తాయి. శాపంవల్లనో, మరేకారణంవల్లనో దేవ వనితలు మానవ పరిహారాలలో అవతరిస్తుంటారు.''

ఆబ్రాహ్మణుని ఊరడింపు మాటలకు కళింగదత్తుని మనస్సు కుదుటబడింది. కుమార్తె కలిగిందనే చింత వదిలాడు.

(ఇంకా ఉంది)



స్టువార్ట్ గ్రిఫిన్

గెయిషాలు మారిపోతున్నారు!

[గెయిషా అంటే నట్టి వేశ్యలని ఎందరో అనుకుంటారు. గెయిషాలు జపాన్ సంస్కృతిలో ఒక అంశం. వారు కళాకారులు. కాని, ఆధునిక ధోరణులలో వారి పాత్ర ఏమిటి? ఈ ప్రశ్నకి కొంతదాకా సమాధానం ఇస్తుంది కింది వ్యాసం.]

నెత్తిమీద జుట్టు చుట్టపెట్టుకుని, బియ్యపుపిండి అద్దిన చేతోత్తో సిగ్గుగా నవ్వుని దాచుకుంటున్న గెయిషా అమ్మాయి నేటికీ జపాన్‌లో కనిపిస్తూనే ఉంటుంది. కాని, యుద్ధం ముందు గెయిషాకీ నేటి గెయిషాకీ మధ్య చాలా భేదం ఉంది. అప్పటి గెయిషా వరహాయే వేరు. నాజూకే వేరు.

ఈ నాడు పాశ్చాత్య దేశాలనుంచి దిగుమతి అయిన నయిట్‌క్లబ్, హోటళ్ల వినోదాలతో పోటీ పడలేక గెయిషాలుకూడా తమ పద్ధతులని మార్చుకుంటున్నారు. అందుచేత వారి వాలకమే మారింది! నేటి గెయిషా మునపటి గెయిషాకంటే సన్నగా, పొడుగ్గా, ఎత్తయిన వక్షభాగంతో కనిపిస్తుంది.

నేటికీ కుబుసం లాంటి కిమోనో (చొక్కా!) ఇంకా విధిగా వేసుకున్నప్పటికీ నడుంకిందకి ఉండే జుట్టుని కత్తిరించి తలమీద 'విగ్గులు' వేసుకుంటున్నారు. ఈ విగ్గులలో వివిధరకాల అలంకరణలు ఉంటాయి.

మునుపు కిందపెదవికి మాత్రం రంగు వేసేవారు; కింది పళ్లవరుసకి నల్లరంగు వేసేవారు. ఇదంతా మారిపోయింది.

గెయిషాలు నేటి చాపలమీద మోకరిల్లి కూచుంటారు. కాని, లేచేప్పుడు మాత్రం పాతకాలపు సంగీతానికికాక కొత్తరకపు చా—చా—చా, వాటుసే, మాంబో స్వరాలకి లేచి నాట్యం చేస్తూ ఉంటారు!

మునుపు కొన్నిరకాల ఆటలు గెయిషా గృహాలలో మంచి ప్రచారంలో ఉండేవి. నేడు వాటిబదులు పాశ్చాత్య దేశాల ఆటల అనుకరణలు ప్రచారంలోకి వస్తున్నాయి. మునుపటి అభినయాలు పోయి ఆధునిక యుగపు ఆటల అభినయాలు అలవాటు అవుతున్నాయి!

అసలు గెయిషాల సంఖ్య మాటేమిటి? రెండవ ప్రపంచ యుద్ధం ముందు 50,000 మంది గెయిషాలు ఉండేవారుట జపానులో. ఈ రోజు 20,000 మంది కన్నా లేరేమో! వీరిలో సుమారు 9000 మంది వేశ్యలేనని పోలీసువారి అనుమానం.

ఒక 'గెయిషా పార్టీ' (అసలయినది, నకిలీదికాదు!) ఎంత అవుతుంది. 12 సంవత్సరాల క్రితం మూడుగంటల కాలం నడిచే గెయిషాపార్టీ మద్యం, భోజనం, కొసర్లతో 10 డాలర్లు అయ్యేదేమో. నేడు 25 డాలర్లు కావచ్చు. అసలే అభిరుచులు మారుతున్నప్పుడు ఈ అదనపు ఖర్చు కొంత ఇబ్బంది కలిగిస్తోంది...

మునుపటిలాగ సంసార స్త్రీలుకూడా తమ మగవారు గెయిషా పార్టీలకి వెళ్లిపోతూఉంటే చూసి ఊరుకోవటం లేదు!

ఒక గెయిషాకి నెలకి 600–750 డాలర్లదాకా జీతం ఉంటుంది (సుమారు రు 4500 నుంచి 5,600 దాకా) అయినప్పటికీ ఎందరో అమ్మాయిలు ఈ వృత్తిని అవలంబించటానికి ఇష్టపడటం లేదు. కర్మాగారాలలో, ఆఫీసులలో చేరి త్వరగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు.

సాధారణంగా అప్పులలో మునిగిపోయిన రయితులు తమ పిల్లలని 'టీ–గృహాలకి' అమ్ముకునేవారు. ఈ అమ్మాయిలే గెయిషాలు అయ్యేవారు. గెయిషాలుగా వారి ఆదాయాలు తమ తండ్రుల అప్పులని తీర్చటానికి చాలాభాగం ఖర్చులయ్యేవి. అదనపు ఆదాయంకోసం వారు ధనవంతులకి ఉంపుడుగత్తెలుగా కుదిరేవారు.

నేడు తమకి ఇష్టంవస్తేనే గెయిషా వృత్తిని అవలంబించి ఇష్టం వచ్చినప్పుడు ఇతర వృత్తులలోకిగాని, గృహస్థాశ్రమంలోకిగాని మారుతున్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే గెయిషాల ఆదాయాలు పెరుగుతున్నాయి; లలిత కళలలో వారి ప్రవేశం తగ్గిపోతోంది! లలిత కళలు అబ్బని గెయిషా రెక్కలులేని సీతాకోక చిలుక అంటారు. సీతాకోక చిలుకలు రెక్కలు పోగొట్టుకొనటానికే ఇష్టపడుతున్నాయేమో!

(షో. వ. ఫీ.)



గెయిషా బృందం

కల్యాణీ... కల్యాణీ!

మొక్కపాటి
శివాజీ



'నీకు పామిస్ట్రీ వొచ్చునటగా?' చెట్టు నీడని చల్లగా కూచున్నాం.

'వొచ్చివుండాలా?' అన్నాను కొంటెగా.

'నా చెయ్యి ... ఎలావుందో చూడు...'

చాపిన ఆ చేతిని చూడ్డానికి సాముద్రిక శాస్త్రమే రావాలా!

'చెప్పు చూద్దాం...' అంది కల్యాణి, మరికొంచెం దగ్గరకు జరిగి.

'ఏముంది? వైద్యవృత్తి, స్వతంత్రం అంటే పూర్తిగా స్వతంత్రమూ కాదు: కాదంటే పూర్తిగా కాకమాపోదు. ద్రవ్య లోపం వుండదు కాని, తిండి సుఖం సున్న. ఎంత సంపాదిస్తేనేం, భోజన సౌఖ్యం లేకపోయాక...'

'నీకెంతసేపూ తిండిగొడవే. మిగిలినవి... అవి చెప్పు. లేనిదెందుకు!'

'గృహం. గృహయోగం, వాహనయోగం వున్నాయి కాని, ప్రస్తుతంలో కొంచెం స్ఫుటంగా కనబడటంలేదు...'

'నా బ్యాగులో బాటరీలైటుంది. వెయ్యనా?...ఇంకా...'

వెలుతురు బాగావుంది. సూర్యాస్తమయం కాలేదు.

'ఏం చెప్పను? అసలు నీకే సౌఖ్యం కావాలి?...'

'వాక్యాలపించెందుకు? వున్నదేదో చెప్పు, నీ శాస్త్ర ప్రకారం...పురుషులు...'

గొంతు అదోవిధంగా అయింది. 'అసలు నేను అలాంటిదాన్నంటావా? అది చెప్పు చూద్దాం!'

ఆ విషయాన్ని గురించి చెప్పడానికి నాకు అట్టేసేపు పట్టలేదు. 'నువ్వా? నువ్వు...చాలా మంచిదానివి. సర్వకాలములయందూ పాతివ్రత్యం ఆరాధించే సీత, సావిత్రి, దమయంతివంటి సాధ్వీమతల్లుల సంతతికి చెందినదానివి...'

కొంత జ్ఞానం, కొంత జ్ఞాపకం...

...మూర్తి, మా వాడు, రోజా కనిపించేవాడు, నా బంగరు లోకాలు మాయమై, సరిగ్గా నేను కాలేజీకి బయలుదేరుతుండగా ఊడిపడ్డాడు: 'ఇంకా ఇలాగే ఉన్నావా? రారా తెములు దబ్బున' అనుకుంటూ. నేను ఆలస్యంచేస్తూ వున్నట్టు అక్కడికి.

'ఏమిటోయ్ తొందర? అయినా యిన్నాళ్ళ నువ్వు ఎక్కడికి వెళ్ళినట్టు? ఏయేదేశాలు చక్కబెట్టినట్టు...' అన్నాను తాపీగా.

'అన్నీ చెప్పడానికి ఇప్పుడు టైంలేదు. నువ్వు ముందర బట్టలువేసుకో. కాలేజీకి పోతూ మాట్లాడుకుందాం.'

బట్టలు వేసుకోడానికి నాకు సుమారు అయిదునిమిషాలు పట్టింది. అంతకన్న నాకు సమయం మావాడు చిక్కనిస్తేగా!

సగందూరంకూడా నడిచివుండం ఉన్నట్టుండి: 'నువ్వు ఈవాళ కాలేజీ మానే

పోయ్యాలిరా మరెక్కడికైనా వాలి. కొస్త స్థిమితంగా మాట్లాడుకోడానికి వీలైన చోటికి' అన్నాడుమూర్తి. వాడి కంఠం ఆతురతతో జీరపోయింది.

కాలేజీ మానెయ్యడం ... నేను ఇంకా ఆలోచిస్తూ ఉండగానే! 'అవతల కొంపలు ములుగుతోంటే ఈకాలేజీ ఏమిట్రా నీకు? అపాతం ఏదో నేచెబుతాగా, రాబాబూ' అన్నాడు మూర్తిగట్టిగా. నాకంటే రెండు క్లాసులువాడు పైని.

'అసలు నువ్వు పరీక్ష డౌకేసరికే పట్టపగలు సప్తర్షిమండలం కనిపించింది. అయినా నీమొహం నువ్వు నాకు పొంచెప్పేదేమిటి! నాకేం కొంపమునిగే పనిలేదు; నీకుంటే నువ్వు మానెయ్యి. తాచెడ్డకోతి...'

'ఒరేయ్! ప్రాణ మిత్రుడివి అంటే నువ్వేరా! నావని ఒహటీ, నీవని ఒహటీట్రా దౌర్భాగ్యుడా! నీ కవసరంవొస్తే నేను సహాయం చెయ్యొద్దుట్రా! ఇంత స్వార్ధమా దాంతస్వారవలా!'

'అసలువనేమిటో చెప్పకుండా...'

'అరె అ స లు నన్ను చెప్పనిస్తేనా! చెప్తాను రారాబాబూ అంటే, కాలేజీకిపోతా నని భీష్మించుకున్నవాడితో నేను ఎల్లా చెప్పను? కొస్త ఆలోచించాలి, బుర్ర అనేది వుంటే...'

ఆ తరువాత వాడితో వాదించడం మంచిది కాదనిపించింది, నా అవయవాల్లో ఎన్ని లోపాలు కనిపిస్తాయోనని...

'కాని! ఈ రోజాకు, నా చదువు ధ్వంసం, నీ ధర్మమా అని సడునడు. ఎక్కడికి పోదాం అంటావు యింతకీ?' అన్నాను. ఏం చెయ్యను, ప్రాణమిత్రుడి ప్రాణం మీదికి వొస్తే! నాలుగు రోజాలయి కాంటీనులోనూ లేక, కామను రూము లోనూ లేక, సినిమాల దగ్గరా లేక — మూర్తి చాలా కష్టంలోనే వుండివుండాలి.

తిన్నగా పార్కులోకి తీసుకొని వెళ్ళాడు. 'ఇన్నాళ్ళా వీడు ఏమయాడోనని నీకు కించిత్తయినా ఆదుర్దా పుట్టిందిరా? రోజా కనిపించే మైలురాయి కనిపించక పోతేనే మనిషి అన్నవాడు 'ఏ మ యిం ది చెప్మా' అనుకుంటాడే! నువ్వు ఏమన్న స్నేహితుడివిరా!'

'నా గుణగణాదులు పాడడానికా కాలేజీ ఎగ్గొట్టించింది?' అన్నాను, కొంచెం కోపం వటస్తూ.

మూర్తి వెంటనే తగ్గాడు. 'ఇంద ఈ సిగరెట్టు తగలెయ్. మెల్లిగా చెపుతూ వుంటాను. శ్రద్ధగా విను. పనికిమాలిన చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు!' వాడొక సిగరెట్టు అంటించాడు.

'నాలుగు రోజుల్క్రితం 'ఆవిడ' కనిపించింది.'

'ఏవిడ?' రోడ్డు మీద కళ్ళు తెరుచుకుని నడిస్తే డెబ్బై మంది 'ఆవిడ'లు కనిపిస్తారు. నాకు 'ఆవిడ' ఎవరో తెలియదు మరి. వీడికా...పెళ్ళికాలేదు:

'అందుకే చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకుండా శ్రద్ధగా వినరా గాడిదీ' అన్నాను. వళ్ళు మండి ఛస్తోంటే మధ్యన యీ అడ్డు సవాళ్ళేమిటి?' వాడికి నిజంగా వొళ్ళుమండే వుంటుంది. కాని అనవసరం.

'మరి ఆ వి డె వ రో నాకు తెలీదు' అన్నాను సెంకెగా. వాడి ధోరణి చూస్తే తెలియవలసిన అవసరం లేనట్టే వుంది. తెలియకపోతే ప్రమాదం కూడా లేకపోవచ్చు. అయినా, నాకేదో పెద్ద తెలిసి వున్నట్టు వాడు మాట్లాడ్డం యెందుకు?

'ఆవిడేనయ్యా— కల్యాణి' అన్నాడు వినుగా.

'ఎవరు? కాలు విరిగిన ఐట్రాక్కులాంటా కొంకర టొంకరగా నడుస్తుంది—'

'అందుకే నిన్ను చూస్తే వొళ్ళు మండేది. ఎప్పుడూ వక్కదార్లోకి లాగడానికే చూస్తావు కదా! ఆవిడలోని గొప్పతనం అందం, నీకేమన్నా తెలిశాయా? వొంకర నడకటు, వొంకర నడక! బుద్ధి వొంకర వున్నవాడికి అన్నీ వొంకరగానే కనిపిస్తాయి...'

మూర్తికికోపం రావడమేకాదు; గట్టిగా వొచ్చింది. వీడికి కల్యాణిమీద అభిమానం అని నాకు యిట్టే తెలిసిపోయింది. ఆమె నామాంతరం ('వుమ్ము పెసలు' అని ఆమె నడువరపయొక్క అందాన్ని మాచిస్తూ పెట్టినది) ఉచ్చరించివుంటే, నాకు తప్పకుండా దేహశుద్ధిచేసి వుండేవాడు, స్నేహితున్నని అయినా ఆలోచించక. అంతవరకు నే లేచినవేళ బాగుంది!

'పర్లే, రోజా కనిపిస్తుందికదా! విశేషం యేముంది. కొమ్ములుకాని మొలవలేదు కదా వున్నట్టుండి!'

నా మాటల్ని వాడు పూర్తిగా గుర్తించినట్టు లేదు. ఏదో ధోరణిలో వడ్డాడు. 'ఎక్కడ కనిపించింది నీకు?' అన్నాను. కథ నడవాలిగా. పైగా అటువంటి విశేషం యుంటే వాడే చెపుతాడు!

'అసలు కల్యాణీ నేనూ హైస్కూల్లో కూడా కలిసి చదువుకున్నాం అని నీకు తెలియదేమో! చాలా మంచి పిల్ల. ఇంట్లో ఏదో ఇబ్బందివల్ల ఒకటి రెండేళ్ళు పరీక్ష తప్పింది. లేకపోతే నీలాంటి దౌర్భాగ్యుడి క్లాసుమేటు అయే దురవస్థ తప్పేది...'

గాలి నా మీదికి!...కొంచెం విసురుగానే తిరుగుతోంది. వూరుకోడం మంచిది.

'ఆ రోజుల్నించీ నాకు బాగా పరిచయం. వాళ్ళ అమ్మా నాన్నా కూడా నన్ను బాగా యెరుగుదురు...'

'వాళ్ళ యింటికి వెడుతూ వొస్తూ వుండే వాడివి కాబోలును.'

'లేకపోతే యింతమంది వుండగా నన్నే ఎట్లా యె రు గు దు రు! చొప్పదంటు ప్రశ్న...'

'అబ్బే! నీ తెలివి తేటలకి కలిగిన ఘనతమాత్రం కాదని...అంతే...'

'మొన్న వాళ్ళింటికి వెళ్ళాను...వాళ్ళ వాళ్ళెవరూ యింట్లో లేరు. ఎంతో సేపు పిచ్చాపాటీ మా ట్లా డు కుం టూ కూచున్నాం...'

'చైనా విషయం ఏమన్నా వొచ్చిందా?...'

'నీ తలకాయ విషయం వొచ్చింది... ఇల్లా గాడిద ప్రశ్నలు వేస్తుంటే నే నసలు మాట్లాడను. ఏదో అప్పుడివని చెపుతోంటే, యీ ప్రశ్న లేమిట్రా మధ్యని, నాకు కోపం తెప్పించడానిక్కాని...'

'మరి యెంత సేపయినా, దిక్కుమాలిన ఉపోద్ఘాతంతోనే సరిపోతే...'

'ఉండు మరి. మాటపెకలనిస్తావా?.'

'చెప్పు. నావ్వకుండా కానియ్...'

'అదే. తీరా...సరే చా లా సే పు మాట్లాడుకుంటూ కూచున్నాం. ఎంతో ఆప్యాయంగాను, ఎంతో 'యిది' గాను మాట్లాడింది. అదివరకెప్పుడూ అంత 'యిది'గా లేదు...'

'ఒక్కొక్కరోజా అల్లా వుంటుంది. 'మూడ్'ని బట్టి. కొ న్ని ళ్ళ కో సా రి వొస్తుందట. అల్లాగ...శా స్త్ర కా రు లు

ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి, ఆంధ్రసచిత్ర వారపత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

కళ్యాణి... కళ్యాణి!

అంటాడు.'

'ఒరే సిది పిక్కచ్చి అయిన మట్టి బుర్ర. వాళ్ళవాళ్ళు లేనప్పుడు 'అంత ఫ్రీగా మాట్లాడింది' అంటే...కొస్త వూహించలేవేం? పరీక్షలు పాసు అవడానికి పనికివొచ్చే తెలివితేటలు కొన్ని ప్రపంచం అర్థం చేసుకోడానికికూడా ఉపయోగించు...వూహించలేవూ...'

'ఊహాగానంవల్ల ప్రమాదం వుండొచ్చు. పరిస్థితులు యధాతధంగా గ్రహించడం మంచిది.'

'కల్యాణి నన్ను ప్రేమిస్తోన్నట్టు మొన్న నిశ్చయం అయిపోయింది నా మనస్సులో, నువ్వు ఏమన్నా అను...'

నేనేమంటాను మధ్యని! వాడి ధర్మమా అని, విషయం త్వరగా బైట పడేశాడు. డొంకతిరుగుడు తగ్గించాడు. కనీసం మధ్యాహ్నం అయినా కాలేజీకివెళ్ళే అవకాశం కలగచ్చు.

'అయితే శుభం. కానీయ్' ఈ మధన పడడం యెంచుకు? హాయిగా తీయగా వుండకుండా?' అన్నాను ముక్తాయింపు శైలితో.

మూర్తికి కొంచెం విసుగు వచ్చినట్టుంది. 'దున్నపోతు యీనింది అంటే దూడను వెంటనే కట్టెయ్యమన్నవాడు నీకు చిన్నతమ్ముడు అయివుండాలిరా!...

ఈ రోజుల్లో నిజంగానే మంచినీటి కరువు వుందని చెప్తున్నారు కొందరు – తప్పేకపోతే కన్నీళ్లు తుడుచుకోవటానికి కూడా కరువొస్తుందేమో



అలతా సిద్ధం అయినట్టు మాట్లాడతావేం? గ్రంధం పూర్తయినట్టు!...'

'ఇంక గ్రంధానికేముంది! నీ హృదయావేదన ఆ మహాస్వాధ్వికి తెలియపర్చడం, ఆమె అమోదిస్తే... ఆమోదిస్తుందని నిర్ధార్యం కనుక—యిక మిగిలినదీ ఒకరు చెప్పేదేముంది...'

'అక్కడే వొచ్చింది చిక్కు, ఆమెకు తెలియబరచడం యెల్లాగా, అని...'

'మొన్న అంతసేపు మాట్లాడేవన్నావు, కొస్త నీసంగతి చెప్పుకోలేక పోయావా?' అన్నాను.

'అదేరా! చెప్పడం నాచాతకాలేదు. రెండ్రోజుల్నించి ప్రయత్నం చేస్తున్నాను. కావటంలేదు...'

'అయితే మానెయ్. మన బ్రహ్మచర్యం మనకు వుండనేవుంది...'

'యేడిసినట్టేవుంది నీ సలహా! అవతల అంత సుముఖంగావుంటే, ఊరుకోడం యెల్లాగరా?'

'అయితే యేంచేద్దామంటావు?'

'ఒకలవ్‌లెటరు రాసిపడేస్తే, పేచీలేని పని...సంగతి తెలిసిపోతుంది.'

'లవ్‌లెటర్! నీ తెలివితేటలు తగులబడ్డట్టున్నాయి. యిటువంటి పేచీ వ్యవహారాలు నోటిమాటమీద జరగడం మంచిది. అసలు:మనిషికి యిష్టం లేకపోతే, ఆకాగితం ప్రిన్సిపాలుకు అందుతుంది; నీకు శాస్తి జరుగుతుంది...'

'ఆమాత్రం నాకు తెలియనట్టే! మహాతెలివైనివాడు వొచ్చాడు సలహా యివ్వడానికి! ఆమెచేతికే అందేటట్టు చేస్తాను. ఇక కల్యాణికా, నామీద బ్రహ్మాండమైన మోజుగావుంది...'

'అని నీ అభిప్రాయం.'

'అది నిశ్చయం. అనుమానం యేమీ లేదు...'

'అయితే ఆలశ్యం దేనికి?...ఒక ప్రేమ లేఖ రాసి పడెయ్యలేక పోయావూ... ఏదో ఒక నమూనా చూసి.' విషయం సులువుగా తేల్చేశాను.

'ఈ నాలుగురోజుల్నించీ ఏం చేస్తున్నాననుకున్నావు! చాలా ప్రయత్నం చేశాను. కుదరలేదు.'

'కుదరక పోడానికేముంది? ప్రోపొర్షనేటుగా మన సాహిత్యంలో! కష్టం

యేమిటి ? ఒకలేఖ కాపీచెయ్యడం, నీపేరున వంతకంపెట్టి పంపడం...'

'అదే కుదరడంలేదురా...'

'పోనీ, వేలుముద్ర చిత్తగించు...'

'అందుకే నిన్ను ... తెలుగులో అయితే నేను ఏదో రాసేద్దును, అవాకులో చవా కులో...ఇంగ్లీషులో కావాలి.'

'ఆమెకు తెలుగురాదా ?'

'రాకేం. బాగా వొచ్చును. ఎంత తెలుగువాళ్ళయినా 'లవ్‌లెటరు' అన్నది యింగ్లీషులో వుంటేనే దాని అందం. మన ఇంగ్లీషుభాషా పాండిత్యం యెంతటిదో నీకు తెలుసునుకదా...'

'ఆహా ! తెలియకేం. మనలాంటివాళ్ళు చేసే చిత్రహింస చూడలేకేగదా, యింగ్లీషు వాళ్ళు భారతదేశం వొదిలి పారిపోయింది ! ...పోనీ హిందీలో వ్రాయి. దేవభాషగా ఈమధ్య ప్రమోటు అయింది !'

'ఆమెకు హిందీరాదు. నువ్వు చెప్పు. నా దస్తూరీతో వ్రాసి పంపిస్తాను ... మూడు రోజుల్నించి అహోరాత్రాలు ప్రయత్నించినా నావల్లకాకనే నీ సహాయం కావలసి వొచ్చింది. ఆ దౌర్భాగ్యపు భాష నాకు లొంగలేదు...అదీ సంగతి.'

టూకీగా విషయం తెల్పేశాడు మూర్తి. 'నావల్లకాదు' అని అనడం యెలా ? నేను లవ్‌లెటరు చెప్పడం, మూర్తి పట్టిపట్టి చక్కగా వ్రాయడం మాత్రమే నే నెరుగుదును.

మరునాడు బస్సుస్టాండుకి కాలేజీకి మధ్యదారిలో మూర్తి నోటుబుక్కు వరిగ్గా వాడి మొహాన్నవేసి కొట్టి: 'యింతఫూల్లా ప్రవర్తిస్తావనుకోలేదు !' అని కల్యాణి కుబుసం విడిచిన తాచులా చరచరా పాగిపోడం నా కళ్ళతో నేను చూచాను...

...'అక్కడే పొరపాటు పడుతున్నావు. నాకు పురుషులంటే...అపరిమితమైన యిష్టం...' తన ముఖం నా ముఖానికి దగ్గరగా పెట్టింది. వొళ్లో అలా వాలిపోయింది. వారం క్రితం...

'జ్ఞాపకం ఉన్నానా? మరిచి పోయావా!' అంది ఎంతో చనువుగా, ఆ స్త్రీమూర్తి.

జ్ఞాపకం ! కొద్ది సేపటికికాని రాలేదు కాలేజీ, నోటుబుక్కుతో మూర్తి మొహం బద్దలవడం, లవ్‌లెటరు ... జరిగి చాలా కాలం అయింది.

'జ్ఞాపకం లేకేం ! తప్పకుండా జ్ఞాపకమే' అన్నాను 'మీరు' అనాలా, 'నువ్వు' అనాలా అన్న సందేహం పైకిరాకుండా, జాగర్తగా.

'అయితే నా పేరుచెప్పు !' కొంటెగా సవాలు.

నిజంగా అయితే ... చటుక్కున ఆమె పేరు జ్ఞాపకం రాలేదు. మనస్సనే చెత్తబుట్టలో త్వరత్వరగా వెతుకుతున్నాను ...

విజయగర్వంతో అన్నది ఆమె : 'నీకు జ్ఞాపకంలేదు. అవునా ! ఒప్పుకుంటే సరిపోలా?...' నవ్వింది.

నవ్వింది. పళ్ళు బైట పడ్డాయి.

'పుచ్చుపెసలు!' అన్నాను విజయంతో. పూర్వజన్మ స్మృతి మెరుపులా వొచ్చింది.

'నీ బుద్ధులు పోనిచ్చుకున్నావు కావు, అప్పటికీ యిప్పటికీ. ఏదో పెద్దమనిషివి అయావు అనుకున్నాను కాని...'

'నీతో చదువుకున్నాక పెద్ద మనిషిని యెల్లా అవుతాను చెప్పు...కల్యాణీ!' పేరు అది! అప్పటికి జ్ఞాపకం వొచ్చింది.

తరువాతి పది నిముషాల్లో, తానేం చేస్తున్నది, ఆవూరు యెందుకు వొచ్చింది ...పై ఆదివారం నే నామెను ఎక్కడ కలుసుకోవలసింది చెప్పింది. నేనెక్కడ వున్నది. ఏమిచేస్తున్నది కనుక్కుంది. నేను వెళ్ళకపోతే తరువాత నిలవేసి అడిగేటందుకు కాబోలు !

వెళ్ళాను, ఆమె క్వార్టర్సుకి. హాస్పిటలు పక్కనే వున్నాయి. ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. మంచి 'కేకు' బిస్కట్లు తినిపించింది. కాఫీ తెప్పించింది.


'ఇంతకంటె ఇక్కడే మీ దొరకవు. దరిద్రం. ఏదో శ అయినా తినాలనివుంటే వఠొంటురోడ్డుదాకా పోవాలి. ఒకర్తినీ వెళ్ళలేను. నీలాంటి స్నేహితుడు దొరకినప్పుడు తప్ప వెళ్ళడం కుదరనూ కుదరదు...'

తీసుకొని వెడతానని వొప్పుకున్నాను. ఆమెను వూరంతా తిప్పాను. కాదు కాదు... నన్నే ఆమె ఊరంతా తిప్పింది. సినిమాకు తీసుకొని వెళ్ళింది. డబ్బు ఆమే ఖర్చు పెట్టింది. కాదంటే దెబ్బలాడింది.

అడయారు వెళ్ళాం. బీచికి వెళ్ళాం. ఏకాంతంగా కూచున్నాం. పూర్వగాథలు నెమరువేసింది. మనక్లాసు మేటు ఫలానా అమ్మాయి చెడిపోయిందిట తెలుసా ! ఫలానా వాడు ఫలానా ఆమెను చాలాకాలంగా ఉంచుకున్నాడుట తెలుసా ! ... ఒక గంటసేపు విన్నాను. ఇంకాఎక్కువే అయివుండొచ్చు...

...నేను ఏంచేశానో చెప్పలేను. ఎందుకు చేశానో చెప్పలేను. శరీరం వేడెక్కింది కాని నా పెదవులు అంత శీతలాన్ని ఎన్నడూ రుచిచూడలేదు. తరువాత కాల్చిన రెండు సిగరెట్లూ ఎందుకు ఆరిపోలేదో మాత్రం తెలియదు.

అసలు ఆ పొగ అయినా, గడ్డకట్టి క్రింద పడకుండా పైకి ఎలా పోగలిగిందో వన్నడిగి ప్రయోజనంలేదు. ●



సుబ్బరాయ షష్ఠి

పండుగలూ, పర్వాలూ సామాన్యంగా సంవత్సరానికి ఒకసారే వస్తూ వుంటాయి. కాని, సంక్రమణం, శివరాత్రి, షష్ఠి వ్రతం ప్రతీ నెలా వస్తాయి. వీటిలో ప్రతి మాసమూ శుక్ల పక్షంలోని షష్ఠి నాడు సుబ్రహ్మణ్యస్వామి వ్రతం జరుపుతూ వుంటారు. ఏడాదికి ఒకసారి మార్గశిర శుద్ధంలోవచ్చే షష్ఠియే సుబ్బరాయ షష్ఠిగా పేరు పడింది. ఇది శివ కుమారుడైన కుమారస్వామికి సంబంధించిన పర్వం!

ఉత్తర భారతంలో కుమారస్వామికి ప్రాధాన్యంలేదు. దక్షిణదేశంలో -- ముఖ్యంగా తమిళ ప్రాంతంలో ప్రాధాన్యం ఎక్కువ. కుమారస్వామికి సంబంధించిన క్షేత్రాలు తమిళనాడులో చాలా వున్నాయి. స్కంద షష్ఠితోపాటు ప్రతిమాసమూ షష్ఠి వ్రతాలను ఆ ప్రాంతంవారు ఘనంగా ఆచరిస్తారు.

తెలుగు దేశంలో స్కంద షష్ఠిని మార్గశిర మాసంలో జరుపుకోగా, దాక్షిణాత్యులు కార్తిక మాసంలో జరుపుకుంటారు. మార్గశిర శుద్ధ షష్ఠియే స్కంద షష్ఠి అని నిర్ణయ సింధువులో కానవస్తున్నది. భవిష్యోత్తర పురాణంలో ఇలా ఉన్నది—

'మార్గశీర్షే సితే పక్షే
షష్ఠీ భరత సత్తమ,
పుణ్యా పాపహరా జ్ఞేయా
శివా వీతా గుహప్రియా.
నిహత్య తారకం షష్ఠ్యాం
గుహస్తారక రాజవత్
శరాజ తేన దయితా
కార్తికేయస్యసా తిథిః'

అని వున్నది. మార్గశిర శుద్ధ షష్ఠి పుణ్యమైన కుమార ప్రీతికరమైన పర్వదినమనీ, నాడు ఆయన తారకుడనే రాక్షసుణ్ణి సంహరించి చంద్రుడివలే ప్రకాశించాడనీ దీని భావం.


చైత్రశుద్ధ షష్ఠినాడు సుబ్రహ్మణ్యుడు జన్మించినా, మార్గశిర శుద్ధ షష్ఠినాడు దేవ సేనాధిపత్యం వహించి తారకుని సంహరించినట్లు చెప్తున్నారు కూడా.

శ్రీరామనవమి, కృష్ణాష్టమి, శివరాత్రి పర్వాల్లో ఉన్నట్లే ఆనాడు భక్తులు ఉపవాసం వుంటారు. నాడు బ్రహ్మచారికి సంతృప్తికరంగా భోజనంపెట్టి వస్త్రాలు యిచ్చి, స్కంద పూజ చేసుకుని మర్నాడు పారణ చేస్తారు. కుమారస్వామి శశ్వద్బాలుడు. ఎల్లప్పుడూ కుమారుడుగానే వుంటాడు. దానికి చిహ్నంగా కుమారుడైన బ్రహ్మచారిని గౌరవించడం జరిగి వుండవచ్చునేమో!

ఆ రోజు అతడు దేవ సేనాధిపత్యం వహించినందున, విజయాన్ని కోరే రాజులు నాడు యీ వ్రతం చెయ్యాలనీ, అలా చేస్తే, పోయిన రాజ్యాలను మళ్లీ సంపాదించగలరనీ భవిష్యోత్తర పురాణమే చెప్తూ ఉన్నది.

పూర్వం తారకుడనే రాక్షసరాజు దేవలోకాన్ని ఆక్రమించి అమరులను నానా హింసలూ పెట్టుతూ వుండగా, ఆ దేవతలు బ్రహ్మవద్దకు పోయి మొరపెట్టుకున్నారు. ఆ తారకుడికి వరాలిచ్చింది బ్రహ్మదేవుడేనట! ఆయన, తారకుడి విషయంలో తానేమీ చెయ్యలేననీ, విష్ణువూ, శివుడూకూడా ఏమీ చెయ్యలేరనీ, పరమేశ్వరుడికి కలగబోయే కుమారుడు మహావీరుడై దేవసేనలకు ఆధిపత్యం వహించి, వాటిని నడుపుకుని యుద్ధానికి వెళ్లి తారకుణ్ణి సంహరించగలడనీ చెప్పాడు. శివుడు హిమాలయాల్లో ఘోరమైన తపస్సు చేస్తున్నాడనీ, నారదుడి సలహాపైని హిమవంతుడు తనపుత్రిక అయిన పార్వతిని ఆయనకు సేవ చెయ్యమనికి నియమించాడనీ. పార్వతిని పరమేశ్వరుడు ప్రేమించి పెళ్లి చేసుకునేటటు చూడాలనీ కూడా తెలియజేశాడు.

తర్వాత దేవేంద్రుడు శివునికి పార్వతి మీద ప్రేమ కలిగించుటకై మన్మథుణ్ణి నియోగించాడు. ఆ ప్రయత్నంలో శివుని నొసటి కంటికి గురియై మన్మథుడు భస్మమైపోయాడు. తర్వాత పార్వతీదేవి ఘోరమైన తపస్సుచేసి శివుని అనుగ్రహం సంపాదించి, ఆయనను వివాహమాడింది. వారికి కలిగిన కుమారుడే కుమారస్వామి. ఇతనికి స్కందుడు, సుబ్రహ్మణ్యుడు మొదలైనపేర్లు ఉన్నవి. సుబ్రహ్మణ్యుడే తెలుగులో సుబ్బరాయుడయింది. అతణ్ణి ఆరుగురు కృత్తికలు దాదు



లయి పెంచారు. వినాయకుడు ద్వైమాతురుడు—అంటే ఇద్దరు తల్లుల ముద్దు బిడ్డడు; కాని స్కందుడు షాణ్మాతురుడు —అంటే—ఆరుగురు తల్లుల బిడ్డడు. అతడు దేవసేనకు నాయకత్వం వహించి తారకుడిమీదికిపోయి, అతన్ని సంహరించి, దేవతల కష్టాలను తొలగించాడు.

ఇది ప్రసిద్ధంగావున్న కుమారోత్పత్తి, కుమార విజయకథ! కొన్ని కొన్ని మార్పులతో వేర్వేరు గ్రంథాలలో కొన్ని కథాంశాలు విభిన్నంగాఉన్నా. ప్రధానకథమాత్రం యిదే!


పాణిని కాలంముందు నుంచీ స్కంద పూజ మనదేశంలో వ్యాప్తమై వున్నట్లు ఆయన సూత్రాలవల్లా, పతంజలి మహాభాష్యంవల్లా తెలుస్తున్నది. అంటే వేల తరబడి సంవత్సరాలనుంచీ యీ పూజ జరగడం మనదేశంలో ఆచారంగా ఉన్నదన్న మాట!

పురాణకథల సంగతి అటుంచి చూచినా ఇది కాలానికీ జ్యోతిర్గణానికీ సంబంధించి వున్నట్లు తోస్తున్నది. ఈ పూజ శరత్సంబంధమైనది. ఏమంటే స్కందుడు శరవణ భవుడు — అంటే రెల్లుగడ్డిలో జన్మించినవాడు. కృత్తికా నక్షత్రంలో అతని జన్మ! ఆరుగురు కృత్తికలూ అతన్ని పెంచారుకదా! కృత్తికా నక్షత్రాలు ఆరు. అవి మంగలికత్తుల్లా ఉంటవి. వాటిసాయంతో కుమారస్వామి తారకుడి మీదికియుద్ధానికి వెళ్లి అతన్ని సంహరించాడు.

దక్షిణదేశంలో తిరుత్తని, తిరుచెందూరు, పళని, స్వామిమల ఆవేచోట్లు స్కందదేవుని క్షేత్రాలలో ప్రసిద్ధాలు! మదరాసుకు చెందివున్న వడివళనికి పళని క్షేత్రానికి వున్నంత ప్రసిద్ధి ఉన్నది. ఆంధ్రప్రాంతంలో సుప్రసిద్ధ నగరమయిన విశాఖపట్నం కుమారస్వామి పేరనే వెలసింది. విశాఖుడంటే కుమారస్వామే!

అయితే కుమారషష్ఠి అనేపేరు ప్రసిద్ధికి రాలేదు. సుబ్బరాయ షష్ఠిగానే ఈ పర్వం ప్రసిద్ధికెక్కింది.

—బులుసు వేంకటరామణయ్య



కొండ చిలువలకు, కొండలకు నిజానికి సంబంధంలేదు—కొండలమీద అడవుల్లో ఉంటేతప్ప. ఇవి అడవుల్లో చెట్లమీద నివసిస్తాయి. దక్షిణఅమెరికాలో వీటిని బోవాలంటారు. ఒక జాతి ఆ ఖండాల్లో నీట్లో నివసిస్తుంది. వాటిని అనకొండా అంటారు. మన ప్రాంతాల్లో వాటిని పైథానులంటారు. పైథాన్లు గుడ్లు పెడతాయి. వెచ్చదనంకోసం వాటి చుట్టు చుట్టలు చుట్టుతుంది. కాని అమెరికా కొండచిలువలు పిల్లల్ని పెటతాయి.

కొండచిలువలు చెట్లమీద సునాయాసంగా సంచరిస్తూంటాయి. వాటి శరీరంమీద ఉండే మచ్చలు, బట్టలు —డిజైను—వల్ల ఇతర జంతువులకు పక్షులకు వీటి ఆచూకీ తెలియదు. దరిదాపులకి వచ్చేస్తాయి. మెరుపు మెరిసిన వేగంతో ఈ పాములు వాటిని పట్టేస్తాయి. శరీరం చుట్టుచుట్టి గట్టిగా నొక్కి, మాంసం ముద్దగా చేసి నోట్లోకి తీసికొంటాయి. తమకన్న పెద్ద పరిమాణంకల జంతువులను కూడా మింగగల్గుతాయి—వాటి దవడలు విపరీతంగా తెరుచుకొంటాయి. తినేముందు ఏదైనా జంతువును మింగగలమా అని సుమారు లెక్కవేసుకొంటాయి. అసాధ్యమనుకొంటే వదిలేస్తాయి. పందుల్ని, లేళ్లని సామాన్యంగా మింగగల్గుతాయి. మనుష్యుల్నికూడా మింగగల్గుతాయి కాని సామాన్యంగా జరగదు.

బోవాలు 15 అడుగుల పొడవు. అనకొండాలు మందంగా బలంగా ఉంటాయి. ఇది తన ఆహారాన్ని నీటిలోకి ముంచి చంపుతుంది కూడా. ఎక్కువ పొడవైంది. సుమారు 30 అడుగులను మించిపోతుంది.

ఒకసారి మింగాక ఆహారం తిరిగి బయటకి పోవడానికి అవకాశంలేదు. దంతాలు కొక్కేలు మాదిరిగా వెనక్కి వంగి ఉండడమే దీనికి కారణం. పెద్ద ఆహారాన్ని పొరపాటున మింగితే పొట్ట చీలిపోయే ప్రమాదం ఉంది. ఒకసారి ఒక పక్షిని రెండు కొండచిలువలు ఒకే సారి పట్టాయి. ఏ ఒకటీ వదలడానికి వీలులేక పోవడంవల్ల, తప్పనిసరి పరిస్థితి ఏర్పడి ఒకపాము మెల్లిగా మరో పామును సాధ్యంచేసికొని పక్షితోపాటు మింగేసింది!

పైథాన్ పట్టువదలితే నిరాహారదీక్ష చేస్తుంది. తప్పిపోకుండా నౌకరు బలవంతాన తెరిచి ఆహారం కూరవలసి వస్తుంది!

—అమ్మి కోనేటిరావు

సుజాత



ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

సుజాత అన్నపూర్ణా ఇంజినీరింగు వర్క్స్‌లో టైపిస్టుగా చేరింది. ఆ కంపెనీ యజమాని నీలకంఠం. అతని కొడుకు శ్రీధర్. శ్రీధర్ సుజాతని వివాహంచేసుకుంటాడు. రాజారావు శ్రీధర్ మిత్రుడు. ఒకప్పుడు రాజారావువల్ల సుజాతకి చాలా అన్యాయం జరిగింది. శరణాలయంలో ఉన్న పాపని అప్పుడప్పుడు వెళ్ళి చూసి వస్తూంటుంది సుజాత. ఈ విషయం శ్రీధర్‌కి తెలియకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తపడుతూ వుంటుంది. చివరికి వుండలేక తన కథ యావత్తూ అతనికి చెప్పేస్తుంది.

15

కళ్ళు మూసుకుని కూర్చున్న అతనికి కొద్ది రోజుల క్రిందట జరిగిన సంఘటన గుర్తువచ్చింది — ఆ సాయంకాలం తను అప్పుడే ఎక్కడ్నించో వస్తున్నాడు. కారు దిగి లోపలికి వెళ్ళబోతూంటే రిక్షాదిగి ప్లాస్టిక్ బుట్టనిండా ఇన్ని బత్తాయి పళ్ళతో లోపలికివస్తున్న వాళ్ళని చూసి అక్కడే ఆగిపోయాడు — వరండా దాకా వచ్చిన వాళ్ళు అన్నపూర్ణమ్మగారిని చూస్తాననటంలో క్షణం తెల్లబోయాడు — కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

'ఆమెపోయి రెండుసంవత్సరా లయింది' అన్నాడు. ఆమె ఆశ్రితవర్గంలో వాళ్ళు కాబోలు అనుకుంటూ. వింటున్నవాళ్ళ మొహాల్లో బాధ స్పష్టంగా కనిపించింది.

'అమ్మగారిని మళ్ళీ దర్శించుకునే అదృష్టానికి నోచుకోలేదన్నమాట.' అందా అమ్మాయి కంట నీరు పెట్టుకుంటూ.

'లోపలికి రండి — నాన్నగా రున్నారు' అంటూ దారితీశాడు. వాళ్ళవిషయం ఆయన కేమయినా తెలుస్తుందేమోనని.

ఆయనకి కూడ వీళ్ళతో పరిచయం వున్నట్లు లేదు — డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాయన లోపలికి వస్తున్న వాళ్ళని అలా తెల బోయి చూస్తూంటే,

'మీకు గుర్తు వుండి వుండదు. హోమ్‌లో జరిగిన మా వివాహానికి మీరిద్దరూ వచ్చి ఆశీర్వదించారు — అసలు జీవితంమీద విరక్తి పెంచుకున్న ఆమెకి ధైర్యంచెప్పి ఓదార్చింది, మళ్ళీ వివాహానికి అంగీకరింప జేసిందీ అమ్మగారే — మీ దయవల్ల మా సంసారం సుఖంగా సాగిపోతోంది నేను ఆఫీసు పనిమీద ఈ వూరొస్తూంటే అమ్మగారిని చూస్తానని తనూ వచ్చింది' అన్నాడతను వాళ్ళని పరిచయం చేసుకుంటూ.

కొంచెంసేపు కూర్చుని, వద్దు వద్దంటున్నా పళ్ళబుట్ట అక్కడే వుంచేసి వెళ్ళబోతూ భక్తిపూర్వకంగా నీలకంఠంగారి పాదాలు కళ్ళకద్దుకుని మరీ వెళ్ళారు ఆ దంపతులు —

ఈ వూళ్ళోనే ఓ హోమ్‌లో వుండేదన్నమాట ఆ అమ్మాయి — ఈ వూరేఅన్న మాటేమిటి స్త్రీ సంక్షేమానికి, పతిత స్త్రీ జనోద్ధరణకి అవిరళమైన కృషి చేస్తున్న సంస్థలు దేశం అంతటా వున్నాయి. వితంతువులు, అవివాహితలు బుద్ధిపూర్వకంగానో పరిస్థితుల ప్రాబల్యం వల్లనో కాలుజారటం సంభవించి దాని వల్ల వాళ్ళు సమాజంలో తలఎత్తుకు తిరగలేని పరిస్థితి ఏర్పడితే అలాంటి వాళ్ళు ఆత్మహత్యలకీ భ్రూణహత్యలకీ శిశుహత్యలకీ పాల్పడకుండా రహస్యంగా ప్రసవించటానికి ఆశ్రయం ఇచ్చే సంస్థలు ఆ దిక్కులేని పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవటానికి శరణాలయాలు, పతివిహీనలైన స్త్రీలకి ఆశ్రయం ఇచ్చి వాళ్ళు తిరిగి ఉత్తమజీవితం గడపటానికి తోడ్పడే సంస్థలు ఇలా ఎన్నో వున్నాయి — అక్కడ స్త్రీలకి వృత్తి విద్యనేర్పి వారు స్వతంత్రంగా జీవించటానికి అర్హులుగా ప్రయోజకులుగా చేస్తున్నారు — అంతేకాదు వారికి వివాహాలు జరిపించటానికి సమాజంలో గౌరవంగా బ్రతకగలిగే అవకాశం కల్పించటానికి వారు కృషి చేస్తున్నారు — కొన్ని సంస్థలకి ప్రభుత్వం గ్రాంటు ఇస్తుంది — మరికొన్ని కొంతమంది సంఘసేవకులు దయార్ద్ర హృదయులు పూనుకుని స్థాపించినవి.

ఈ వూరిలోవున్న చాలా సంస్థలకి అమ్మ విరివిగా విరాళాలిచ్చింది. అక్కడ జరిగిన వివాహాలకి స్వయంగా వెళ్ళి వధూవరులని ఆశీర్వదించి కానుక లిచ్చి వస్తూండేది...'

తల్లిని తలుచుకుంటూ, 'అమ్మా, నువ్వు దేవతవి.' అనుకున్నాడు శ్రీధర్ చెమర్చినకళ్ళని ఒత్తుకుంటూ. 'నీ హృదయంనిండా అమృతమేవుంది — సాటిస్త్రీ కష్టవిషాదాలని చూసి భరించలేని దయార్ద్ర హృదయం నీది — ఒకసారి కాలుజారినస్త్రీ సంఘంలో మళ్ళీ అలాంటి ఘోరానికే బలి అయిపోకుండా గౌరవంగా బ్రతకగలిగే అవకాశం కల్పించటానికి కృషి చేశావు — మాట సహాయం ధనసహాయం ఒకటేమిటి చేతనయినదంతా చేశావు — కాని, నీ కడుపున పుట్టినవేమ, సంఘంలో

పరువూ ప్రతిష్ఠ హోదా అన్నీవున్న స్త్రీని నడివీధిపాలు చెయ్యాలని చూస్తున్నాను.' అనుకుని నిట్టూర్చాడు.

అంతలోనే అతనిలోని రోషం అహం తల ఎత్తాయి. 'వాళ్లు ఈ వివాహానికి అంగీకరించారంటే పరిస్థితులన్నీ తెలిసి సంస్కరణాభిలాషతో ముందుకి వచ్చారు — కాని సుజాత మోసంచేసి నా జీవితంలో ప్రవేశించింది—ఇవాళ పశ్చాత్తాప పడుతున్నానంటూ కడివెడు కన్నీళ్లు కారిస్తే మాత్రం తనుచేసిన వంచన, మోసం తుడిచిపెట్టుకు పోతాయా...

'ఒకమనిషి తప్పుచేసినట్లు తెలిసి, అయినప్పటికీ ఆమెని ఆదరించగలిగే విశాల హృదయమే వున్నప్పుడు, మనకి తెలియకుండా ఆ తప్పు జరిగిపోయి ఆ వ్యక్తి మన జీవితంలోకి ప్రవేశించిన తరువాత అది బయటపడటం జరిగితే ఆమెని క్షమించే శక్తి లోపిస్తుందా...

'లేదు నాకంత శక్తిలేదు — బహుశః నాలో అంత విశాలత్వంకూడలేదు — పెళ్లికి ముందే ఈ సంగతి తెలిసివుంటే నేను సుజాతని అదరించటానికే సిద్ధపడేవాడినా లేక వెనకతీసేవాడినా అన్నదానికి నేను ఇప్పుడు సమాధానం చెప్పలేను—నా హృదయం ఎలా కుతకుత లాడిపోతోందో, ఎంత దుఃఖం అవమానం నన్నుదహించి వేస్తున్నాయో నేను చెప్పలేను — సుజాతని ఎప్పటిలా ఆదరించటం నావల్లకాదు. కావలసినంత డబ్బు పారేస్తాను—ఎక్కడికయినాసరే వెళ్లిపొమ్మంటాను—కావలిస్తే ఆ పాపనికూడ తీసుకుపోతుంది...'

'కాని నాన్నగారు వూరునుంచి రాగానే సుజాత ఏదీ అని అడిగితే ఏం సమాధానం చెప్తావు—ఇంట్లో వాళ్లదగ్గిర, వూళ్లో వాళ్లదగ్గిర ఎన్నాళ్లీరహస్యం దాచకలవు...


'నిజమే సుజాతకి పరువూ మర్యాదా ఎలాగాలేవు—మాకుటుంబ ప్రతిష్ఠ కాపాడుకోటంకోసం అయినా ఆమెని ఇంట్లో వుండనివ్వాలి—అయినా ఈ క్షణంనుండీ తనకీ నాకూ ఎలాంటి సంబంధంవుండదు...

'అంతేనా— అవాళ శ్రీరామ్ రోడ్డు ప్రక్క పడివున్న పసిపాప శవాన్ని గురించి చెప్పినప్పుడు అభాగ్యురాలు ఏ పరిస్థితులలో చిక్కుకుని ఆస్థితికి వచ్చిందో అంటూ జాలి చూపించావు—కల్పనే అయినా సుజాత జ్యోతి విషయం చెప్పినప్పుడు ఆ అభాగ్యురాలిపట్ల సానుభూతి సంతాపాలతో నీ హృదయం నిండిపోయింది —మరి...

'నిజమే — అలాంటి అభాగ్యులపట్ల నాకు జాలివుంది కాదనను—తెల్లవారి లేస్తే ఎంతోమంది కుంటివాళ్లనీ గుడ్డివాళ్లనీ చూస్తూంటాం, వాళ్లంటే జాలిపడి చేతనయిన సహాయం చేస్తాం—అంతమాత్రం చేత మనకీ అలాంటి అంగవైకల్యం కలగాలనికాని మనకి అలాంటిపిల్లలు పుట్టాలనికాని ఎవరూ కోరుకోరు...ఎవరో అభాగ్యులపట్ల జాలి చూపించానని అలాంటి తప్పుచేసిన సుజాతని ఆదరించటం నావల్ల కాదు— అసలు సుజాత నీడకూడ ఈ ఇంట్లో వుండటం నేను భరించలేను — లోకం ఏమనుకున్నా నేను లెఖ్ఖచెయ్యను —నాకు కావలసింది మనశ్శాంతి...

'మనశ్శాంతి--సుజాతని దూరం చేసుకున్నంతమాత్రాన నీకది దొరుకుతుందా— నువ్వు పరిత్యజించిన సుజాతని లోకం పదిరకాలుగా అనుకుంటూంటే విని భరించగలవా—అసలు ఇలాంటి నిందనిమోస్తూ రచ్చకెక్కిన బ్రతుకు బ్రతకగలదా తను— ఆమె ఏ అఘాయిత్యానికయినా పాల్పడితే అప్పుడు నువ్వు పీడ వదిలిపోయింది అని నిశ్చింతగా వుండగలవా...'

అంతర్గతంగా సాగిపోతున్న ఆ సంఘర్షణని భరించలేక పోతున్నాడతను సతమ



మరుగుతున్న నూనె చుక్కలు చుక్కలుగా గుండెలోకి దిగుతున్నంత బాధగా వుంది.

'దీనికి పరిష్కారం ఆలోచించగలిగే శక్తి నాకులేదు.' అనుకున్నాడు నిస్పృహగా.

'నాకు తెలియకుండానే ఇలాంటి సమస్యలో చిక్కుకోటం చిత్రంగా, భగవంతుడు కల్పించిన పరీక్షలాగే వుంది.' అనుకున్నాడు. మరుక్షణంలోనే అతని అధరాలమీద పెంకితనంతో కూడిన చిరునవ్వు మెరిసింది.

'అమ్మా, నేను ఓడిపోయి పారిపోను— ఫలానా అన్నపూర్ణమ్మ కొడుకు పిరికివాడిలా ప్రవర్తించాడు అనిపించుకోను—ఈ పరీక్షకి నిల్చుకుని నిలబడతాను — నీ ఆశయ్యాలకి అనుగుణంగా నడుచుకుంటాను— ఆలోకంలోవున్న నువ్వు నన్నుచూసి గర్వంచేత సంబరపడేలా నడుచుకుంటాను.' తేలికపడిన మనస్సుతో మనసుకి ఆహ్లాదాన్ని ఆనందాన్ని కలిగించే వూహాలతో కారు ఇంటివేపుకి తిప్పాడు.

* * *

'పొను మసిల్లి పోయినట్లు పడివున్న సుజాత, తలమీద మృదువుగా నిమురుతున్నట్లాయి అలసటగా కళ్ళు తెరిచింది. ఎదురుగా భర్త— కొన్నిపటిక్రితం రౌద్రమూర్తిగా గదిలోంచి వెళ్ళిపోయిన శ్రీధర్ కాడతను—తనని లాలించి సేదతీర్చే చల్లని

సుజాత

చిరునవ్వు అతని పెదవులమీద మెరుస్తోంది—కళ్ళు స్నేహవాత్సల్యాలని కురిపిస్తున్నాయి—

సుజాత ఏదో చెప్పబోయింది—కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి—పెదవులు వణికాయి—గొంతు పెగిలి మాటరాలేదు—

ఆమె చెంపలమీదకి జారుతున్న కన్నీళ్ళని మునివేళ్ళతో అద్ది ప్రక్కనే కూర్చున్నాడు శ్రీధర్. 'ఇందాకా చాలా దురుసుగా ప్రవర్తించాను కదూ.'

'లేదు—లేదు' అంటూ లేచికూర్చుంది మెల్లిగా—మాటలకోసం తడుముకుంటున్న వానలా కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయాడు శ్రీధర్.

'లేచి మొహంకడుక్కో—పాపని చూసి వద్దాం.' అన్నాడు చివరికి.

ఉలిక్కిపడి, తన చెవులని తనే నమ్మలేక పోయినట్లు చూసింది సుజాత— కొద్ది గంటలకాలంలో మనిషిలో ఇలాంటి పరివర్తన సాధ్యమా—అసలు తను కలగనటంలేదు కదా—

'పాపకిప్పుడు ఎన్నేళ్ళు' అయోమయంగా తననే చూస్తున్న ఆమె చూపులని తప్పించుకుంటూ అన్నాడు.

'మూడు' కుంచించుకుపోతూ గొంతు పెగల్చుకొంది.

'కొన్నాళ్ళు ఆయాని ఏర్పాటుచేద్దాం— తరువాత ఏదైనా రెసిడెన్షియల్ స్కూలుకి పంపిద్దాం — ఇంటికే తీసుకువచ్చి ఏదో చెప్పొచ్చు కాని దానివల్ల అనేక ప్రశ్నలు సమస్యలు తలఎత్తుతాయి—నాన్నగారు ఏమనుకుంటారో — అందుకే కొన్నాళ్ళు దూరంగా వుంచటమే మంచిది — నీకు చూడాలనిపించినప్పుడు వెళ్ళిచూస్తూండవచ్చు—కొన్నాళ్ళు పోయాక మరేదయినా ఆలోచిద్దాం—అయితే పాప పెరిగి పెద్దదయ్యాక తననిగురించి తనకి ఎలాంటి అనుమానంకాని కించకాని లేకుండా చూసే భారం నాది...' తను చెప్పదలచు కున్నది అతనలా స్పష్టంగా చెప్తూంటే, తనఎదురుగా వున్నది మనిషా దేవతా అన్నట్లు కళ్ళు రెండూ విప్పార్చుకుని అలాచూస్తూ కూర్చుంది సుజాత మాట పలుకు లేకుండా.

'ఇప్పటికి ఇంతకన్నా ఎక్కువగా ఏమీ చెయ్యలేనని చెప్పుకోటానికి నాకే ఎలాగో వుంది...'


'లేదు — లేదు — మీరు అలా అనుకోవాల్సిందేంలేదు — ఇప్పటికే మీరు మానవత్వాన్ని మించిన మంచితనం చూపించారు —మట్టిలోకి విసిరేయాల్సిన మసిబొగ్గులాంటి నన్ను మాణిక్యంలా పదిలపరచుకుంటున్నారు...' విషాదమూ సంతోషమూ కలిసిపోయిన ఆ ఉద్విగ్నతని భరించలేక చటుక్కున అతని అరచేతిలో మొహందాచుకుంది వెక్కి వెక్కి పడుతూ.

ఆమెని ఎలా ఓదార్చాలో తెలియనివాడిలా మౌనంగా ఆమె వెన్ను నిమురుతూ కూర్చుండిపోయాడు కొంచెంసేపు. 'లేస్తావా మరి, ఆ హనుమాయమ్మగారితో మాట్లాడి వద్దాం.' అన్నాడు చివరికి.

'ఏమని చెప్దాం' భయంగా ఇబ్బందిగా ఒక్కసారి అతని మొహంలోకి చూసి కళ్ళు వాల్చేసుకుంది.

'జ్యోతి నీ స్నేహితురాలి కూతురనీ — చేతికి తాడు గుర్తుగా కట్టాను చేతనయితే ఏదైనా చెయ్యి అని ఆమె చెప్పటంవల్లే నువ్వువెళ్ళి పాపని చూశావనీ, ఇప్పుడామె ఎక్కడుందో తెలియదనీ...' మాటలకోసం తడుముకుంటూ క్షణం ఆగాడు.

ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అతనికి తోచటంలేదు.



'పోనీ నువ్వు ఒక్కదానివే అదివరకు లాగే వెళ్ళి చూసివస్తూండు — తరువాత ఏదయినా ఏర్పాటు చేద్దాం' అని అనిపించింది.

'ఛ. తనలో ఔదార్యం ఇలా ఎక్కడికక్కడ ముడుచుకు పోతోందేమిటి—అలా అంటే తను ఎంత బాధపడుతుంది.' అనుకుని మరేమీ మాట్లాడకుండా ఎటో చూస్తూ కూర్చున్నాడు సుజాతని త్వరగా తయారవమని మరోసారి హెచ్చరించి.

ఆమె లేచివెళ్ళి మొహం కడుక్కు వచ్చింది—అయినా ఆ మొహంలో కళా కాంతులు లేకుండా వెల వెల బోతోంది—శ్రీధర్ నిర్ణయం మొదట్లో కాస్సేపు సంతోషాన్నే కలిగించినా ఇప్పుడు ఒక భయంకరమైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాననే బెదురుకూడ అందులో చోటు చేసుకుంది—శరీరము మనస్సుకూడ గజ గజ లాడిపోతున్నట్లుంది. నుదిటి మీదకి జారిన చిరు వెంట్రుకలని కంపిస్తున్న చేతితో వెనక్కి తీసుకుంటున్న ఆమె మొహంలోకి చూడగానే అతనికి ఆమె ఆంతర్యం అర్థం అయిపోయినట్లే అయింది.

'ఇప్పుడు రాగలవా లేకపోతే రేపు వెళ్దాం.' అని అతనంటూంటే.

'ఫరవాలేదు వెళ్దాం పదండి' అంది. ఆ పరిస్థితిని ఎదుర్కోడం అనేది త్వరగా జరిగిపోతే ఇంక దాన్ని వూహించుకుంటూ భయపడాల్సిన బాధ తప్పిపోతుందని.

ఆ వేళప్పుడు వచ్చిన ఆ దంపతులని చూసి హనుమాయమ్మగారు తెల్లబోయింది—పరిచయాలయిం తరువాత,

'ఇంట్లో కాస్త విశ్రాంతిగా కూర్చునే సమయంలో మేమొచ్చి డిస్టర్బు చేశాం— సుజాత ఇంతకుముందే ఈ సంగతి చెప్పింది. వెంటనే వచ్చి మీతో మాట్లాడా లనిపించటంచేత రేపటిదాకా ఆగకుండా వచ్చేశాం.' అంటూ మొదలుపెట్టి శ్రీధర్ పాప విషయం ప్రస్తావించేసరికి హనుమాయమ్మగారు ఆశ్చర్యంతో నోట మాటరాని దానిలా అయిపోయింది ఒక్క క్షణం— స్నేహితురాలి కూతురికన్న ఇంత ఔదార్యాన్ని చూపించగలుగుతున్న ఆ దంపతుల దొడ్డ హృదయాన్ని ఎంతగానో మెచ్చుకుంది. అతను అడిగిన విధంగా అన్ని ఏర్పాట్లు చెయ్యటానికి అంగీకరించింది.

సుజాతకి అదంతా సంతోషాన్ని కలిగిస్తుందనీ ఇంక ఆమె నిశ్చింతగా వుండగలదనీ అనుకున్న శ్రీధర్ అంచనా తప్పిపోయింది.

వారం రోజులు గడిచినా ఆమె మామూలుమనిషి కాలేకపోవటమే కాకుండా రోజు రోజుకి క్షీణించి పోతోందన్న అనుమానం వచ్చింది శ్రీధర్‌కి. డాక్టర్ని పిలుస్తాను అని అతను అంటే—'నయమే డాక్టరెందుకూ ఇప్పుడు—అతను చెప్పిన మందులు టానిక్కులు వాడుతూనే వున్నానుగా' అనేసింది.

'ఇంక నువ్వు ఆ మొండితనం చేస్తే లాభంలేదు—సాయంకాలంరాగానే డాక్టరుకి ఫోను చేస్తాను' అని చెప్పి వెళ్ళాడు

సు జా త

త్రీభార మధ్యాహ్నం.

సాయంకాలం సుజాత మరి వారించ టానికి అవకాశం లేకుండా కొద్దిగా జ్వరం కూడ వచ్చింది—డాక్టరువచ్చి మందు ఇచ్చాడు.

బల్లిలా మంచానికి అంటుకుపోయిన కోడల్ని చూడగానే నీలకంఠంగారి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి—ఆయన అప్పుడే ఢిల్లీ నుండి తిరిగి వచ్చాడు. వస్తూనే సంగతి తెలుసుకుని ఆమెని చూడటానికి వచ్చారు మేడమీదికి.

'ఒక్క రోజు జ్వరానికే ఇలా అయి పోయిందేమిటి?' అంటూ ఆరాట పడి పోయారు.

'వారం రోజుల క్రిందట కళ్ళు తిరిగి మేడమెట్లమీదనుంచి ప డి పో యిం ది—' శ్రీధర్ మెల్లిగా చెప్తుంటే 'మేడమీద నుంచా, దెబ్బలు బాగా తగిలాయా, డాక్టర్ని పిలవలేదూ' అన్నారాయన ఆదుర్దాగా.

'దెబ్బేం తగల్లేదులెండి — డాక్టరు వచ్చాడు బలహీనంగా వుందని టానిక్కులు అవి వ్రాసి ఇచ్చాడు.'

'క్ప ··ఏమిటో—ఆ మందులేం పని చెయ్యలేదేమో···తనవల్ల కాకపోతే మరో డాక్టరుకి చూపించుకుంటాం అని చెప్పక పోయావా' డాక్టరు ఆ సమయంలో ఎదు రుగా వుంటే ఆయనే ఆ మాటలు అనేసే వారేమోనన్నంత విసుగు ధ్వనించింది ఆ గొంతులో.

'మళ్లీ ఎన్నాళ్లకిలేచి మామూలుగా తిరుగుతుందో' అంటూ దిగులు పడి పోయారు.

కాస్సేపటి తరువాత డాక్టరు రాగానే ఆయన ప్రశ్నలతో వూదరగొట్టేస్తూంటే,

'నిన్న సాయంకాలమేకదా వచ్చింది— రేపటికి తగ్గకపోతే బ్లడ్‌టెస్టు చేయిద్దాం —అసలు రేపటికి నార్మల్‌కి వచ్చేస్తుంది' అన్నాడు ఆయన ధోరణికి అలవాటు పడి పోయిన ఆ డాక్టరు.

రాత్రి పది దాటింది—చదువుకుంటూ కూర్చున్న శ్రీధర్ మధ్యలో తల ఎత్తి చూసి, 'నిద్ర పట్టలేదా' అన్నాడు కళ్ళు విప్పార్చుకుని తనవైపే చూస్తున్న సుజాతతో.

'వరసహేమ్మిదో అంటూ
'వరండాలో పడుకుంది—ఏం కావాలి.'

'మీతో కొంచెం మాట్లాడాలనివుంది నిద్ర వస్తోందా.'

'నాకు నిద్దరావటంలేదు కాని నువ్వు ఇప్పుడు హైరాన పడకుండా పడుకుంటే మంచిది. తెల్లవారాక ఎన్ని కబుర్లయినా చెప్దువుగానిలే' పుస్తకం మడిచి టేబిలు మీద పడేసివచ్చి ఆమె ప్రక్కన కూర్చు న్నాడు.

క్షణం మౌనంగా వుండిపోయిన సుజాత మొహం పక్కకి తిప్పుకుంటూ మెల్లిగా అంది. 'మీకు ప్రత్యేకించి చెప్పకపోయినా ఫరవాలేదు—మీతో నాకా నమ్మకం వుంది— నేనేదయినా అయిపోతే పాపనేం చెయ్యాలి అనేది మీరే నిర్ణయించుకోండి.'

చటుక్కున ఆమెని తనవేపుకి తిప్పు కుని, 'ఏమిటిది—పాపనిగురించిన దిగులేమీ పెట్టుకోవద్దు నువ్వు—నువ్వు ఇలాంటి అనవసరపు ఆలోచనలతో మనస్సు పాడు చేసుకోటంవల్లే జ్వరం వచ్చిందసలు— హాయిగా నిద్రపట్టించుకో—తెల్లారేసరికి జ్వరం తగ్గిపోతుంది.' అన్నాడు నీళ్ళు నిండిన ఆమెకళ్ళల్లోకి అనునయంగా చూస్తూ.

'ఏమో నాకా నమ్మకంలేదు — పాబాధ నాలో అణువణువును తినేస్తోంది — పశ్చా త్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదన్న విషయం నిజమే కావచ్చుకాని ఆ పశ్చాత్తా పమే ఆరని అగ్నిలా గుండెలని దహించి వేస్తూంటే భరించటం ఎంతకష్టమో మీరు వూహించలేరు...'

'అబ్బ-నువ్వు ఇదేధోరణిలో మాట్లాడు తూంటే నేనింక వినను...'

'నన్ను చెప్పనివ్వండి— నేను ఎన్నో జన్మలలో చేసుకున్న పుణ్యం అంతాకలిసి మీరునాకు లభించేలా చేసింది—కాని, నేను చేసుకున్న దురదృష్టం ఏమిటో కాని ఆ అదృష్టాన్ని అనుభవించటం నాకు చేతకావటంలేదు—మీరు ఆదరించినా నేను సుఖంగా శాంతిగా బ్రతకలేకపోతున్నాను —అసలు నా జీవితంలో ఇన్ని ఒడిదుడు కులు సమస్యలు ఎందుకు ఎదురవాలి అని ఓవిధమైన కసి కలుగుతూంటుంది అప్పు డప్పుడు — నేను జీవితాన్ని ఎంతగానో ప్రేమించాను — భవిష్యత్తుమీద ఎన్నో

ఎ

బంగారుకోరికలు పెంచుకున్నాను—అవన్నీ ఇలా ఒక్క సంఘటనతో ఛిన్నాభిన్నం కావటం తలుచుకుంటూంటే ఒళ్ళు దహించుకు పోతుంటుంది—ఆ సంఘటన జరగకుండా మనం కలుసుకోటం జరిగి వుంటేనో అది ఎంతగానో అనుకుంటాము —అసలది జరగకపోతే నేనీవూరు రావటం మనం కలుసుకోటం ఎలా సంభవిస్తుంది?' పేలవంగా నవ్వుకుంది. ఆ నవ్వులో అగ్ని పర్వతాలలోని వేడిని దర్శించగలిగిన శ్రీధర్ మౌనంగా ఆమెచేయి నిమురుతూ వుండి పోయాడు.

'గతంలోకి జారిపోయిన ఏ ఒక్క క్షణాన్ని మళ్ళీ మనం భవిష్యత్తులోకి కాని వర్తమానంలోకి కాని తెచ్చుకోలేమని తెలిసినా నాకు చిత్రమైనకోరిక కలుగు తూంటుంది—కాలం ఒక్కసారి వెనక్కి తిరిగి కనీసం నాలుగేళ్ళ వెనకనుంచి నేను మళ్ళీ జీవించటానికి అవకాశం వస్తేనో అని...పాపిష్టిదాన్ని మిమ్మల్నీ ఏడిపిస్తున్నాను అంటూ చేయి ఎత్తి అతని కనుకొలుకులలో నిలిచిన నీటిబిందువులను తుడిచేసింది. అతను ఏదో అనబోయాడు కాని గొంతు పెగలలేదు.

'పాఠాలుపోతే పోయాయి ఇంటిదగ్గరే చదువుకుందామని నేనెందుకు అనుకోలేదు, అని బాధపడుతూంటాను—సరేపోనీ వెళ్ళా లనుకున్నాను, రమకి తలనొప్పిరాకుండా వుంటే ఇద్దరం కలిసివెళ్ళేవాళ్ళం కదా అనిపిస్తుంది — రమ రాలేదని తిన్నగా ఇంటికి వెళ్ళిపోవా లనుకున్న దానిని మధ్య దారిలో మనస్సు మార్చుకుని అక్కడికి ఎందుకు వెళ్ళానా అని ఇప్పటికీ ఏడుస్తూం టాను — వెళ్తే వెళ్ళాను. సరిగ్గా అప్పుడే వాళ్ళ అత్తగారికి జబ్బుచేసి వాళ్ళంతా వూరికి వెళ్ళాలా—ఇందులో ఏ ఒక్కటి జరగకపోయినా నేను ఇవాళ ఇలా గుండెపగిలి రోదించే స్థితి కలిగేదికాదు— దానికి మీరు చెప్పే సమాధానం ఒక్కటే— నేను నిన్ను ఎప్పటిలా ఆదరిస్తాను అదంతా మరిచిపో అని. కాని నేను మరిచిపోదామన్నా అది నన్ను వదలటం లేదు. ఆ గతం అలా నన్ను వెంటాడుతూంటే తప్పించుకుని ఎక్కడికి పారిపోవాలో తెలియటంలేదు—'

ఏం చెప్తాడు శ్రీధర్. ఉన్మాదినిలా అలా చెప్పుకుపోతున్న భార్యని చూస్తుంటే త్వరలోనే [illegible] తన రహస్యం తన నోటితోనే బట్ట బయలు చేసుకుంటుందేమో అనిపించింది.

చాలాసేపు మాట్లాడటంవల్ల అలస టగా కళ్ళు మూసుకుంది—తదేకంగా ఆమె మొహంలోకి చూస్తున్న అతనికి ఏనాటిదో తల్లితండ్రుల సంభాషణ గుర్తువచ్చింది—

'ఈ సమాజంవాళ్ళు ఎలాగో వీళ్ళకి పెళ్ళి అయిందని పిస్తున్నారు కాని ఆ సంసారం సుఖంగా సాగుతుందంటావా.' అన్నారు నీలకంఠంగారు, మరునాడు హోమ్‌లో జరగబోయే వివాహాన్ని గురించి ప్రస్తావిస్తూ.

'అన్నీ తెలిసి ఇష్టపడి చేసుకుంటు న్నప్పుడు ఇంక బాధపడే అవకాశం ఎలా వుంటుంది' అంది అన్నపూర్ణమ్మ.

'అదికాదు— సంస్కరణాభిలాషతోకాని, ఒక అమాయకురాలిని ఉద్ధరిస్తున్నామనే దృక్పథంతో కాని వాళ్ళు ఈ వివాహానికి అంగీకరించి వుండవచ్చు — అక్కడి పరి సరాలు పరిస్థితులు మళ్ళీ ఈ అమ్మాయి పొరపాటు చెయ్యటానికి అవకాశం కల్పిం చితే ?' అంటూ తన సందేహాన్ని బయట పెట్టా రాయన.


'అలా జరిగిన [illegible] అక్కడా వున్నాయి — ఆ వివాహ బంధాలు తెగిపోతున్నాయి—అలాగని నిరాశపడి వూరు కుంటే ఎలా—ఆ స్త్రీలతో పరివర్తన తీసుకు రావాలనీ, మళ్ళీ గౌరవంగా బ్రత కాలనే కోరిక వున్నవాళ్ళ అవకాశాలు లేకుండా మగ్గిపోకూడదనీ మా ప్రయత్నం' అందావిడ—

శ్రీధర్ హృదయం కలుక్కుమంది. 'అవకాశం దొరికితే అడుగడుగునా కాలు జారే స్త్రీలు వుంటారేమో—కాని ఒక్క సారి జరిగిపోయిన పొరపాటుకి జీవితాంతం కుమిలిపోయే వారుకూడ వుంటారు' అను కున్నాడు.

'మోసంచేసి మీ జీవితంలో ప్రవేశించి మీ జీవితాన్నంతటినీ కలుషితం చేసిన ఈ అభాగ్యురాలిని ఎప్పుడైనా గుర్తు తెచ్చు కుంటారా' అంది హఠాత్తుగా కళ్ళు తెరిచి.


'నువ్విలా మాట్లాడితే నరసమ్మని లేపుకొచ్చి నీ దగ్గర కూర్చోపెడతాను.' అన్నాడు.

'వద్దువద్దు — ఆ పనిమాత్రం చెయ్య కండి.' అంది అతని చెయ్యి గట్టిగా



పెట్టుకుని.

'అయితే మాట్లాడకుండా పడుకుని బాధని ఓర్చుకుంటున్నట్లు ఆమె మళ్ళి నిద్రపో...' అంటున్న అతను, విపరీతమైన కవళికలలో మార్పురావటం, చేతో గుండె



అదుముకోటం చూసి, 'ఏమయింది' అన్నాడు ఆత్రంగా,

అలసటగా కళ్ళు తెరిచి ఒక్కసారి ఆరాధనగా అతని కళ్ళల్లోకి చూసింది—మరుక్షణం అవి మళ్ళీ మూతలు పడిపోవటం, తన చేతిలో వున్న ఆమె చెయ్యి నిర్జీవంగా వాలిపోవటం గుర్తిస్తూ అప్పటిలా మళ్ళీ స్పృహతప్పి పోయింది కాబోలు అనుకోబోయాడు దిగులుగా—కాని ఆ మాత్రం ధైర్యంకూడ అరక్షణం కంటె ఎక్కువ నిలుపుకోలేకపోయాడు.

'సుజా!' అతని గుండెలని చీల్చుకు వచ్చిన ఆర్తనాదంతో గాఢ సుషుప్తిలో వున్న అందరూ త్రుళ్ళిపడి లేచారు—నిముషాలమీద డాక్టరు వచ్చాడు. ఆమె చచ్చిపోయింది అని చెప్పటంకన్న అతను చేసింది ఏమీలేదు.

యజమానులముందర గట్టిగా ఏడ్చే ధైర్యంలేక నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని లోలోపలే కుమిలిపోతూ తలో మూలా నిలబడిపోయారు నరసమ్మవాళ్ళు.

'సాయంకాలం చూసినప్పుడుకూడ జనరల్ వీక్‌నెస్ తప్ప మరేలాంటి కాంప్లికేషన్సు లేవు—ఇంత హఠాత్తుగా—వ్వె—ఐయామ్ వెరీ సారీ' అన్నాడు డాక్టరు ఆర్ద్రంగా శ్రీధర్ భుజంమీద చెయ్యివేసి.

'పాపమ్మ గుండె జబ్బుతోనే చచ్చిపోయిందిట' అన్నారు నీలకంఠంగారు ఆగకుండా వొడిపోతున్న అశ్రువులని ఒత్తుకుంటూ.

'తనలోని ఆవేదనకి ఆహుతి అయిపోయింది' అనుకున్నాడు శ్రీధర్ అర చేతిలో మొహం దాచుకుని కుమిలిపోతూ.

(అయిపోయింది) ●

(కథా గమనానికి వీలుగా కొన్ని సేవాసంస్థల ప్రసక్తి తీసుకు రావటం జరిగిందనీ, ఆ సంస్థల కృషిని విమర్శించే ఉద్దేశ్యము ఏమీలేదని మనవి చేసుకుంటున్నాను. —రచయిత్రి)

వారఫలం

22-11-1968 శుక్రవారం మొదలు
28-11-1968 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. పాటివారిలో గౌరవప్య బాగా ఉంటుంది.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

వృషభం: ఇంతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాల్లోనే చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం దబాగా ఉంటుంది. పజ్జవ సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిథునం: ఫలితం మాట యెలాగ ఉన్నా ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు దబాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కర్కాటకం: వ్యాపారంలో పాటివారితో పోటీ పెరుగుతుంది. భాగస్వాములతో కలిపి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది. వారం ఆఖరులో అనుకోని చికాకులకు గురి కాగలరు.

స్త్రీలకు:— పాటివారితో మాట పట్టింపులు తగవు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: ఇప్పుడు మీరు జరిపే వ్యవహారం వల్ల ముమ్ముందు కూడా ఉపయోగం ఉంటుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో చిదాకులు యేర్పడతాయి. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. పాటివారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆడంబరం అకోసం వ్యయం చేస్తారు.

కన్య: మీరు యెంతగానో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు వారం మధ్యలో లాభిస్తాయి. సాంఘిక కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరుతాయి.

తుల: వ్యాపారంలో సాటివారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన వ్యవహారాలు అలాభించగలవు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు:— సంతోషకరమైన వార్తలను వింటారు. బంధువులకు సహాయం చేస్తారు.

వృశ్చికం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. సమయానికి ఏదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

ధనుస్సు: ఇదివరకు మీ కార్యక్రమాల్లో ఏర్పడిన అవరోధాలు తొలగి పోతాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం: కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. మీ మాటలకు వక్రార్థాలు తీసే ప్రమాదం ఉంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో ఆదాయం అభివృద్ధి అవుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు:— అధిక వ్యయం జరుగుతుంది. బంధు మిత్రులను కలుసుకొంటారు.


కుంభం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో ఆకస్మికంగా చికాకులు ఏర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది.

మీనం: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు వారం మధ్యలో లాభిస్తాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం ఆఖరులో చికాకులకు గురి కాగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

—మహేష్





బాంధవ్యం

కౌశీనాధ ఉ కౌళినాధ

ఎలా తెలుస్తుందో తెలియదుకానీ, మాధవరావు యింట్లో కొబ్బరిచెట్లు కాయలు దింపించాలనుకున్న రోజునే వీరయ్య ఊళ్లోకి వస్తాడు. మాధవరావుకి కనిపించి 'కాయలు దించాలా బాబూ' అంటాడు. మాధవరావుకి ఆశ్చర్యం వేస్తుంది. ఒకట్ కాదు, రెండుకాదు నాలుగుసార్లు అలా జరిగింది. ఇవాళ నిద్రలేస్తూనే కిటికీ లోంచి కొబ్బరి చెట్లని చూసి కాయలు దింపించాలనుకున్నాడు. కాయలు దింపించే బాధ్యత ఇంటివాళ్లు తన మీద పెట్టారు. ఇవాళ వీరయ్యా వస్తాడేమో అనుకున్నాడు మాధవరావు. వీరయ్యని ఎక్కడో చూసినట్లుంది కాని ఎక్కడో గుర్తుకి రాదు.

తొమ్మిదిన్నరయింది. లేచి మొహం కడుక్కుని తల దువ్వుకున్నాడు. తల దువ్వుకుంటూంటే నుదుట పాపిడి దగ్గర మచ్చ కనపడింది. అది చూడగానే లక్ష్మీపురం గుర్తుకు వస్తుంది. వెంటనే గోపాలం, సీతమ్మగారూ గుర్తు వస్తారు. జగన్నాధంగారూ, రుక్మిణీ కూడ గుర్తుకు వస్తారుగాని వాళ్లతో అంత బాగా పరిచయం లేదు తనకి. అసలు గోపాలంతోటే రెండురోజుల పరిచయం.

రెండురోజులు మాత్రమే పరిచయం వున్న వ్యక్తులు సాధారణంగా రోజూ గుర్తు రారు. కానీ, ఈ తలమీద మచ్చ వాళ్లని రోజూ గుర్తుకి తెస్తుంది. ఈ దెబ్బ తనకి లక్ష్మీపురంలో తగిలింది. చిన్న చెరువు గట్టుమీద జారి పడ్డాడు. తలకి రాయి తగిలి బాగా రక్తం కారింది. అప్పుడు తనని అంబులెన్సులో ఈ ఊరు తీసుకు వచ్చారు. రక్తం బాగా కారడం వల్ల రక్తం ఎక్కించవలసి వచ్చింది. నాలుగు రోజులు ఆస్పత్రిలో వున్నాడు. తనతో ఇక్కడికి గోపాలం కూడ వచ్చి వెళ్లాడు. వెళ్లేటప్పుడు తనకి కనిపించలేదు. అంతే ఆ తర్వాత తను లక్ష్మీపురం వెళ్లలేదు.

లక్ష్మీపురంలో మామయ్యకి, అక్కయ్యా, అంటే, తనకు పిన్ని వుంది. వాళ్లయింటి పక్కనే గోపాలం వాళ్ల యిల్లు. తను మామయ్యతో వాళ్ల యింటికి వెళ్లినపుడు పక్క యింటి గోపాలంతో పరిచయం అయింది.

జుట్టు దువ్వుకుని బయటకు వచ్చేసరికి సిటీబస్సు వస్తోంది. అతను దానికోసం ఆగలేదు. వెళ్లవలసిన మైలున్నరదూరం నడిచే వెడతాడు.

దారిలో కాఫీహోటలుదగ్గర ఆగాడు. కానీ లోపలికి వెళ్లలేదు. కాఫీ తాగాలని కోరిక లేకపోలేదు. కానీ ముందుకు నడిచాడు రోజూలాగా. కాఫీతాగే స్తోమత మాధవరావుకు లేకపోలేదు. కానీ అయిదేళ్లుగా అతను కాఫీ తాగడంలేదు. కాఫీ యిరవై పైసలు. నెలకు ఆరురూపాయలు.

దారిలో పోస్టాఫీసు సందులోకి ఒకసారి నడిచాడు. ఉత్తరాలు వస్తాయనే వెడతాడు. పోస్టాఫీసు యెదురుగావున్న పెంకుటిల్లుని

అప్రయత్నంగానె చూస్తాడు. ఆ యింట్లో ఒక గదిలో వుండేవాడు తను. అద్దె ఎక్కువని యిక్కడికి వచ్చేశాడు. ఆ దారిన వచ్చినప్పుడల్లా పోస్టాఫీసుదగ్గర ఆగుతాడు. ఆ యింటిని చూస్తాడు. చూడాలని కుతూహలం. సాన్నిహిత్యం అది.

పోస్టుమాన్ బయటికి వస్తున్నాడు. 'ఉత్తరాలున్నాయా' అని అడిగాడు. మామూలు ప్రకారం లేవు అనేసి ఆ తర్వాత వెదికాడు. ఒకటివుంది. అతని మరదలు విజయ రాసినది. ఆత్రంగా విప్పి చదివాడు.

'ప్రియమైనవారికి...' అని వుంది సంబోధన. అలాగే రాస్తుంది. వరసలో పిలవదు. సిగ్గు, మరోలా పిలవలేదు. నువ్వు అని ఒకసారి, మీరూ అని వోసారి అంటుంది.

'ఇక్కడికి రావడం మానేసి చాలాకాలం అయింది. నామీద కోపమా? ఎందుకు రావటంలేదు ? ఒకసారి వచ్చి చూసిపోవడానికేం?...నాన్న యింకా ఆ సంబంధం గురించి మాట్లాడుతూనే వున్నాడు. అది చేస్తే తన ఎనిమిదివేల రూపాయల అప్పు తీరుతుందని ఆశ...

ఉత్తరం నాలుగైదుసార్లు చదివాడు. విజయ రాసిన వుత్తరాలు ఎప్పుడూ అలాగే చదువుతాడు.

విజయ మాధవరావుకి కావడానికి మరదలే అయినా అంతకన్నా చాల ఎక్కువ. ఆరో ప్రాణం అతనికి. విజయ లేకపోతే తనకి జీవితంలో ఏమీలేదని అతనికి స్పష్టంగా తెలుసు. విజయ సాంగత్యంలో పరాధీనతని సంతోషంగా అంగీకరిస్తాడు.

'ఎందుకు రావడంలేదు ?' అంటుంది ప్రతీసారీ. ఇన్నిసార్లు చెప్పదు. ఒక్కసారే చెబుతాడు. ఇంకో రెండునెలల్లో మామయ్య అడిగినది యిచ్చి విజయని దక్కించుకుంటాడు తన అయిదేళ్ల యజ్ఞం అప్పటికి పూర్తి అవుతుంది. మామయ్య ఆర్థిక పరిస్థితిపై తనకి యేమీ బాధ్యత లేకపోయినా, విజయకోసం యే షరతుకైనా అంగీకరిస్తాడు.

వ్యాపారంలో పూర్తిగా చితికిపోయిన మామయ్య, అప్పులు తీరుస్తానని, పెళ్లి ఖర్చులు భరిస్తానని ముందుకువచ్చిన రెండో పెళ్లి రంగనాధానికి కూతుర్ని యివ్వడానికి అంగీకరించారు. విజయద్వారా సంగతి తెలుసుకున్నాడు తను. వెంటనే మామయ్యను కలుసుకున్నాడు.

'చూస్తున్నావుగా మాధవ్' నా పరిస్థితులు. ఈ అప్పులబాధనుంచి తప్పుకోవాలంటే యిదొక్కటే మార్గం' అన్నాడు విచారంగా.

తను చాలసేపు ఆలోచించాడు. ఆదుకుందామంటే తను ఆస్థిపరుడుకాదు తన దగ్గర ఎక్కువ ధనంలేదు. ఉద్యోగమే ఆధారం.

తను ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఆతర్వాత విజయద్వారా తనకి తెలిసిన విషయ మేమిటంటే ఆ డబ్బుని కొంత వ్యవధిలో మాధవరావ్ సమకూర్చగలిగిన పక్షంలో తను మరికొంతకాలం ఈ పెళ్లిని వాయిదా వేయడానికి అభ్యంతరంలేదని.

తను ఆనాడే నిశ్చయించుకున్నాడు. తన దగ్గరవున్న డబ్బుకి తోడుగా మరికొంత గడించాలని, నిలవ వేయాలనీ, అది యజ్ఞంలా నిర్వహించాలనీ.

ఆడపిల్లతండ్రి పిల్లనివ్వడానికి షరతు విధించడంలోగల సబబు విషయం ఆలోచించలేదు మాధవరావు. మామయ్య తన పరిస్థితిని వినియోగించుకుంటున్నాడన్న ఆలోచనకూడ రాలేదు మాధవరావుకి. మామయ్య సూచనగాఅడిగిన సొమ్ము పది వేలూ ఎలా కూడబెట్టాలనే ఆలోచనే అతనికెప్పుడూ. విజయతప్ప అతని ఆలోచనల్లోకి యింకేమీరాదు. విజయ అల్లాంటిది. విజయమీద ప్రేమ, విజయ సాన్నిహిత్యం విలువ అల్లాంటివి. విజయ అవసరం అతని కల్లాంటిది.

పోస్ట్‌మాన్ దారిలో కనబడ్డ యింకెవరికో ఉత్తరాలిస్తున్నాడు. ఈ పోస్టుమాన్ అంటే కోపం మాధవరావుకి. తల్లీ, తండ్రీ పెద్ద వాళ్లయాక వాళ్ల మానానవాళ్లని వదిలేసి తనబతుకు చూసుకుంటున్నాడు. రక్త సంబంధం అంత తేలికగా ఎలా వదిలించుకోగలరో అర్థంకాదు అతనికి. తండ్రీ తల్లీ,అన్నలూ, తమ్ముళ్లూ, చెల్లెళ్లూ యిలారక్తం పంచుకు పుట్టినవాళ్లలో భేదాభిప్రాయాలు వచ్చాయన్నా ఒకరినొకరు పరాయివాళ్లుగా చూసినా సహించలేదు మాధవరావు. రక్తసంబంధాన్ని తెంచుకోవడాన్ని ఊహించనైనాలేదు మాధవరావు.

దారిలో వీరయ్య కనబడ్డాడు. అయితే తనని పలుకరించలేదు. అసలు చూడలేదు. మాధవరావే అతన్ని పిలిచాడు. సాయంత్రం కాయలు దింపుదుగానిరా' అన్నాడు—వీరయ్య తల వూపి వెళ్లిపోయాడు. వీరయ్యని యెక్కడ చూశాడో యింకా మాటుకూడ గుర్తుకు రాలేదు. ఎప్పుడో హఠాత్తుగా గుర్తుకు వస్తుందిలే అనుకున్నాడు.

ఆఫీసుకి వెళ్లేటప్పటికి పదీ యిరవై అయింది. రిజిస్టరులో సంతకంపెట్టి సీటులో వచ్చి కూర్చున్నాడు. పని చెయ్యబుద్ధికాలేదు

ఆ రోజు యిరవై ఎనిమిదో తారీఖు. ఇంక రెండు రోజులు. జీతం వస్తుంది. వంద రూపాయలు బ్యాంకులో వెయ్యాలి. మిగిలిన దాంతోటే సర్దుకోవాలి. బ్యాంకులో డబ్బు కడుతున్నప్పుడల్లా విజయ తనకి చేరువగా వస్తున్నట్లుంటుంది. ఒక్కొక్క నెల గడచినకొద్దీ, విజయ తన చేతులలోకి నడచి వస్తున్నట్లుగావుంది. విజయ యింక రెండంగల దూరంలో వుంది.

విజయను తను మొదట చూసినది లక్ష్మీపురంలో, చెరువుగట్టున. నాకు యీత నేర్పవా అంది. నేర్పుతాలే అన్నాడు. నిజానికి తనకి యీత రాదు. గోపాలానికి బాగావచ్చు. కావాలని గోపాలంతో పరిచయం చేసుకున్నాడు యీత నేర్చుకోవడంకోసం.

గోపాలం తల్లి సీతమ్మగారు. తండ్రి జగన్నాధంగారు. చెల్లెలు రుక్మిణి. పెద్ద యిల్లు వాళ్లది. అయినా బాగా పాతది. చాలకాలం అయింది కట్టించి. పెద్ద పెరడు వుంది. దానినిండా రకరకాల మొక్కలు. రాధా మనోహరాలు, మూరు వరహాల మొక్కలు. ఒక పక్కన. పక్కనే నంది వర్ధనం చెట్టు. సన్నజాజి తీగ పందిరిమీద పాకుతూండేది. పువ్వులు అలా చూస్తూ వుండాలనిపించేది. గన్నేరు పువ్వులుకూడ చాల ముచ్చటగా వుండేవి. ఆయనా చాల శ్రద్ధగా తోటపని చేసేవాడు. పెరట్లో ఏ భాగమూ వృధాగా పోనిచ్చేవాడుకాదు. పూలమొక్కలో, కూర మొక్కలో వేసేవాడు. రోజూ పొద్దున్న అన్ని మొక్కలకీ నీళ్లు పోసేవాడు. సాయంత్రంవచ్చి అన్ని మొక్కలనీ పరీక్షించేవాడు. చీడపుంటే తీసేసేవాడు. దొంగళీ పురుగులనీ పుల్లతో లాగేసే

గాడు. ఆయన పద్ధతి కొంచెం విచిత్రంగా వుండేది. ఆ యింట్లో ఏ భాగం చెడిపోయినా బాగు చెయ్యనిచ్చేవాడుకాడు. పాత భాగాలనే మళ్ళీ సరిగ్గా పెట్టమనేవాడు. కొత్త అనేది ఒప్పుకొనేవాడుకాడు. తను చిన్నప్పటినుంచీ తిరిగిన యిల్లు అలాగే వుండాలనేవాడు. సీతమ్మగారూ అలాగే అనేది. వాళ్ళది మేనరికం. ఇద్దరూ పుట్టినప్పటినుంచి ఆ యింట్లోనే వున్నారు.

ఆ యింటి గోడ దగ్గర నిలబడితే చెరువు, చెరువు గట్టు, చెరువుగట్టు నున్నసొట్టండు కన్పిస్తాయి.

జగన్నాధంగారు వ్యాపారం చేసేవారు. బాగానే నడిచేది.

ఈ పాటికి గోపాలం, రుక్మిణీకూడ పెద్దవాళ్ళయి వుంటారు. రుక్మిణికి పెళ్ళియ్యాడు వచ్చి వుంటుంది.

సాయంత్రం కాగానే యింటికి బయలు దేరాడు. వీరయ్య అప్పటికే వచ్చాడు. కొయ్యమంటారా బాబూ' అన్నాడు వీరయ్య. కానిమ్మన్నాడు మాధవరావు.

వీరయ్య కాళ్లకి తాళ్ళు కట్టుకుంటూంటే 'నిన్నెక్కడ చూశానో గుర్తుకు రావడం లేదోయ్!' అన్నాడు.

'అన్ని ఊళ్ళూ తిరుగుతుంటాను. ఎక్కడైనా చూసి వుంటారు' అన్నాడు వీరయ్య.

వీరయ్య చకాచకా ఎక్కుతూంటె మాధవరావు గుండెలుగ్గబట్టుకుని

బాంధవ్యం

చూశాడు. తనకి తెలియకుండానే 'జాగ్రత్త' అన్నాడు. పడిపోతాడేమోనని భయం మాధవ రావుకి. అక్కడ మంచి పడితే రూపం కూడ మిగలదు.

వీరయ్య పైకి ఎక్కి లేత కాయలు వుంచేసి ముదురువన్నీ కోసి కిందికి వేశాడు. ఒకటి రెండు పక్కింట్లో పడిపోవడం, వాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా లోపల పెట్టుకోవడం చూశాడు మాధవరావు.

వీరయ్య దిగి వచ్చాక ఇంటి వాళ్ల తరఫున డబ్బు యిచ్చాడు.

'వీరయ్యా, ఎందుకంత తొందరగా ఎక్కుతావు? కాస్త జాగ్రత్తగా ఎక్కరాదూ' అన్నాడు యింకోసారికి జాగ్రత్త చెబుతూ.

'ఏముంది బాబూ! అలవాటే. క్షణాల్లో యెక్కుతాను. సావే వస్తే ఆపగలమా బాబూ...៖...అయినా, ఎప్పుడో ఒహా కొబ్బరి చెట్లమీదే చచ్చిపోతాను బాబూ' అన్నాడు వీరయ్య.

'ఛ ఛ' అన్నాడు మాధవరావు. అంటూంటేనే అతని మొహం వెలిగింది.

'ఇప్పుడు గుర్తుకు వచ్చింది. నిన్ను చూసింది లక్ష్మీపురంలో ... అవునా?' అన్నాడు వుత్సాహంగా.

వీరయ్యకి గుర్తు రాలేదు.

మాధవరావు జ్ఞాపకం చేశాడు. 'చిన్న చెరువు ... ఈతలు కొట్టాం నేనూ, ఇంకో కుర్రాడూ...ఆ రెండో అతను రోజూ వచ్చేవాడు...పేరు గోపాలం'.

వీరయ్య పెద్దవాడు. జ్ఞాపక శక్తి తగ్గింది. జ్ఞాపకం వస్తూన్నట్లుగా తల ఆడించాడు.

'గోపాలం ఎప్పుడూ చిన్న చెరువు దగ్గరే వుండేవాడు. నువ్వు చెరువు దగ్గర కొబ్బరికాయలు కోస్తుంటే చెరువులో పడిపోయినవి దూకి తీస్తూండేవాడు. పంతం పట్టి సరిగ్గా కొబ్బరికాయ మీదకే దూకేవాడు. ఎప్పుడో ఈతలోనే చచ్చిపోతావన్నావా రోజు... 'తప్పు బాబూ అలా అనకూడదు' అన్నావునువ్వు' అన్నాడు మాధవరావు.

వీరయ్య తల వూపాడు. అంతలోనే మొహంలో విషాదం కనిపించింది. 'కాని బాబూ ... ఆ ఈతలోనే పోయాడు ఆ బాబు' అన్నాడు.


'గోపాలం పోయాడా? ఏం జరిగింది.'

'మామూలుగానే ఈతలు కొడుతున్నాడు బాబూ. ఒకసారి ఎత్తు గట్టుమీదనుండి దూకాడు. అంతే మళ్ళీ తేలలేదుట. అక్కడ అట్టే లోతులేదని, అడుగున బురదవుందనీ అనుకున్నారు...'

మాధవరావు గుండె పట్టుకున్నాడు. గోపాలం కళ్లముందు మెదిలాడు. వాళ్ల నాన్నగారికి ఆశాజ్యోతి అతను. ఆయన బాధ్యతలన్నీ ఈపాటికి కొడుక్కి అప్పగించి విశ్రాంతి తీసుకుంటూ వుంటాడు' అని యిన్నాళ్ళు వూహించుకున్నాడు మాధవ రావు.

గోపాలం తనకన్న అయిదేళ్ళు పెద్ద. తను అతన్ని ఎక్కువగా చూడకపోయినా గుర్తున్నాడు. అతనికి ఈత బాగావచ్చు. రకరకాల ఈతలు కొట్టాడు. బారు ఈత ఈదాడు. వెల్లకిలా పడుకుని నీటిమీద తేలాడు. ఒకచోట మునిగి ఇంకోచోట తేలాడు. నీటిలో పిల్లిమొగ్గ వేశాడు.

'కూతురు రుక్మిణమ్మగారి పెళ్ళి అయ్యాక ఆ యిల్లు బాగా చితికిపోయింది బాబూ. జగన్నాధంగారికి వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. ఆయన తట్టుకోలేక పోయారు. మనిషి శీలా అయిపోయారు. అప్పుడే గోపాలం చదువు మానేసి వుద్యోగంలో చేరాడు. నాన్నగారి అప్పులన్నీ తీరుస్తానన్నాడు బాబూ. రాత్రీ పగలు



పనిచేశాడు. ఎనిమిదివేలు అప్పులున్నాయట బాబూ ఇంకా ... అంతట్లోనే యిలా ముంచుకు వచ్చింది...'

వీరయ్య కళ్ళు తుడుచుకున్నాడు.

'నేను వాళ్ళింట్లో యిదివరకు పని చేశాను బాబూ. సీతమ్మగారినీ, జగన్నాథం గారినీ నేనే ఎత్తుకొనేవాడిని. వాళ్ళు బంతి ఆడుకుంటూంటే పక్కకి పోయి పప్పుడు తెచ్చిచ్చేవాడిని. చెరువుగట్టుకి షికారు తీసుకెళ్ళేవాడిని. అప్పుడు ఒకే బస్సు వుండేది. బస్సులో ఎంతమంది ఎక్కుతున్నారో ఎంతమంది దిగుతున్నారో లెక్కపెట్టేవాడు.'

వాళ్ళు ఆ యింట్లో ఒక వేపచెట్టుని పెంచేవారు బాబూ. అది యిప్పటికీ వుంది. దానికి రోజూ పంతాలు పడినీళ్ళు పోసేవారు. రోజూ చుట్టూ మట్టితీసేవారు. నిచ్చెన ఎక్కి రాధా మనోహరం పువ్వులుకోసి యిచ్చేవారు జగన్నాథం బాబు.

ఆ యిల్లంటే వారికి ప్రాణం.

ఆయింటి ముందుగదిలోనే వాళ్ళపెళ్ళి జరిగింది. అక్కడే గోపాలం బాబూ రుక్మిణమ్మా పుట్టారు. అక్కడే రుక్మిణమ్మకి పెళ్ళయింది. అక్కడే చచ్చిపోవాలనే వారు ఆయన...'

మాధవరావు బాధగా చూశాడు.

'కానీ బాబూ మొన్ననే ఆయిల్లు వేలం వేశారు. జానకి రామయ్యగారు అని ఎవరో ఎనిమిదివేలకి కొనుక్కున్నారట బాబూ!

మాధవరావు యింక వినలేదు. కాసేపు మాట్లాడలేక పోయాడు. జగన్నాథంగారూ సీతమ్మగారూవున్న పరిస్థితిని తలచుకుంటు న్నాడు.

'కొడుకులేదు. కూతురు పెళ్ళయి వెళ్ళి పోయింది. ఏదో బీదసంబంధం చేశారు. ఆదుకునే రక్తసంబంధీకులు ఎవరూలేరు. పాపం ఆ యమ్మకీ, బాబుకీ రావలసిన కష్టాలుకావు...' అన్నాడు వీరయ్య.

రెండు నిమిషాలకి తేరుకున్నాడు మాధవరావు బాధపడి ప్రయోజనంలేదు. అందరికీ ఏదోరకమైన కష్టాలుంటాయి. అన్నీ విని బాధపడితే దీనికి అంతువుండదు.

తనకీ కష్టాలూ, సుఖాలూ, బాధలూ, ఆశలూ, నిరాశలూ అన్నీ వున్నాయి. తనకీ జీవితంవుంది. తనూ అయిదేళ్ళు కష్టాలు

బాంధవ్యం

కేద్దాడు. దివ్వా చేంపుకున్నాడు. మనసా కంపుకున్నాడు. కోరికలు సరదాలు వదిలేకాడు. అబాధలు చాలు. తను పోగొట్టుకున్న సుఖాలు చాలవున్నాయి. అనిర్వచనీయమైన ఆనందంకోసం, — విజయ సాన్నిహిత్యంకోసం—తను ఇదంతా చేశాడు. ఇప్పుడు ఫలం చేతిలోకివస్తోంది. ఇది సంతోషించవలసిన సమయం. కష్టాలు అన్నీ మరచిపోయి సుఖపడవలసిన సమయం. ఎక్కడ ఆనందంవుంటే అక్కడ చూడాలి. తన సుఖం ఎక్కడవుంటే అక్కడికి పోవాలి. విజయ కావాలనుకున్న మనసు విజయని పొందాలి. జగన్నాథంగారికి, సీతమ్మగారికీ కష్టాలుంటే దానినిగురించి పట్టించుకోవలసినదీ, బాధ్యత వహించవలసినదీ వాళ్ల రక్త సంబంధీకులూ, రక్తం పంచుకున్న వాళ్లూ, తనుకాదు.

మాధవరావు మనస్సు తేలిక పడింది. జగన్నాథంగారూ, సీతమ్మగారూ మనసులోంచి వెళ్లిపోయారు. విజయ దివ్య మోహనరూపం కనిపించింది. విజయ తన చేతుల్లోకి వస్తున్నట్లుంది. నవ్వుతోంది.

'ఒకసారి విజయనిచూస్తే' అనిపించింది. నిజానికి యింకొక్క నెల ఆగాలి. తన విజయ తను అనుకున్న పద్ధతిలో తన దగ్గరకు రావడానికి. కాని ఆగాలనిలేదు.

విజయ ఎక్కడుందో తెలియదు. వాళ్ల వూళ్లో అయినా వుంటుంది. లేదా లక్ష్మీపురంలో అయినా వుంటుంది. లక్ష్మీపురంలో అత్తయ్య యింటికి సామాన్యంగా వెడుతూనే వుంటుంది విజయ. మామయ్య కూడ తరచు వెడుతూనే వుంటాడు. ఇద్దర్లో ఒకరుగాని, ఇద్దరూగాని అక్కడ వుండొచ్చు.

మాధవరావు లక్ష్మీపురం బయలుదేరాడు. వీరయ్యకూడా వచ్చాడు. అక్కడ కొబ్బరికాయలు దించవచ్చునని బయలుదేరాడు వీరయ్య. అక్కడ పెన్ని వుంది. మామయ్యకూడ అక్కడే వున్నాడు. కాని విజయలేదు.

అంటే మామయ్యతోపాటు వాళ్ల వూరికి విజయని చూడటానికి వెళ్లాలి.

మామయ్యని అడుగుదామనుకొన్న విషయం అడగలేదు మాధవరావు. విజయ నిమ్మని ధైర్యంగా అడుగుతాడు. తన వ్రతం దాదాపు పూర్తయింది. కాని యిల్లా కాదు. విజయ సాన్నిధ్యంలోనే అడుగుదామనుకున్నాడు. మామయ్యకి కూడ మాధవరావు ప్రయత్నం తెలుసు. ఆయనంతట ఆ ప్రస్తావన ఆయన తీసుకురాలేదు. వూరుకి వెళ్లాక ఆ విషయం మాధవరావే ప్రస్తావిస్తాడని ఊరుకున్నాడు.

మాధవరావు లక్ష్మీపురంలో ఒక రోజు వున్నాడు. జగన్నాథంగారూ, సీతమ్మగారూ కనిపించారు. సీతమ్మగారు బాగా చిక్కిపోయింది. ఆయన కూడ బాగా నీరసంగా వున్నారు. కళ్లు లోతుకు పోయాయి. చిట్టచివరి ఆశ కళ్లముందునుంచి కదలిపోతుంటే మనిషి ఎలా వుంటాడో అలాగే వున్నాడు. ఆ యిల్లు ఒకటి రెండు రోజులలో ఖాళీ చేయాలట. ఆ యిల్లు వాళ్లకెలాంటిదో

వీరయ్యకి అక్కడ పని పూర్తయింది. తన యింట్లో కట్టెలు కొట్టడంలాంటి పనులున్నాయని, తనతో తీసుకు వస్తానని అన్నాడు మాధవరావు మామయ్య. ముగ్గురు లక్ష్మీపురంనుంచి బయలుదేరారు.

చెరువుగట్టునవున్న బస్సు స్టాండుకి బయలుదేరారు. బస్సు వచ్చివుంది. ముగ్గురూ ఎక్కారు. ఏమీ మాట్లాడకపోతే తోచటంలేదు మాధవరావుకి!

'మామయ్యా వీరయ్యని చూసినప్పుడల్లా ఎక్కడో చూసినట్లనిపిస్తుందని' అనిపించేది. తర్వాత గుర్తుకు వచ్చింది. వేణుగోపాలం చెరువులో స్నానం చేస్తుంటే చెరువుగట్టున కొబ్బరికాయలు దించాడు!

మామయ్య నవ్వు వచ్చాడు 'అవునూ ...గోపాలం చచ్చిపోయాట్ట తెలుసా'

'ఆ, తెలుసు' అన్నాడు మాధవరావు విషాదంగా.

'పాపం మంచివాడు. నీకు దెబ్బతగిలినప్పుడు రక్తం కూడ యిచ్చాడు.'

మాధవరావు చటుక్కున తలెత్తి చూశాడు. 'నిజమా!' అన్నాడు.

'అవును. అంబులెన్సులో మీ ఊరు తీసుకెళ్లినప్పుడు తనూ వచ్చాడు. అతని రక్తం నీకు ఎక్కించారు.'

మాధవరావు ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండిపోయాడు. ఏదో నిశ్చయం అతని ముఖంలోకి కనిపించింది.

ఉన్నట్లుండి 'ఇప్పుడే వస్తా' అంటూ దిగి వెళ్లిపోయాడు.

'ఎక్కడికీ బస్సు కదలబోతుంటే?'

'ఫరవాలేదు. వెంటనే వచ్చేస్తా. వీరయ్యా నువ్వు కూడా రా' అంటూ కిందికి దిగాడు.

అయిదు నిమిషాలయింది. కండక్టరు వచ్చి టిక్కెట్లు ఇచ్చాడు. డ్రైవరు కూడ వచ్చి కూర్చున్నాడు.

వీరయ్య ఒక్కడే తిరిగి వచ్చాడు 'ఈ చీటి ఇమ్మన్నారు బాబూ' అన్నాడు...

'క్షమించండి. నేను మీతో రావడం లేదు. జగన్నాథంగారి ఇల్లు జానకిరామయ్య గారి దగ్గర్నించి కొనదలచుకున్నాను. జగన్నాథంగారూ, సీతమ్మగారూ కోరుకొన్నది జరగాలి. ఆ బాధ్యత నా కుంది—

మాధవరావు.

అని వుంది. చెరువు గట్టు బస్సు స్టాండులో బస్సు కదిలింది.





భక్తి యోగం

ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

జీవాత్మ పరమాత్మను చేరుటకు వెలుగుబాటలను తీర్చిదిద్దే మార్గాలు అనేకాలున్నవి. వాటిలో హిందూ సంప్రదాయాన్ని అనుసరించిన మార్గాలు మూడు ప్రధానమైనవి. అవే జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం అనేవి. వీటిలో జ్ఞానయోగం ఉత్తమ బుద్ధులకూ, కర్మయోగం మధ్యమ బుద్ధులకూ, భక్తియోగం మందబుద్ధులకూ ఉద్దేశించబడ్డాయి.

కొందరి బుద్ధి కేవలం కఠిన విషయాలను గ్రహించడంలోనే ఆసక్తి చూపుతుంది. కొందరి బుద్ధి సులభ విషయాలను తెలుసుకొనుటలో ఇష్టపడుతుంది. కొందరి బుద్ధి మధ్యరకమైనది. వారి వారి బుద్ధులకు అనుకూలంగానే యీ పద్ధతులు ఏర్పడ్డాయి.

వేదములు దురవగాహాలు, వాటిని అర్థం చేసుకుని, అందలి ధర్మ సూక్ష్మాలను గ్రహించడం నిశిత బుద్ధులకు మాత్రమే సాధ్యమవుతుంది. అందువల్ల అల్ప బుద్ధులకుకూడా బోధపడే రీతిని అందలి ధర్మాలను కథలతో జోడించి వేద వ్యాస మహర్షి ఇతిహాస పురాణాలలో వివరించారు. అవి మందబుద్ధులకు ధర్మావగతికి ఎక్కువ సహకరిస్తాయి.


పూర్వ మీమాంసా ప్రతిపాదితమైన కర్మ మార్గాన్ని కుమారిల భట్టు మొదలైన మీమాంసకులు ప్రచారానికి తెచ్చారు. ఆ కర్మలు కూడా కొందరికి విధించబడి, కొందరికి నిషేధించబడినవి. జ్ఞాన మార్గాన్ని అనుసరించలేక, కర్మలు నిషేధించబడినవారికి తరుణోపాయం ఏది? అట్టివారికోసమే భక్తియోగం ఎంతో ఉపకరిస్తుంది. అంతేకాదు. కర్మల నాచరించే పద్ధతి ఎన్నో కట్టుదిట్టాలతో కూడినది. కర్మకాండ ఆచరించడం అధికారం వున్న వారిలోకూడా చాలామందికి సాధ్యపడదు. అట్టివారికిన్ని భక్తియోగమే శరణ్యం అవుతుంది.


ఒక కుటుంబంలోనే ఉన్న వాళ్లలో అందరూ సమాన బుద్ధి కలవాళ్లు ఉండరు. సమానగుణాలున్నూ ఉండకపోవచ్చు. అయినా తలిదండ్రులు అందరినీ సమానంగానే చూస్తారు. ఆహార వ్యవహారాదుల్లో భేదం వుండదు. ఆ విధంగానే మోక్షకాములైన వారికందరికీ మోక్షాన్నిపొందే అధికారం వున్నది. పక్షపాత మనేదిలేకుండా భగవంతు డందరికీ ముక్తిని అనుగ్రహిస్తాడు.

అయితే యీ మార్గాల వ్యత్యాసం దేనికి?

మార్గాలు వేర్వేరుగా ఉన్నప్పుడు వాటిలో కొన్ని కష్టమైనవి వుండడమూ, కొన్ని సులభమైనవి ఉండడమూ సహజం.

ఒక సంస్థలో పనిచేసే పనివాళ్లకు యజమానుడు వారి వారి శక్తి ననుసరించే పనిని ఏర్పరుస్తాడు, కష్టపడి పని చెయ్యగలిగిన వాళ్లకే అలాంటి పనిని యిస్తాడు. పని తెలియని వాళ్లకు ఆ పనిని అప్పగిస్తే ధ్వంసంకాక మరే మవుతుంది? అట్టి వాళ్లకు సులభమైన పనే అప్పగిస్తాడు. జీతంలో మాత్రం ఏమీ తేడా వుండదు. ప్రతిఫలంలో ఏ మాత్రమూ భేదం లేనందువల్ల జ్ఞాన, కర్మ, భక్తి మార్గాలు మూడూ సమానాలే అని తెలుసుకోవాలి. మూడు యోగాల్లోనూ భక్తియోగం సులభాతి సులభమని తెలుసుకుని, ఆ మార్గాన్ని ముక్తికాములు అనుసరించడం శ్రేయం. ●





జ రి గి న క థ

సావిత్రమ్మ ఒక మధ్యతరగతి ఇల్లాలు. ఆమె భర్త రామనరసయ్య. పెద్దకొడుకు గోపీ వారాలు చేసుకుని పై ఊళ్లో చదువుకుంటూ ఉంటాడు. విధిలేక చిన్నవాడు మురళిని నరసింహానికి పెంపకం ఇస్తుంది. గోపీ తెలివి తేటల్ని గ్రహించి అతనికి తన ఇంటిలోనే వసతి ఏర్పాటు చేస్తాడు ప్రొఫెసరు. అతని కుమార్తె అనిత. అనిత ప్రవర్తన గోపీకి నచ్చదు. గోపీ ఆచోటు విడిచి పెట్టేస్తాడు విదేశాలకి వెళ్తాడు. అతనిమీద పడిన నింద నిజంకాదని చెప్తూ అనిత రాసిన ఉత్తరం గోపీకి మనశ్శాంతి నిస్తుంది. విమల ఒప్పుకోని సంబంధానికి కమల ఒప్పుకున్నది. సావిత్రమ్మ శాంతమ్మగారి కుటుంబానికి తను చేయగలిగిన సేవచేస్తుంది.

8

పోస్టుమన్ ఉత్తరము ఇచ్చి వెళ్లాడు.

'ఎక్కడి నుంచి?' సావిత్రమ్మ ఆందోళనతో ఆత్రముతో కవరు చింపింది.

'అమ్మకు అనేక నమస్కారములు చేసి శంకరం వ్రాయునది —

వీడి దగ్గర నుంచయినా పదిరోజుల కొకసారి ఉత్తరం వస్తుందనుకున్నది సావిత్రమ్మ.

'మురళి ఎలా ఉన్నాడు? బాగా చదువుకున్నాడా? విమల సంగతి ఏమయినా తెలిసిందా?'

ఆ ఉత్తరం పదిసార్లు చదువుకున్నది సావిత్రమ్మ.

శంకరం పంపించిన డబ్బుతో రామనరసయ్య ఉన్నప్పుడు చేసిన చిన్న చిన్న బాకీలన్నీ తీరుస్తూ వచ్చింది. అప్పు మాట ఏభయి రూపాయలలోకి వచ్చింది.

ఆ రోజున ఎందుకో మురళి పదే పదే జ్ఞాపకం వస్తున్నాడు. చూసి వారం పది రోజులయింది. పిల్లవాడి మీద ప్రాణం పీకుతున్నది, కాని నరసింహం ఇంటికి వెళ్లాలంటే ఎంతో ముఖమాటంగా ఉంది.

సాయంకాలము ఐదుగంటలకు వకీలు సాంబయ్యగారింటికి వెళ్లేముందు మురళిని చూడటానికి ఆ యింట్లో అడుగు పెట్టింది. ఎదురుగా నౌకరు వచ్చాడు.

'సుబ్బయ్యా మురళి బాగున్నాడా? ఏం చేస్తున్నాడు?'

'అబ్బాయిగారికి జ్వరమండి. వారం రోజులయింది.'

'ఆఁ?' గతుక్కుమన్నది సావిత్రమ్మ. 'అదేమిటోయ్? నేనింత దగ్గరగా ఉంటే వచ్చి చెప్పనన్నా లేదు?' లోపల అడుగు పెడుతూ 'ఎక్కడున్నాడో చూపించు' అన్నది. ఆదుర్దాతో — ఆయాసపడుతూ గడపలో నిలబడ్డది.

సుబ్బయ్య మేడమీదికి తీసుకు వెళ్లాడు సావిత్రమ్మను. విశాలమయిన హాలు దాటుకుంటూ గదిలోకి దారి చూపించాడు. గదిలో మంచమ్మీద మురళి పడుకుని ఉన్నాడు. నరసింహం మంచం దగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

సావిత్రమ్మను చూడగానే దిగ్గున లేచి బయటికి వస్తూ ఆమెను కూడా రమ్మని చేతి సైగ చేశాడు.

'నేనేం పాపం చేశాను? బిడ్డకు ఇంత జబ్బుగా ఉంటే నాకెందుకు చెప్పలేదు?' అన్నది వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

'మొన్నటి వరకూ మామూలు జ్వరమే ననుకున్నాను. నిన్ననే డాక్టరుగారు వచ్చి టైఫాయిడ్ జ్వరమన్నారు.'

'టైఫాయిడే? అమ్మో. అయితే బిడ్డను చాలా జాగ్రతగా చూసుకోవాలి.'

'ఆఁ జాగ్రత్తగానే చూస్తున్నాను. అబ్బాయి మంచం దగ్గర రాత్రీ పగలూ నేనే ఉంటున్నాను. కోర్టుకయినా వెళ్లటం లేదు. భోజనం కూడా మంచం దగ్గరే చేస్తున్నాను.'

కళ్లు తుడుచుకుని చూస్తూ నిలబడి పోయింది సావిత్రమ్మ. అబ్బాయికి తెరిపిచ్చే వరకూ తనను అక్కడ ఉండమంటాడని ఆశించింది. ఆయన ఆ ప్రశంస ఎత్తక పోయేసరికి ఆమెకు దుఃఖము ముంచుకుంటూ వచ్చింది.

'మురళిని కనిపెట్టుకుని ఇక్కడే ఉంటాను' అతికష్టం మీద అనగలిగింది తలవంచుకుని.

'ఎందుకండీ నేను ఉన్నానుగా'

తన కడుపులోని బాధ ఆయనకి తెలియ చెప్పాలని సావిత్రమ్మ ప్రయత్నించింది.

'అబ్బాయి మిమ్మల్నిందరినీ పూర్తిగా మరచిపోయాడు. మీరు ఈ సమయంలో మళ్లీ సన్నిహితమయి రాత్రీ పగలూ ఇక్కడే ఉంటే ఇంక మిమ్మల్ని వదలి పెట్టడు. అలా నిద్రపోతున్నప్పుడు ఒకసారి వచ్చి తొంగి చూసి పోతూ ఉండండి'

'అయ్యో. నేను కన్నతల్లిని. జబ్బుగా ఉన్న పిల్లవాడిని వదలి ఉండలేను' నిలబడే కళ్లు ఒత్తుకున్నది.

నరసింహం మాట్లాడలేదు. అర గంటకు పైగా నిలబడి చూసింది సావిత్రమ్మ. నిట్టూర్పు విడుస్తూ మెల్లగా మెట్ల దగ్గరికి వచ్చింది.

'నా బిడ్డ, నవమాసాలు మోసి కన్న బిడ్డ. కడసారి వాడు. వాడిమీద మమతలన్నీ బిగబట్టుకుని మీ చేతిలో పెట్టాను. కాని మమతలను మాపుకోలేక పోతు

న్నాను. వాడిని చూడని రాత్రులు నేను ఎలా గడుపుతున్నానో ఆదైవానికే తెలుసు. జబ్బుగా ఉన్న పిల్లవాడిని వదలి ఇంటికి ఎట్లా వెళ్ళాను? మురళి లేని ఇల్లు అంధకారమయంగా ఉన్నది. ఆ కటిక చీకట్లోకి ఎలా వెళ్ళాను? పంతులుగారూ. నాకు అన్నము వద్దు—నీళ్ళు వద్దు. నా బాబు దగ్గర ఈ పదిరోజులూ పడి ఉండనీయండి.' చప్పున వంగి ఆయన పాదాలను కళ్ళకు అద్దుకున్నది.

'మీ బాధంతా నాకు తెలుసు. నాకర్థ మయింది. నేను చెప్పి పంపుతానన్నాను కదా.'

పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ సావిత్రమ్మ కిందికి దిగింది.

సాంబయ్యగారింట్లో పది గంటలకల్లా పిల్లలకూ పెద్దలకూ వడ్డన అయి పోయింది. వంటయిల్లు కడిగి తడిచేతులు తుడుచుకుంటూ బయిటికి వచ్చింది సావిత్రమ్మ. తడబడుతున్న కాళ్ళతో నరసింహం పంతులు వాకిట్లోకి వచ్చింది.

సుబ్బయ్య కాళ్ళకు చెప్పులు వేసుకుని పొడుగాటి కర్రపట్టుకుని ఆమె కెదురుగా వచ్చాడు.

'సుబ్బయ్యా అబ్బాయి ఎట్లా ఉన్నాడు?'

'పంతులుగారు మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు.'

సావిత్రమ్మ కంగారుపడి పోయింది. కాళ్ళు ఒణికాయి. ఉరుకులు పరుగులతో పైకి చేరుకున్నది. గుమ్మం దగ్గర ఎదురయ్యాడు నరసింహం.

'బాబుగారూ. మురళి...మురళి...' మరి మాట్లాడలేక పోయింది.

'ఏం లేదమ్మా. కొద్దిగా సంధిమాటలు మాట్లాడుతున్నాడు. కంగారేం లేదు. వచ్చి అలా దగ్గరగా కూర్చోండి.'

ఉబికి ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ 'నాయనా మురళీ. నేను వచ్చాను. చూడు. నావైపు చూడు' అతడి వంటి మీద చెయ్యివేసి రాస్తూ కూర్చుంది సావిత్రమ్మ.

'సిపాయి బొమ్మలు — బ్రిడ్జి కట్టే సామానులు — మేడలు కట్టే బ్లాక్సు కావాలి. నావన్నీ పాతవి. రమేష్‌కు ఉన్నటు వంటి సైకిలు కావాలి.'

'మురళీ ఇటు చూడు. నావైపు ఒక్క సారి చూడు. నీవు అడిగిన బొమ్మలు బ్లాక్సు అన్నీ తెప్పించాను చూడు.' మంచం మీదికి వొంగాడు నరసింహం.

'నాయనా మరళీ. అమ్మను నీకోసం వచ్చాను' రెండు చేతులతో బుగ్గలు నిమి రింది.

మురళి ఎవరి మాటలూ వినిపించు కునే ధోరణిలో లేడు, ఒకసారి కళ్ళు తెరుస్తున్నాడు. ఒకసారి మూస్తున్నాడు. మంచమీమ్మద దొర్లుతున్నాడు. సావిత్రమ్మ కళ్ళు తుడుచుకుంటూ మంచం దగ్గర అలాగే కూర్చున్నది.

తెల్లవారుఝామున మూడు గంటలకు



జీవితవలయాలు

డాక్టరు యిచ్చిన మందు పని చేయటం మొదలు పెట్టింది. మురళి సంధి మాటలు తగ్గిపోయాయి. ప్రశాంతంగా పడుకున్నాడు. పిల్లవాడి వీపు మీద చెయ్యివేసి, మంచం పట్టెకు తల ఆనించి కూర్చుంది సావిత్రమ్మ. అప్పుడు పడుకున్న మురళి మరునాడు మధ్యాహ్నము పన్నెండు గంటల వరకూ కళ్ళు తెరవలేదు. సావిత్రమ్మ కూడా కదలకుండా అలాగే కూర్చుంది.

'సావిత్రమ్మగారూ. లేచి ముఖం కడుక్కుని కాఫీ తాగండి' నరసింహం వచ్చి ప్రతిమిలాడాడు.

ఆమె కళ్ళు తెరచి మళ్ళీ వాల్చేసింది.

సాయంకాలము డాక్టరు వచ్చి మురళిని చూశాడు. 'ఇప్పుడు అబ్బాయికి దుర్లక్షణాలు ఏవీలేవు. ఇంక ఉండవు. నేను చెప్పిన ఆహారం జాగ్రత్తగా ఇస్తూ ఉండండి.'

ఆయన వెళ్ళిపోయిన తరువాత మురళికి పాలు తాగించి సావిత్రమ్మ గ్లాసెడు కాఫీ తాగింది. అలా పదిహేను రోజులపాటు నిద్రాహారాలు మాని మురళిని కనిపెట్టుకుని ఆ మంచం దగ్గర కూర్చున్నది.

ఒకటి రెండు పథ్యాలు వంటబట్టిన తరువాత మురళి మంచం మీదనే కూర్చుని కబుర్లు చెప్పటం మొదలుపెట్టాడు. వరెండాలో చిన్న కుంపటి పెట్టుకుని పునఃపాకము చేసిన అన్నంలో పొట్ల బీరకాయల కూరలు చేసి, అన్నం కలిపి నోట్లో పెట్టుతూ ఉండేది. మురళి ఎప్పటి మాదిరిగా మరాం చేస్తూ ఉండేవాడు. తల్లి ప్రతిమిలాడుతూ ఉండేది.

జ్వరం పూర్తిగా తగ్గిపోయినా బలం కొరకు ఇంజక్షనులూ టానిక్కులూ తీసుకోవాలని డాక్టరు వ్రాసి యిచ్చాడు. నెలరోజులకు మురళి ఎప్పటి మాదిరిగా ఆరోగ్యంగా పుష్టిగా తయారయ్యాడు.

ఉదయము ఐదుగంటలకే లేచి తలారస్నానం చేసి సావిత్రమ్మ నరసింహానికి ఎదురుగా వచ్చింది.

'ఇక నేను వెళ్ళి వస్తాను.'

'అప్పుడే వెళ్తారా? నేను ఇంత కాలమూ ఏమో అనుకున్నాను. డబ్బు పారవేస్తే ఎవరయినా వచ్చి చాకిరి చేస్తారన్న భ్రమలో ఉన్నాను. ప్రేమతో సేవచేస్తేనే గాని రోగులు త్వరలో కోలుకోరన్న సత్యాన్ని మొన్ననే గ్రహించాను. మొదట మీరు మురళి దగ్గర ఉంటానంటే అనవసరమనుకున్నాను. కాని తరువాత గ్రహించుకున్నాను, మురళిని మీరు కనిపెట్టుకుని ఉన్నట్టుగా ఎంత ఇచ్చినా ఏ నౌకరూ అలా ఉండడు.'

'దానికేమిటెండి. నేనయినా పరాయివాళ్ళకెవరికి చేశాను? నా కన్నబిడ్డకు నేను చేయటం కూడా ఘనమేనా?'

'అట్లా కాదమ్మా. మీ కన్నబిడ్డే కాని నా దగ్గర ఉండగా మా యింటికి వచ్చి సేవచేశారు' ఆమె చేతికి ఏభయి రూపాయలు పెట్టిన కవరు ఇవ్వబోయాడు.

'ఏమిటిది?' ఆమె తెల్లబోయింది.

'ఆఁ ఓ ఏభయి రూపాయలు దానిలో పెట్టాను. ఏ ఖర్చుకయినా ఉంటుంది. దగ్గర ఉంచండి.'

'వద్దు బాబూ వద్దు. నా బిడ్డకు నేను చేయటమేమిటి మీరు ప్రతిఫలము ఇవ్వటమేమిటి?' ఆమె గబగబా అడుగులు వేస్తూ 'బాబూ రోజుకొకసారి పిల్లవాడిని చూసి పోతూ ఉంటాను. ఏమీ అనుకోరు కదూ? నాకా ప్రతిఫలం చాలు' అన్నది వెనక్కు తిరిగి.

'ఎంతమాట. కన్నతల్లివచ్చి చూస్తానంటే నేను కాదనగలనా?'


ఆమె చరచర నడిచి వెళ్ళిపోయింది.

వారంరోజులు మురళి దిగులు దిగులుగా ఇంట్లోనే తిరిగాడు. తల్లివచ్చి వెళ్ళేటప్పుడు ఆమెను తన దగ్గరే ఉండమని మారాము చేసేనాడు. రాత్రిళ్ళు తన మంచం దగ్గరే పడుకొమ్మని గునిసేవాడు.

సావిత్రమ్మ నరసింహం వంతులు ముఖంచూసి తలవంచుకునేది. ఆయన ఏ మాత్రం అందుకు సుముఖంగాఉన్నా అక్కడ ఉండిపోవాలని ఆమె మనసు కొట్టుకులాడి పోయేది.

కాని నరసింహం మాట్లాడలేను ఆయనకు మురళినిగురించి పాతభయం మళ్ళీ పట్టుకుంది. తల్లీ పిల్లలు ఒకరి నొకరు విడిచి ఉండలేరు. ఎంత కష్టపడితేనో గాని మురళి తల్లి ప్రశంస ఎత్తకుండా నదగ్గర ఉండలేక పోయాడు. అపురూపమయిన బొమ్మలు పుస్తకాలు తినుబండారాలు ఎన్నో మురళికి పూటకొక కొత్తవస్తువు చొప్పున తెచ్చియిచ్చి మాలిమి చేసుకున్నాడు. ఈ జ్వరం రావటంతో అంతా మళ్ళీ మొదటికి వచ్చింది. మురళి చేస్తున్న మారాముకు నరసింహం ఎంత ఓపిక తెచ్చుకున్నా చికాకు కలుగుతోంది. ఏ క్షణానికి ఏం చేసి పెడతాడోనని మనసులో ఒక ప్రక్క దిగులు కాపరం చేస్తోంది.

ఆ ముగ్గురూ తిరిగి మామూలు



మనుష్యులవటానికి రెండునెలలు పట్టింది.

* * *

తెలతెల వారుతున్నది. అక్కడక్కడ ఉవిదలు ఇళ్లముందర ఊడ్చి కళాపి చల్లి ముగ్గులు వేస్తున్నారు. విమల చేతి సంచితో విసవిస నడుస్తున్నది. చేతి సంచిలో ఉన్నవి మారుబట్టలు. ఆసంచీ కొంతసేపు చేతో పట్టుకుని, కొంతసేపు బుజమ్మీద వేసుకుని నడక సాగించింది. ఆమె స్కూలు దగ్గరికి వచ్చేసరికి గేటుతలుపులు ఇంకా తెరవలేదు. సంచీ ఒడిలో పెట్టుకుని గేటుదగ్గరగా ఒకరాయిమీద కూర్చుంది.

'ఎవరమ్మా ఇక్కడ కూర్చున్నావు?'

అదిరిపడ్డది విమల. జవాబు చెప్పటానికి నాలుక తడి అరిపోయింది.

'ఎవరమ్మాయి వంటే మాట్లాడవేం?' గద్దించి అడిగాడు మారయ్య.

'ఈ స్కూల్లోచేరి చదువుకోవటానికి వచ్చాను.'

'ంతచీకట్లో వచ్చావు ?'

'చాలాదూరంనుంచి నడిచి వస్తున్నాను. రాత్రే చేరవలసింది కాని వేగంగా నడవలేక పోయాను. అక్కడ ఒకయింట్లో పడుకుని మెల్లగా నడిచివస్తున్నాను !'

మారయ్య గేటుతలుపు తెరిచాడు. విమలను లోపలికి తీసుకువెళ్లి ప్రిన్సిపల్ యింటిముందర వరెండాలో బల్లమీద కూర్చోబెట్టాడు.

ఏడుగంటల తరువాత తలుపులు తెరుచుకున్నాయి. ప్రిన్సిపల్ కృపావతమ్మ బయటికి వచ్చింది.

విమల లేచి నిలబడి నమస్కరించింది.

'నీవు ఎప్పుడో ఇక్కడికి వస్తావనే అనుకున్నాను. రాత్రే బయలుదేరావా ఇంటి నుంచి ?'

'తెల్లవారు ఝామున బయలుదేరాను. అప్పుడు మీతో చెప్పినట్లుగా మీస్కూల్లో చదువుకోవాలని వచ్చాను.'

'చాలా సంతోషం. తొమ్మిదిగంటలు కాగానే ఆఫీసు తెరుస్తారు. చేరిపోదువు గాని.'

ప్రిన్సిపల్‌కు దగ్గరగావచ్చి 'ఊరికే చేరటమేకాదు — ఇక్కడే మీ పిల్లలతో కలిసిపోయి ఉందామని వచ్చాను.' అన్నది చేతులు నులుపుకుంటూ.

'ఆఁ ? ఇక్కడే ఉండాలని వచ్చావా ? అయితే మా మతం పుచ్చుకుంటావా?' ఆశ్చర్యంతో ప్రశ్నించింది కృపావతమ్మ.

'పిల్లేదంటుందేమో ? ఇంతదూరం ఆశపడి వచ్చాను' ఉస్సురంటూ నిప్పుహతో ధైర్యంతో 'అవునమ్మా అవును. నన్ను ఇక్కడ చేర్చుకుని చదువు వచ్చేటట్లు చెయ్యండి. నేను ఇంక ఇంటికి వెళ్లను. వెళ్లితే నన్ను ఏ కుంటివాడికయినా యిచ్చి పెళ్లి చేస్తారు' సంచీ క్రిందపడేసి కృపావతమ్మ కాళ్లమీద పడ్డది.

'ఏడవకు బిడ్డా ఏడవకు. నిన్ను మా మతంలో చేర్చుకుని నీకు చదువు చెప్పిస్తాము. చదువుకుని ఉద్యోగం చేసుకుని

జీవితవలయాలు

ప్రబతుకుదువుగాని' విమలను లేవదీసి ఊరడించింది కృపావతమ్మ.

ఒక ఆదివారంనాడు విమల తలంటిపోసుకుని కృపావతమ్మ తెప్పించిన కొత్త బట్టలు కట్టుకుని ఆమె వెంట చర్చికి వెళ్ళింది. అక్కడ ఫాదర్ ఆమెకు మత మిచ్చి ఆ మత గ్రంథంలోని కొన్ని ముఖ్య భాగాలు చదివి వినిపించాడు. కొన్ని భాగాలు తను అంటూ ఆమెచేత అనిపించాడు. విమలకు నామకరణం జరిగింది. విమల ఇప్పుడు విమలకాదు—మార్గరెట్.

మార్గరెట్‌ను కృపావతమ్మ పరిక్షచేసి ఎనిమిదవ క్లాసులో చేర్చుకున్నది. ఆమెకు తెలియని పాఠాలు చెప్పటానికి పై తరగతి పిల్లలను నియమించింది. రాత్రిళ్ళు పాఠాలు చెప్పించుకుని, తెల్లవారుజామున లేచి చదువుకుంటున్నది. ఉదయము ఆరు గంటలకు బైటికివచ్చి తనకు నియమించిన డ్యూటీచేసి స్కూలుకు హాజరవుతున్నది.

పిల్లలందరూ ఆడుకునే సమయంలో మార్గరెట్‌కు ఆడుకోవాలనిపించేదికాదు. ఒంటరిగా ఏ చెట్టుక్రిందనో కూర్చుని పాఠాలు వల్లించేదీ. మార్గరెట్‌కు లెక్కలు ఇంగ్లీషు చాలా కష్టంగా ఉన్నాయి. నిద్రాహారాలు విసర్జించి ఆమె వాటిని సాధన చెయ్యనారంభించింది. ఆ సంవత్సరం పరిక్షలో కృతకృత్యురాలవుతుందన్న నమ్మకం ఆమెకు కలుగలేదు. కాని పరిక్షలో నెగ్గింది.

'మార్గరెట్' పిలిచింది కృపావతమ్మ.

భయపడుతూవెళ్ళి ఎదురుగా నిలబడ్డది మార్గరెట్.

'కిచెన్‌లో పనిఅంతా చూసుకునే శాంతమణి నర్సింగ్‌కోర్సుకు వెళ్ళిపోయింది. ఆమె డ్యూటీ నీవు చెయ్యాలి. నీవు బుద్ధిమంతు రాలవనీ, చెప్పినపని తృప్తికరంగా చెయ్యగలవనీ నమ్మి నిన్ను ఆ పనికి నియమిస్తున్నాను' అని తనపనిలో మునిగిపోయింది.

మార్గరెట్‌కు ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. శాంతమణిలా తనుకూడా ఈ మెట్రిక్ పరీక్ష కాగానే ఆ కోర్సు చదవాలి. ఏన్నేళ్ళయినా సరే — ఎంత కష్టమైనా సరే—సాధించాలి.

రాత్రి తీరికగా పడకచేరగానే ఆమెకు నర్సింగ్ కోర్సును గురించిన ఆలోచనలు తిరిగి ముసురుకున్నాయి. ఆమె మనసు ఆ స్కూలు బిల్డింగు బోర్డింగు దాటిపోయింది. తెల్లటి గంజిబట్టలు ధరించి హాస్పిటల్లో డాక్టర్లవెంట తిరుగుతూ రోగులకు మందులిస్తూ సేవచేస్తున్నట్టుగా ఆ రాత్రి కలలు కన్నది.

తెల్లవారు ఝామున ఐదుగంటలకే వార్డెను మార్గరెట్‌ను పిలుచుకు రమ్మని ఒక విద్యార్థినిని పంపింది. మార్గరెట్ ఉలిక్కిపడి లేచింది.

* * *

మార్గరెట్ బోర్డింగుకు వచ్చిన తరువాత పప్పు అన్నంతప్ప కూరలుగాని పులుసుగాని తినటం మానివేసింది. పంక్తికి చివరగాని మొదటగాని కూర్చుని ఇటుఅటు చూడకుండా తింటున్నది. ఒక్కొక్కనాడు మసాలా వాసనలకు కడుపులో తిప్పి వమనమయేటంత పని జరుగుతున్నది. ఇంతవరకూ భోజనశాలలో అంటీ అంటనట్టు తిరుగుతూ కాలము గడిపింది. కాని ఇప్పుడు అట్లా కుదరదు. కిచెన్‌లో పని అంటే అక్కడ వండుతున్న పదార్థాలను చూస్తూ ఉండాలి. దగ్గరఉండి వండించాలి. వండిన పదార్థాలు అందరికీ అందేటట్లుచూడాలి.

మార్గరెట్ వార్డెను ఎదుట నిలబడ్డది. ఆమెను చూడగానే వార్డెను మదురు చిట్లించి 'చూడమ్మా నీకు కిచెన్‌లో డ్యూటీవేశారు. మారయ్యకు వంటలో సహాయం చెయ్యాలి. మీరు ఐదుగురు కలిసి వడ్డన చెయ్యాలి. కిచెన్‌లో ఏవిధమయిన లోపము జరగకూడదు' తాళం చెవులగుత్తి ఆడించుకుంటూ వెళ్ళిపోయింది.

మార్గరెట్ ప్రాణువులా నిలబడిపోయింది. ప్రతి ఆదివారం అందరితోపాటు చర్చికి వెళ్ళటము ప్రార్థనలు చెయ్యటము, ఏసుప్రభువు కథలూ మహిమలూ వినటము అక్కడికి వచ్చినతరువాత అలవాటు చేసుకున్నది. ఆ ఏసుప్రభువును నమ్మికుని ఆ మతములో చేరినందుకే తనపోషణ చదువు సాగుతున్నది. ఆ ఏసుప్రభువును తప్ప మరొకరిని మనసులో నయినా ధ్యానించకూడదేమో? అది పాపమేమో? చిన్నవాడు తల్లిచెప్పిన భారత రామాయణగాథలు

మరచిపోవటమెట్లా?' ఆ కృష్ణ శతకం, దాశరథి శతకం చదువుతుంటే అదొకవిధమైన పారవశ్యంతో మనసంతా పొంగిపోతుంది. ఆ శతకాలు ఇంకా నాలుకమీద ఆడుతూనే ఉన్నాయి. మరచిపోవటానికి సాధ్యం కావటంలేదు. ఇది తప్పేమో? దైవాన్ని మోసగించటమేమో? ఎంత ప్రయత్నించినా మనసులోనుంచి చిన్ననాటి ముద్రలు చెరిపివెయ్యలేక పోతున్నది. ఏసు ప్రభువును మనసులో ప్రతిష్ఠించుకొనటానికి తీరిక దొరికినప్పుడల్లా ఆ కథలు చదవడం ప్రారంభించింది. పాటలు, పద్యాలు, కథలు అన్నీ నోటికి వచ్చాయి. కాని—అవి చదువుతున్నంతసేపూ బాగానే ఉంటున్నాయి. రాత్రిళ్ళు ఏసు ప్రభువును తలుచుకుంటూ—తన యిప్పటిస్థితికి ఆ ప్రభువే కారణమని తెలిపే పాట పాడుకుంటూ పడుకుంటుంది. కాని—బాల్యంలో తల్లి చెప్పిన కృష్ణశతకంలో 'నీవే తల్లివి తండ్రివి... నీవే నా తోడునీడ...నిజముగ కృష్ణా' ఈ పద్యము దానంతట అదే నాలుకమీద అప్రయత్నంగా ఆడుతుంది. దీనిని తప్పించుకోవటానికి ఎంతో ప్రయత్నంచేసి విఫలురాలైంది.

ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనాల ముందర ఒక టీచరు వచ్చి ఏసుప్రభువు మీద రెండు పాటలు—నాలుగు వాక్యాలు పిల్లలచేత అనిపించి వెళ్ళుతుంది. వీటన్నిటికీ సులభంగా అలవాటు పడిపోయింది మార్గరెట్.

కాని కిచెన్‌లో పని తలుచుకోగానే ఆమెకు కడుపులో తిప్పటం మొదలు పెట్టింది. అప్పటికప్పుడు వాంతి అయేటంత పని జరిగింది:

మార్గరెట్ మెల్లగా అక్కడి నుంచి కదిలి కిచెన్‌కు దారితీసింది.

'ఏం అలా తలవంచుకుని వస్తున్నావు?' మేరీ అడిగింది.

'ఏంలేదు. ఏదో పాఠాన్నిగురించి ఆలోచిస్తున్నాను.'

'కాదులే. నీకు వార్డెను ప్రిన్సిపాల్‌చేత కిచెన్‌లో డ్యూటీ వేయించింది. అందుకని కదూ?'

'అందుకు కానేకాదు. పాఠమే కొంచెము కష్టంగావుంటే బాగా వల్లించాను. అదే అనుకుంటూ వస్తున్నాను.'

'పోనీలే, అలాగే అనుకుందాము. రా పోదాము. నాకూ అదే డ్యూటీ పడ్డది,'

చెయ్యి పట్టుకుని తీసుకువెళ్ళింది మేరీ.

'ఈ డ్యూటీవల్ల ప్రత్యేకంగా నాకేం కష్టంలేదు. ఎవరయినా ఏదో ఒకరూపంలో డ్యూటీ చెయ్యాల్సిందేకదా? అంతే నా మేరీ?' అన్నది మార్గరెట్.

'అవును. నీ వొక్కదానివే ఎంతో బాధ పడిపోతున్నావని అనుకోకు మార్గరెట్. అందరికీ ఏవేవో బాధలు ఉండనే వుంటాయి. ఆ బాధలూ, అనుభవాలూ వింటే మూర్ఛపోతావు' భుజమ్మీద చెయ్యి వేసి భోజనశాలలోకి దారితీసింది మేరీ.

ఎనభయిమంది బోర్డర్లకు, ఇద్దరు నౌకర్లకు వంట చెయ్యటంకోసం రెండు డేకిసాలు పొయ్యి మీదికి ఎక్కించాడు మారయ్య. ఒకపక్క ఇద్దరు పిల్లలు గోరు చిక్కుడుకాయ పీచుతీసి ముక్కలు చేస్తున్నారు. మార్గరెట్, మేరీ గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళి వాళ్ళ దగ్గర కూర్చున్నారు.

జీవితవలయాలు

'ఆ కరుణమ్మ ఏదీ? ఆమెకూడా వస్తే తొందరగా అవుతుంది. పప్పు ఉడికిపోతున్నది' కేకలుపెట్టాడు మారయ్య.

పరుగెత్తుకుంటూ రానేవచ్చింది కరుణ.

'ఇంత ఆలస్యమయితే ఎట్లాగమ్మా? మీకే వంట ఆలస్యమవుతుంది. అందులో ఈ గోరుచిక్కుడుకాయ పొక అని కొంటారుగాని అది తుంచటానికే రెండు గంటలు పడుతుంది' విసుక్కున్నాడు మారయ్య.

'టీచరుగది ఊడ్చి, ఆమె మంచమూ కుర్చీ దులిపి, కూజాలో నీళ్ళుపట్టి వస్తున్నాను మారయ్యా. ఒక అయిదు నిమిషాలు ఆలస్యమయింది అంతేకదూ?'

'అయిదు నిమిషాలా అరగంటా? క్లాసులో పంతులమ్మలకంటె కిచెన్‌లో నన్ను ఎక్కువగా తిప్పలు పెడుతున్నారు.'

మారయ్య ముఖం చూసి పిల్లలంతా నవ్వారు.

సాయంకాలం స్కూలు అయిపోగానే ట్యూబు తీసుకుని చెట్లకు నీళ్ళు పోస్తున్నది మేరీ.

ఒక్కొక్క చెట్టుమొదట్లోవున్న చెత్త తీసి ఒక తట్టలో వడేస్తోంది మార్గరెట్. వెనకనుంచి ఇనుపచువ్వ తీసుకుని ఒక్కొక్క చెట్టుమొదట గొప్పు తవ్వుతోంది కరుణ.

'మనము ముగ్గురం ఈ క్లాసులో కలుసుకున్నాము. ఇలాగే మెట్రిక్ ప్యాసయే వరకూ మన గ్రూపు ఉండాలి.' ట్యూబుతో చెట్ల ఆకులన్నీ తడుపుతూ వాళ్ళ మీద కూడా నీళ్ళుచల్లి చిలిపిగా నవ్వింది మేరీ.

కరుణ గలగల నవ్వింది. కాని మార్గరెట్ నవ్వలేకపోయింది. కరుణ, మేరీ మార్గరెట్ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశారు.

'ఏం? అలా ఉన్నావు? ముఖం వాడిపోయివున్నది!' కరుణ కుతూహలంతో ప్రశ్నించింది. ట్యూబు చెట్టుమీద వడేసి మేరీ కూడా దగరగా వచ్చింది.

'ఏం ఎలా ఉన్నాను? మామూలుగా లేనా?'

'లేవు. చాలా నీరసంగా ఉన్నావు. ఏం? అన్నం సరిగా తినలేదా? అందరూ మార్గరెట్‌కు దగ్గరగా గడ్డిమీద కూర్చున్నారు.

'తిన్నాను. మీరు సరిగా చూడలేదేమో!' తప్పించుకోవాలని చూసింది మార్గరెట్.

చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చింది కరుణకు.

'ఇవాళ భోజనాలసమయంలో ఆ కమలా, సునందా ఒకరినొకరు తోసుకుంటూ ముందుకు జరిగారు. ఆ జరగటంలో గ్లాసుల్లో నీళ్ళు పళ్ళెంలో పడ్డాయి.'

'అంతేనా? ఒక పళ్ళెంలోని పదార్థాలు మరొక పళ్ళెంలో పడ్డాయా?' ఆదుర్దాపడ్డది మేరీ.

ఆరుగంటలు దాటింది. బోర్డింగులో గంట గణగణ మ్రోగింది. కరుణ, మేరీ గబగబా చేతులు కడుక్కుని లేచారు. మార్గరెట్ వాళ్ళను అనుసరించింది.

ఈ ముగ్గురూ వరండా మెట్లు ఎక్కుతుండగా వార్డెను తాళపుచెవుల గుత్తిని వేలిమీద తిప్పుకుంటూ ఎదురుగా వచ్చింది.

(ఇంకా ఉంది)

డాక్టర్ కబుర్లు

చర్మం – భావావేశం

చర్మం భావావేశాన్ని తెలుపుతుంది. ఎత్తుగా ఉండేవారు ఆవేశంతో ఇంకా ఎర్రబడవచ్చు. కొందరు పాలిపోవచ్చు. మరి కొందరు చెమటలు కక్కవచ్చు!




అందుకనే చర్మరోగాలు ఉండే వారిని చాలామందికి పయిపూతల మందులకన్నా మానసిక చికిత్స అవసరం. ఊరికే చర్మం రంగు మారేవారికి, చెమటలు పట్టే వారికి చర్మరోగాలు త్వరగా రావచ్చు. చర్మరోగాలంటే చిన్న రకంవే! దురద పగయిరా....దురదలతో గోకిగోకి పుళ్ళుపడతాయి. ఇవి చూడటానికి అసహ్యంగా ఉండవచ్చు.

మానసికబాధ, దిగులు—కొన్నిప్పుడు సంతోష కరమయిన భావావేశంకూడా!— చర్మం మీద దద్దులు వచ్చేట్లు చెయ్యగలవు.

అన్నిరకాలూ మానసిక కారణాలవల్ల వచ్చినవేకావు; 'మామూలు' రకం చర్మరోగాలు కూడా ఉంటాయి. వాటికి మామూలు మందులు అవసరం!

— హెచ్. ఎల్. హార్న్‌సోవ్

(ఆపేరయిటు)



పసివాని తొలి ఏడుసంవత్సరాలే అతడెటువంటి వ్యక్తిగా తయారయేదీ నిర్ణయిస్తాయి అంటారు. అప్పుడు ఒకటి మటుకు నిజం. అందరిలోకీ, అతగాడికి అతి సన్నిహితంగా ఉండేది తల్లే. ఆమే అతని జీవన విధానం రూపొందించడంలో ప్రముఖంగా ప్రాముఖ్యం వహిస్తుందన్న మాట. అతని ఊహాలు ఉద్దేశాలు, దృక్పథం అన్నిటికీ ఈ తల్లే రంగు నిస్తుందనడం అబద్ధం కాదన్నమాట. ఎంత బాధ్యత? ఒక ప్రాణి జీవనవిధానం మన పెంపకంమీద ఆధారపడి ఉందన్న గురుతర విషయాన్ని కూర్చుని ఆలోచిస్తే భయం వేస్తుంది. రూపురంగు ఆకృతిలేని వో మనసుకి ఆకారం ఇవ్వాలి. దానిలో ఊహాలు ఉద్దేశ్యాలు పొదగాలి. వ్యక్తిగా ప్రమాణాలకి నిలబడేలా పెంచాలి. పెద్ద చేయాలి అన్న చిన్న చిన్న నిజాలు సుదీర్ఘంగా ఆలోచిస్తే వాటి బాధ్యత కృంగతీసేస్తుంది—ఏ తల్లీ ఉత్సాహంగా పిల్లని కనదు! అందుకే అదృష్టంకొద్దీ ఇదియింత భారమైనదని ఏ తల్లీ కూర్చుని ఆలోచించదు. హాయిగా పిల్లవాని ఐహిక అవసరాలని మస్తుగా సమకూరుస్తూ తృప్తిగా పెంచుకుంటాం. పిల్లవాడికి ఒక వయస్సు వచ్చాక వాడొక రకం మనిషిగా ప్రవర్తించడం ప్రారంభించాక పెంపుతల లోని చిన్నచిన్న సమస్యలు పలు తలలెత్తి ఎప్పటికప్పుడు పరిష్కారాన్ని కోరుతూ మన బాధ్యతని గుర్తుచేస్తాయి. ఆ సమస్యని సరిగా పరిష్కరించాలి. అలా కాకుండా, పిల్లలకి నిజం చెప్పకుండా, అర్థం పర్థం లేని ఊహాలతో వారిని తృప్తిపరచి ఊరుకుంటే కొంతకాలానికి మనమే వాటి ఫలితం అనుభవించక తప్పదు. మనం చెప్పే అబద్ధాలనీ, అర్థంలేని విషయాలనీ నమ్మితే వాళ్ళా అంతంతమాత్రం పెద్దవాళ్ళే అవుతారు. అలాకాదూ. మనం చెప్పిన తీరుని అబద్ధాలూ, అభూత కల్పనలూ గుర్తిస్తే — వానినీ వాటితో పాటు మననీ తోసిరాజంటారు!


మూడో నాలుగోఏళ్ళ పసివాడు పర్సులోంచి డబ్బుతీస్తే, కొట్లోంచి ఏ పిప్పరమెంటో జేబులో వేసుకుంటే దూరదృష్టి లేని తల్లి 'పిచ్చివెధవ అంతకంటే ఏం తెలుస్తుందీ వెర్రితండ్రికి' అనేసి తప్పు కుంటుంది. ఎప్పటికేనా మాటుకు అంతకంటే ఎక్కువ వాడికెలా తెలుస్తుంది. అవిడగారు చెప్పకపోతే!... దొంగతనం, క్రూరత్వం, మొరటుతనం, అబద్ధాలు చెప్పడం ఎన్నో సంవత్సరాలపాటు ఊరుకుని ఓ సుమూర్తాన, 'అవి తప్పునాన్నా' అంటే కుదరనివని. పిల్లల వయస్సులో పనిలేదు— వారికి మంచిచెడూ, అబద్ధం నిజం దయ, క్రూరత్వం మొదలైనవాటి తేడా చెప్పడానికి ఇక్కడే అసలు తల్లి బాధ్యత ప్రారంభం అవుతుంది. అసలు మనకే ఈ మంచిచెడులకి తేడా తెలుసా? అన్నదికూడా గట్టిగా తెలుసుకోవాలి. మన నమ్మకాలని శల్యపరీక్షకు గురిచేసిచూస్తే వాటిలో ఎన్నింటికి నిజమైన పునాదులుండవో తేలిపోతుంది. ఎవరో చెప్పినవే ఉంటాయి చాలామటుకు. మనఉద్దేశాలు 'వాళ్ళన్నారు' 'వేవిన్నాను' అన్న వాటిమీద ఆధారపడినవే అని తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవన్నీ ఒకరి ఊహాలు. మనవేనని అనుకుంటాం. అవి మనకై ఊహించినవి కానే కాదు! మనం చదవాలి. వినాలి. వాటిని కొంచెం అరాయించుకోవాలి. మన ఊహాలకి అవతలివారి ఊహాలకీ పోలికలుండవచ్చుగాని కార్బనుకాపీ కానక్కరలేదు కదా? ఇలాగే మన తల్లితండ్రుల సంకుచిత దృక్పథాలు మనలోకి దిగుమతి అవుతాయి. అవే మనం గుడ్డిగా మన పిల్లలకీ దిగుమతి చేస్తాం. మనం లోపాలని బాధపడినవాటిని వదుల్చుకోవాలి. అవే అలవాట్లని పిల్లలకి అందించ



ఠలో అర్థంలేదు. ఒక తరానికీ వేరొక తరానికీమధ్య ఎంతో చరిత్ర జరుగుతుంది. ఒకతరపు ఊహలు, అలవాట్లు ఇంకో తరానికి పనికిరాకపోవచ్చు. అవసరం లేకపోవచ్చు. వాటిని పట్టుకు వేలాడడంలో అర్థం ఉండదు. మరి పిల్లలువారి ఊహలనే అమలులో పెట్టేటప్పుడు కష్టపడి మనం చెప్పడం ఎందుకు? అంటే— ఒకటే సమాధానం. వారు తమ ఊహలు ఆలోచనలని ప్రారంభించడానికి ఓ ఆధారం కావాలి. అవే మనం అందించే నమ్మకాలూ, ఆశయాలూ అలవాట్లూను. అందుకే ఈ మనం అందించే విషయాలు బలవత్తరమైనవి, సత్యానికి దూరం కానివి, సాధింప శక్యమైనవిగా వుండాలనడం — అప్పుడే వీటిని పునాదిగా వేసుకుని లేచే పిల్లల ఊహ సౌధాలు గాలి మేడలు కాకుండా పోతాయి! మన జీవిత దృక్పథమే పిల్లలకి తొలిబాట అవుతుంది కనుకనే తల్లి ప్రాముఖ్యం పిల్లల పెంపకంలో ఎక్కువ అనడం. దీపావళి వూటా గాడిద తోకకి సీమటపాకాయల గుత్తి కట్టి అంటించాడు పక్కింటి చంటాడు! 'దారుణం బాబూ'.అంటే 'నేనింకా చిన్నగా ఉన్నప్పుడు

వనితాలోకం

పిల్లి దొరికేది!' అన్నాడు గర్వంగా. అలా చేయడం తప్పని చెప్పలేదా అంటే అమ్మకి భయం అన్నాడు వాడు. పాపం! కొడుకుని కసాయివాడిగా తయారు చేసిందా తల్లి టపాకాయల భయం అనిపించింది. అదే తొలిసారి చేసినప్పుడు—ఒక్కటి అంటించి తప్పు అలా హింసించ కూడదని చెప్పి ఉంటే?' అనిపించింది. తమ పిల్లలు సాటి పిల్లలని ఏడిపిస్తుంటే — చిన్నం చితకా ఎత్తుకు వస్తుంటే, ఎక్కడలేని అబద్ధాలూ ఆడుతూంటే—అరికట్టని తల్లి —శత్రువే అవుతుంది. నా స్నేహితురాలొకత్తె చిన్న పిల్లాడిని అబద్ధం చెప్తే నోరు కడుక్కురమ్మనేది. మరిప్పుడు ఏ ఆఫీసరో అయిఉంటాడు. లంచాలు పుచ్చుకుని కాళ్ళు కడిగేసి ఊరుకుంటున్నాడేమో తెలియదు!! అందుకే అనడం తోటకూర నాడైనా చెప్పనైతివని బాధ పడ్డం వల్ల ఫలితం శూన్యం. తోటకూర కాదు — గడ్డిపోచైనా సరే పరాయిదయితే—తీయడం తప్పని చెప్పి తీరవలసిన బాధ్యత తల్లిది. అటువంటి తల్లి పెంచిన బిడ్డలే—పేరు నిలిపేది! ●



వంటలు:

రాగులు మనరాష్ట్రంలో అనంతపురం జిల్లాలోను, మైసూరు రాష్ట్రంలో చాల జిల్లాలలోను చాలమంది ప్రధానాహారంగా వాడుతారు. బియ్యంతోనో, గోధుమతోనో చేసే పిండివంట లందరికీ మామూలుగా తెలుస్తాయి. కాని ఈ రాగుల్ని అలా ఉపయోగించుకోటం ఇతర ప్రాంతాల వాళ్ళకి తెలియదు. బియ్యం కన్న చౌకైన పుష్టికరమైన ఆహారధాన్యం ఈ రాగులు. వీనిలో మరబియ్యంలో లేని విటమిన్ 'బి' ఉంది.

రాగి పేలపిండి

ఉదయం ఏడింటికే స్కూలున్న పిల్లలు ఏదో ఒకటి పెట్టకపోతే వూరుకోరు. చద్దన్నం అలవాటులేని పిల్లలకీ రాగి పేలపిండీ, పాలూ, బెల్లం కలిపి కాస్త పెట్టేసి పంపేస్తే 11 గం. దాకా మీ జోలికి రారు. పైగా అప్పటికప్పుడు చేసుకోనక్కర్లేదు.

మొదట రాగుల్ని బాగు చేసుకుని మరుగు నీటిలో కడగాలి. కడిగి బట్టపై నీడనే ఆరపోయాలి. పొయ్యిమీద బాణలిపెట్టి గుప్పెడేసి గింజలు దాంట్లో వేసి కదుపుతే చిటపట్లాడుతూ పేలాలవుతాయి. ఇల్లా రాగులన్నీ పేలాలు చేసి వాటిని విసురుకుని డబ్బాలోపోసి మూతపెట్టుకోవాలి. ఈ పిండిలో తరిగిన బెల్లంపొడీ, పాలూ కలుపుకుని అప్పటికప్పుడు తినవచ్చు. కొందరు పచ్చిమిరపకాయ ముక్కలూ, ఉప్పూ వేసుకుని మజ్జిగలో కలిపి తింటారు. బెల్లం తరిగి కలుపుకుని కాచిన నేయి పోసి మినపసున్నికిమల్లే కలుపుకున్నా బాగుంటుంది. ఎవరి కిష్టమైనట్టు వారు అన్నివిధాలా ఉపయోగించవచ్చు.

దోసె

కొంచెం మినప్పప్పు నానపోసి దోసె పిండికి లాగే రుబ్బుకుని, పావు పప్పుకి 3 పావుల రాగిపిండి చొప్పున కలుపుకుని పచ్చిమిర్చి, ఉప్పు వగైరాలతో దోసె పోసుకుంటే బాగుంటుంది. మామూలుగా రాగుల్ని బాగుచేసి మిషన్లో పిండి పట్టిస్తే చాలు దీనికి.

తపిలంటు

రాగి పిండిలో ఉప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలూ వేసి నీళ్ళుపోసి ముద్దగా కలుపుకోవాలి. ఇష్టమున్నవాళ్ళు కొబ్బరికోరూ, ఉల్లిపాయ లిష్టమైతే వాటి ముక్కల్నీ వేసుకోవచ్చు. బూర్లె మూకుడులో (బాణలి) కొంచెం నూనెవేసి చిన్న నారింజ కాయంత పిండిని ఉండగా తీసుకుని బాణలిలో పెట్టి చుట్టూ నాల్గు వేళ్ళతో నూనె పొర మీదుగా పల్చగా వచ్చేట్టు పరవాలి. సమానంగా అన్నివైపులకీ గుండ్రంగా రావాలిల్లా పత్తేప్పుడు. అప్పుడే బాణలిని తీసుకెళ్ళి కుంపటిమీద పెట్టాలి. దాన్ని మూసేందుకు తగిన పళ్ళెంతో ముయ్యాలి పైన. ఎర్రగా కాలాక బాణలి నుంచి అదే వూడి వస్తుంది. వేడిమీద తింటే కరకరలాడుతూ బాగుంటుంది.

—పొదు హైమవతి ●

గొలుసు కథ ప్రారంభం



గౌరీపతి అద్దంముందు నుంచొని క్రాప్ సరిచేసుకొంటూండగా— శారద కాఫీ కప్పుతో అతని దగ్గరకొచ్చి నిలబడింది.

'అక్కడపెట్టి వెళ్ళొచ్చు!' అన్నాడు ఆవంక చూడకుండానే.

కప్పు టేబుల్‌మీదుంచి గోడ కానుకొని నిలబడింది శారద. చీరకొంగు ఆమె వ్రేలికి చుట్టుకొని విడదీస్తోంది.

'నా మొహంలో సినిమా ఆడుతోందా? అలా చూస్తున్నావ్?'

'ఊహూ!...అబ్బే... ఏం లేదండీ!' అందామె తడబడి.

'అయితే లోపలికి దయచేయవచ్చు...' మెల్లిగా లోనికి నడిచిందామె.

అతను వడివడిగా బయటికి నడిచి పోతూంటే ప్రక్కగదిలోనుంచి ఆమె వెక్కి వెక్కి ఏడవడం వినిపించింది. ఆమె గదిలోకి నడిచి 'ఎప్పుడూ నెత్తిన నీళ్ళు కుండేనా? నాన్సెన్స్! ప్రాణానికి శనిలా దాపురించావ్! ఏం? ఎందుకు? నీకేం తక్కువయిందని ఏడుపు?...ఏం తక్కువ చేశానని?...' తీవ్రంగా అడిగాడు గౌరీపతి.

చెంపలమీదనుంచి జారుతోన్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకొందామె. కంటి కాటుక, కళ్ళచుట్టూ పులుముకుపోయింది. అతని కళ్ళల్లోకి ఓ క్షణం చూసి వెంటనే తలదించుకొందామె. గౌరీపతి తనలో తనే సర్దుకోడానికి ప్రయత్నించాడు.

'పోనీ...పోనీ చెప్పెయ్యరాదూ? నీ కిష్టం లేకపోతే ఇంటికి రావడం మానేస్తాను...' శారద మాట్లాడలేదు. ఉబికి వస్తోన్న దుఃఖాన్ని మింగడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది.

'నాకోసం కనిపెట్టుకు కూర్చోవద్దు. నువు భోజనం చేసెయ్!' అనేసి బయటికి నడిచాడు. అతను కనుమరుగవగానే మంచంమీద కూలబడి బిగ్గరగా ఏడ్చేసింది శారద.

గౌరీపతి త్వరత్వరగా నడిచి శంకర విలాస్ హోటలుకు చేరుకొన్నాడు. ఓ టేబుల్ ముందు కూలబడి భోజనం చేస్తూండగా ప్రక్కకుర్చీ అతను అన్నాడు 'మాంచి ఆకలిగా వున్నట్లున్నారు. ప్రక్కన ఎవరుందీ కూడా చూడ్డంలేదు...'

అతనివంక చూసి ఆశ్చర్యపోయాడు గౌరీపతి. అతను శంకర్రావు. తోటి లెక్చరరూ, మంచి స్నేహితుడూనూ.

'మీరా! పరధ్యానంలో ఉండిపోయాను. అదివరకే విన్నసలు కనిపించనేలేదు ఎటు వెళ్ళేశారు?' నవ్వుతూ అన్నాడు గౌరీపతి.

'నిన్న కొంచెం పనిమీద తిరిగానులెండి ...అన్నట్లు మీ శ్రీమతి కేరాఫ్ పుట్టిల్లేమిటి? ఈ వరకానికి వెంచేశారు?'

'అహ! కాదండీ!—ఊట కాలహం— అయితేనూ...'

* * *

సోమయాజులు రోజూకన్నా చాల హుషారుగా వున్నాడు. ఈలపాట పాడుతూ గదంతా కలయతిరిగి పరస్వతి బట్టలన్నీ

పెట్టెలోకీ బెడ్డింగ్‌లోకీ సర్దుతున్నాడు. సరస్వతి లోపలి దిగులు కనిపించనీకుండా అతనికి సాయపడుతోంది.

'సరూ'! వాటర్‌బాటిల్‌కూడా తీసుకుపో! రైల్లో దాహంవేస్తే కష్టం మరి...'అన్నాడు.

ఆమె లోనికివెళ్లి వాటర్‌బాటిల్ తీసుకొచ్చి అతని కందించింది. అది ప్రక్కన పెట్టి, సరస్వతి రెండుభుజాలపై చేతులు వేసి అడిగాడతను.

'ఎందుకలా వున్నావ్? వెళ్లిపోతున్నాననా?...'

'ఊహు! అదికాదండీ!...ఏంలేదు...' అంది సరస్వతి నవ్వడానికి ప్రయత్నిస్తూ.

'హాయ్‌హాయ్! ఏం బ్యూటిఫుల్‌గా కోశేశావు!...ఎంతలోకి? ఇట్టే గడిచిపోతాయి ఆర్నెల్లు. నేను సినిమాకి రమ్మంటే నువ్వు మేకప్ అయేంతసేపు. ఏం?...అవునా? ఇక ఆపోజు తీసెయ్! త్వరగా తయారవు! బండికి టైమవుతోంది. నేనలా వెళ్లి రిక్షా తీసుకొచ్చేస్తాను...' బయటకి నడిచాడతను.

సరస్వతి మధ్యతరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి. అంచేత మధ్యరకం చదువే చదివింది. ఇంకా పైకి చదువుతానని గొడవ చేసిందికానీ, వాళ్లనాన్న విన్లేదు. 'పైచదువులు పైవాళ్లగ్గానీ, మనకెందుకు? నువ్వేం మినిష్టరవుతావా?

నీలాంటి ఒకరు...

యం. పి. అవుతావా' అంటూ కోప్పడ్డాడు.

కోప్పడి ఊరుకొంటే లాభంలేదని పెళ్లిచేసి పారేశాడు. చాలామందిలానే కూతురు పెళ్లయిన మర్నాడే ఇల్లమ్మి దివాలా తీశాడు. ఇంట్లో అందరూ ఓ పూటే భోజనంచేసి రెండోపూట 'మంచి సంబంధం చేశామన్న' సంతృప్తిని త్రాగి నిద్రపోతున్నారు. సంవత్సరానికి ఆరునెల్లు ఇలాంటి పుట్టింట్లో గడపాలంటే సరస్వతికి ప్రాణంమీది కొస్తోంది. ఈ ఆరునెలలు జీవితం చక్కెరలేని కాఫీ డికాషన్ త్రాగినట్లుంటుందామెకి. కానీ తప్పదు: సోమయాజులు డాక్టరు సరస్వతి పేషెంట్. పేషెంట్‌ని విపరీతంగా ప్రేమించే డాక్టరతను. అంచేత తనకిష్టం లేకపోయినా అతని కనుగుణ్యంగా నడుచుకోక తప్పటంలేదు.

సరస్వతి ప్రపంచాన్ని చాలావరకూ చదివి తెలుసుకొంది. మిగిలిన కొంచెం చూసి తెలుసుకొంది. అయితే ఆ అమ్మాయిచదివీ, చూసినంత వరకూ సోమయాజుల్లాంటి మనుషులెక్కడా తటస్థపడలేదు. అతనితో వివాహం అయేంత వరకూ అసలలాంటి వారుంటారనే అనుమానంకూడా కలుగలేదు.

సోమయాజులు సరస్వతిని చాలాగాఢంగా ప్రేమిస్తాడు. ఆమె అడిగిందీ, అడగనిదీ కూడా నిమిషాల్లో సమకూరుస్తాడు. కాలేజీ టైము తప్పితే, మిగతా కాలమంతా సరస్వతితో మాట్లాడుతూ ఇంట్లోనే కాలం గడుపుతాడు. ప్రతి సినిమాకీ మొదటి వారంలోనే ఆమెని తీసుకుపోతుంటాడు. ఆమె వంట్లో కాస్తంత నలతగావుంటే, ఏపనీ ముట్టనీకుండా తనే అన్ని పరిచర్యలూ చేస్తాడు. కాని ఇదంతా సంవత్సరానికి ఆరు నెలలు మాత్రమే. మిగతా ఆరునెలలూ ఆమెకి చీకటిరోజులు. ఆమె అభిప్రాయంతో ఏమాత్రం పనిలేదన్నట్లుగా ఆమెని పుట్టింటికి పంపించేస్తుంటాడు. తను లేకుండాచేసి అతను గడిపే జీవితమేమిటో సరస్వతి ఎప్పుడూ చూళ్లేదు. అతనిని అడగనూ లేదు. కాని ఊహించుకొంది. స్నేహితులు, సిగరెట్ పొగలూ, పేక ముక్కలూ, బాటిల్స్‌లోని నిషాలూ — తనకిచ్చే ట్రీట్‌మెంట్‌కి నవ్వుకోవాలో, ఏడవాలో కూడా తెలియడం లేదామెకి.

రిక్షాతో సహా తిరిగొచ్చాడు సోమయాజులు.

'ఏం? రడీయేనా?...'

'ఓ! అయిపోయిందండీ! ఒక్కమాట ...మీరు హోటల్లో భోజనం చేయొద్దు. ఆరోగ్యం పాడవుతుంది. బద్ధకించిన రోజున పని అవ్వతోనే నాలుగు మెతుకులు వండించుకోండి...'

'అలాగే మహారాణిగారూ!...'

బయటకి నడుస్తుంటే ఎంచేతనో ఆమె కళ్లు చెమ్మగిలినయి.

'ఏమిటే, మళ్లీ ఆగావు?'

'ఫ్లాస్కులో కాఫీ వుంచాను...'

'సరేలేవే! ఆత్మహత్య యినా చేసుకొంటానుగానీ హోటల్లో కాఫీ త్రాగను. సరేనా! ఇహ పద...చాలా కొద్ది టైముంది.'


ఆమె రిక్షాలో కూచుంది. తల్లు తాళంవేసి అతనూవచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. స్టేషన్ చేరుకొనేప్పటికి రైలు అప్పటికే ప్లాట్‌ఫారంమీద ఆగి వుంది. త్వరగా ఆమెని ఆడాళ్ల పెట్టెలో ఎక్కించి కిటికీ దగ్గర కూచున్నాడతను.

'ఏమండీ?'

'ఏమిటండీ?'

'అన్నాళ్లు పుట్టింట్లో వుండాలంటే నా కేమిటోగా వుందండీ! చివరకి వాళ్లగ్గూడా లోకువయిపోతానేమో!...'

'ఛ: మీ నాన్న అలాంటివారుకాదు.



నాకు తెలుసుకదా! ఆ విషయంలో నువ్వేమీ బాధపడకు...'

గార్డు విజిల్ వేశాడు.

'ఏమండీ!' మళ్ళీ పిలిచింది సరస్వతి.

'మళ్ళీ ఏమిటి ?...' నవ్వుతూ అడిగాడతను.

తలదించుకుని ఊరుకుండి పోయిందామె. బండి కదిలింది

'పిల్చి వూరుకొన్నావేం ? ... ఏమిటో చెప్పెయ్...'

'నన్ను వీలయినంత త్వరగా తీసుకొచ్చేయండి!...నేను...నే నిప్పుడు ఉత్త మనిషినికూడా కాదు...'

'యూసిల్లీగాళ్ ! చెప్పవేంమరి ?...' ఆమెచేతిని గట్టిగా నొక్కేడతను. బండి వేగం అందుకొంది. అతను ఆగిపోయాడు.

సరస్వతి కంటివెంబడి బొట బొటా కన్నీటిచుక్కలు రాలినయి.

స్టేషన్ బయటి కొచ్చింతర్వాత చాలా ఫ్రీగా ఫీలయ్యాడు సోమయాజులు మనసంతా ఉల్లాసంగావుంది. చకచక మార్కెట్‌వేపు అడుగులు వేశేడు.

'హల్లో! యాజులూ!' అంటూ పలుకరించేడు సత్యం.

సోమయాజులు అభిరుచుల్ని మెచ్చుకుని, చాలావరకూ అనుసరిస్తున్న వారిలో సత్యం మొదటివాడు. అతనికో లంకంత ఇల్లూ, లంకిణిలాంటి భార్యా, బోలెడాస్తీ ఉన్నయి. అతనికీ, లంకిణికీ ఓక్షణంకూడా పడదు. ఎప్పుడయినా ఓ క్షణం మాట్లాడాల్సిన పరిస్థితేర్పడితే అతని దురలవాట్ల గురించి ఆవిడా, ఆవిడ పిచ్చి వ్యవహారాల గురించి అతనూ దెప్పిపొడుచుకునే వాళ్ళు. సోమయాజులు తన సరదాలు తీర్చుకొనే అన్నిరోజులూ ఇంచుమించుగా అతని ఇంట్లోనే మకాం పెట్టేస్తాడు సత్యం.

'సత్యం! ఇవాళ ప్రారంభోత్సవం! మన కంపెనీ ఆంతట్నీ, సాయంత్రానికల్లా కొట్టుకొచ్చెయ్! ఆలోగా నేను ఎరేంజ్‌మెంట్స్ చేస్తాను...' అన్నాడు సోమయాజులు. కెవ్వుమని నవ్వాడు సత్యం 'గ్లాడ్ న్యూస్ గురూజీ! ఈ మధ్యన సరయిన కంపెనీలేక 'బోర్' కొట్టేసిందనుకోండి! మరి ఇవాళ మీ కాలేజీ మాటేమిటి ?'

'ఇప్పుడక్కడికే పోతూంట! కుర్రాళ్ళని సినిమాకిపొమ్మని చెప్పేసివస్తా!...'

'ఓ. కే...' అంటూ వెళ్ళిపోయాడు సత్యం.

కొద్ది దూరంలోనేవున్న ఓ మెడికల్ షాపులోకి నడిచాడు సోమయాజులు. ఎవరికే మందు కావాలన్నా అది ఆ షాపులో లభిస్తుంది. సోమయాజులుకి కావల్సిన మందు ఈ ఒక్క షాపులోనే దొరుకుతుంది.

అతన్ని చూడగానే 'నమస్తే సార్! ఈ మధ్యన శీతకన్నేశారు మామీద...' అన్నాడు మేనేజరు నవ్వుతూ.

'అవునయ్యా! మా కన్నేద్దామంటే వీల్లేకపోయింది. అంచేత శీతకన్నే సర్దాం ప్రస్తుతానికి, సరుకుందా ?...'

'ఓ, బెస్ట్‌స్టఫ్! నిన్నే షిప్‌నుంచి తెచ్చాం! ఏదికావాలో చెప్పండి ?...'

'డిప్లొమేట్ ఆరు ఫుల్‌బాటిల్సు ... బీరుకూడా ఓ అరడజను ... సాయంత్రం వచ్చి తీసుకుపోతాను.'

'అలాగేసార్! రడీగా వుంచుతాను...'

'ఇదొకరకం పిచ్చి! ఇక ఆర్నెల్లవరకూ అద్భుతంగా వెలుగుతాడు ...' అన్నాడు షాపులో గుమాస్తా సోమయాజులు వెళ్ళగానే.

సోమయాజులు కాలేజికి చేరుకొనేసరికి ఫస్ట్‌బెల్ అవుతోంది. అతన్ని చూడగానే స్టాఫ్ రూమ్‌లోనుంచి సీతాపతి, దాసూ, ఇద్దరూ పిలిచేరు.

'నీ గురించే చూస్తున్నామోయ్! సాయంత్రం ప్రోగ్రాం వుందో లేదోనని... అంతా రడీయేనా ?'

'మనం ఒహటి అనుకోవడమూ, అది కాకపోవడమూనా ? ఫైవోక్లాక్కల్లా ఇంటికొచ్చేయండి...'

క్రొత్తగా చేరిన కుర్ర లెక్చరరు వీళ్ల మాటలు ఆశ్చర్యంగా వింటున్నాడు.

'ఏమిటిసార్! డిటెక్టివ్ నవలలో లాగా ఏదో 'కోడ్' మాట్లాడుతున్నారు. అదేవో చెప్తే నేనూ వస్తానుగదా !...'

ముగ్గురూ ఫెళ్లున నవ్వారు.

'కోడ్' అన్నతరువాత అదింక అంతేనాయినా! అర్థంచెప్పరు. సాయంత్రం మా వెంబడివస్తే నీకే తెలుస్తుంది...'

దూరంగా కూర్చున్న ఓ లెక్చరరు ప్రక్కాయన చెవిలో గొణిగాడు.

'సాలెపురుగు మళ్లీ గూడు అల్లుతోంది. ఏమీ తెలియని రాజారావుకూడా నాశనమయేట్లున్నాడు...'

ఫస్టవర్ తర్వాత సోమయాజులు లైబ్రరీ హాలునుంచి బయటికొస్తుంటే శంకర్రావు, గౌరీపతి అతని కెదురయ్యేరు.

'గుడాఫ్టర్ నూన్...' అన్నాడు సోమయాజులు నవ్వుతూ.

ఇద్దరూ అతనికి విష్‌చేశారు.

'గౌరీపతిగారూ! విశేషా లేమిటి ? ... మరు 'ఎంప్టీ కాన్వాస్' నావెల్ కావా లన్నారుగదూ ! సాయంత్రం ఇంటికిరండి. తీసుకు పోదురుగాని ... వేరే పనేమీ లేదుగదా !' వెంటనే శంకర్రావు అందుకొన్నాడు.

'సారీ మిష్టర్ సోమయాజులూ ! సాయంత్రం గౌరీపతికి మా యింట్లో ఓ చిన్న 'టీ' పార్టీ ఇద్దామనుకొంటున్నాను. రేపు కాలేజి కొచ్చేప్పుడు నువ్వే ఆ నావెల్ తీసుకు రావచ్చుగదా !...'

'అఫ్ కోర్స్! బ్రహ్మాండంగా తీసుకు రావచ్చు. తెస్తాను. కాని నాకూ నీలా నేదుర్బుద్ధి ఉండొచ్చుగా...ఆయనని_'టీ'కి పిలవాలనీ !...'

'అలాగే ! కానీ ఇవాళ ప్రోగ్రాం నాది...' నవ్వుతూ అన్నాడు శంకర్రావు.

'బాపుందండోయ్! నాకు తెలీకుండా

నీలాంటి ఒకరు ...

ఎందుకు 'టీపార్టీ' ఇస్తున్నట్లు మీరూ?'

శంకర్రావు నుద్దేశించి అన్నాడు గౌరీపతి.

'ఇదేం డిన్నర్‌కాదుగదా ప్రి ఇంటిమేషన్ ఇవ్వడానికి...పదండి పోదాం ...' ముందుకి నడిచాడు శంకర్రావు. గౌరీపతి అతనిని అనుసరించ బోయాడు.

'అట్లయితే రేపు వస్తారనుకొంటాను...' అన్నాడు సోమయాజులు.

'ఇవాళ్టికి మమ్మల్ని పోనీయవయ్యా! మహానుభావా రేపటిసంగతి రేపే చూచుకోవచ్చు...పదండి గౌరీపతిగారూ...' అన్నాడు శంకర్రావు ఆగకుండానే.

'వస్తానండీ!' తనూ నడిచాడు గౌరీపతి.


ఓ క్షణం వాళ్ళవంకే నవ్వుతూ చూసి వెనుదిరిగేడు.

త్రోవలో శంకర్రావు అన్నాడు.

'సోమయాజులు గురించి మీకు పూర్తిగా తెలీదనుకొంటాను గౌరీపతిగారూ! ఉట్టి వ్యసనాల మనిషి. మీరు అతనికి ఏవిధంగానూ చేరువవ్వడం నాకిష్టంలేదు. ఇందాక అతని ఇంటికి మిమ్మల్ని ఆహ్వానించినప్పుడు, అందుకే మాయింట్లో టీపార్టీ ఉందని అబద్ధమాడేను. తన సరదాల గురించి దేనికీ వెనుదియ్యడు. అంతగా దాసుడయిపోయాడు వాటికి. మీరు నాకు మంచి స్నేహితులవడంమూలాన బ్రతిమాలి చెప్తాను. ప్లీజ్! వీలయినంతవరకూ అతనితో మాట్లాడ్డంగూడా 'ఎవైడ్' చెయ్యండి!...'

గౌరీపతి నవ్వేడు.

'భలేవారే మీరు. నేనో చిన్న పాపాయిగాణ్ణనుకుంటున్నారా ఒకళ్లమాటలు విని



చెడిపోడానికి...'

లైబ్రరీనుంచి పుస్తకాలు తీసుకొని వచ్చేప్పుడు అడిగాడు శంకర్రావు.

'సాయంత్రం క్రొత్తపిక్చరొహటి రిలీజవుతుంది. వెళ్దామా?'

'సారీ సర్! ఈవినింగ్ కొంచెం షాపింగ్ వుంది. మరోసారి పోదాంలెండి...'

* * *

శేష్‌మహల్‌లో ఫస్ట్ షో జరుగుతోంది. సినిమా చూసేజనం చాలా విపరీతమయిన బాధపడుతున్నారు. హీరోయినూ, ఆమె కజిన్ సిస్టరూ ఇద్దరూ ఒకణ్ణే ప్రేమించారు. ఇప్పుడెలాగా అని హాల్లో అందరూ సతమత మవుతున్నారు. ఇంటర్వెల్ అయింది. శంకర్రావు బయటికొచ్చి సిగరెట్ వెలిగించాడు.

'ఇప్పుడేమవుతుందో...' సోడా త్రాగుతూ ఓ గిరజాలవాడు ప్రక్కవాణ్ణడిగాడు.

'హీరోయిను తన ప్రేమని త్యాగం చేసవతలి పారేస్తుంది...' ప్రక్కవాడు బీడీ వెలిగించుకొని జవాబిచ్చాడు.

'నీకెలా తెలుసు?...' ఆశ్చర్యంగా అడిగాడు గిరజాలు.

'ఓస్! ఈమాత్రం తెలీదేమిటి? అదివరకు పిక్చర్లోకూడా అలాగే చేసింది...' శంకర్రావుకి నవ్వచ్చింది. ఇంకానయం! నిన్న మాట్నీలో కూడా అలాగేచేసింది' అన్నాడుకాదు! లోపలికినడిచి సీట్లో కూలబడ్డాడు. అప్పటికే సినిమా బిగినయిపోయించి.

'రాజా! నీకు నామీద ఏమాత్రం ప్రేమున్నా నన్ను మర్చిపోకు. మా చెల్లిని పెళ్లిచేసుకొని సుఖంగా జీవించు...' అంటూ హీరోయిను ఇంట్లోకెళ్లిపోయింది.

'నాగుండెల్లో సోడాకొట్టావు జయా!' అంటూ ప్రక్కకి వెళ్లిపోయాడు హీరో.

'ఈ సిన్మాకి సోడాలమ్మే అతను డైలాగులు రాసినట్లున్నాడు...' ముందు కూర్చున్న స్టూడెంట్ అన్నాడు. మరి కొంచెంసేపుండి 'బోర్' కొట్టి బయటికొచ్చేశాడు శంకర్రావు. సన్నగా వానచినుకులు పడుతున్నాయి. సినిమా 'బోర్' కొట్టడం మంచిదయిపోయింది. వర్షం పెద్దదవకముందే ఇల్లుచేరుకోవచ్చు...నడుస్తుండగానే వర్షం పెద్దదయింది. రోడ్డుప్రక్కనే వున్న పెంకుటింటి అరుగు

మీద నుంచున్నాడు శంకర్రావు. ఇంటిలో చాలా సందడిగావుంది. ఉండుండి పెద్దగా నవ్వులు వినబడుతున్నయి. ఓ గొంతు సన్నగా ఇంగ్లీషుపాట ఒహటి ఆలాపిస్తోంది.

'ఇట్ హాజ్ బీన్ ఎ హార్డ్ డేస్‌నైట్,
ఎండ్ ఐహావ్ బీన్ వర్కింగ్ లైకె ఎ డాగ్.
ఇట్ హాజ్ బీన్ ఎ హార్డ్ డేస్ నైట్,
ఐషుడ్ బి స్లీపింగ్ లైకే డాగ్...'

ఉలిక్కిపడ్డాడు శంకర్రావు. అది గౌరీపతి గొంతు. వెంటనే తలుపుసందులోనుంచి లోపలికి తొంగిచూశాడు. గది మధ్యలో కొంతమంది కూచొని పేకాడుతున్నారు. వాళ్లల్లో సోమయాజుల్ని మరి ముగ్గురు తమ కాలేజీ లెక్చరర్లనీ గుర్తించాడు. సోమయాజులు ప్రక్కగా గౌరీపతి గోడకి చేరగిలబడి కూచున్నాడు. వర్షం మరి కొంచెం పెద్దదయింది. అయిదు నిమిషాలు గడిచినయి. గౌరీపతి ఇంగ్లీష్‌పాట ఆగిపోయింది.

'మిష్టర్ సోమయాజులూ! నాకింకా త్రాగాలని వుంది. ప్లీజ్! ఒక్క గ్లాసుడు ఇవ్వవూ?'

సోమయాజులు వికృతంగా నవ్వాడు.

'త్రాగవోయ్! ఇదిగో! నా వాటాకూడా త్రాగెయ్! ఇక్కడికీ చాలకపోతే మరో బాటిల్ ఓపెన్ చేద్దాం! నేను చాలా మంచాణ్ణి. నువ్వు సుఖపడటమే నాకానందం. ఎంచేతనంటే నా నుదుట అది వ్రాయబడలేదు.'

'థ్యాంక్యూ సోమయాజులూ! వెరీ కైండాఫ్ యూ!'

తూలుతూ మాట్లాడుతున్నాడు గౌరీపతి.

మరోక్షణం కూడా అక్కడ ఉండబుద్ధికాలేదు శంకర్రావుకి. వర్షంలోనే తడుస్తూ నడవసాగేడు. మనసంతా అల్లకల్లోలంగా తయారయింది.

మర్నాడు గౌరీపతి శంకర్రావు కాలేజి కాంటీన్‌లో కాఫీ త్రాగుతున్నపుడు ఓక్షణం తటపటాయించి శంకర్రావు అన్నాడు.

'మిమ్మల్ని రాత్రి సోమయాజులింట్లో చూశాను...'

ఏమాత్రం తొణక్కుండా జవాబిచ్చాడు గౌరీపతి.

'శంకర్రావుగారూ! మీకు నామీద గల అభిమానానికి కృతజ్ఞుణ్ణి. కానీ నాకతని వదంతులు బాగా నచ్చాయి...'

(రెండోభాగం పైవారం)




చచ్చిబతికిన వనిత

పుట్టుగుడ్డి అయిన 30 ఏళ్ళ రిసాలి గత 14 తేదీ తెల్లారుజామున చనిపోయిందట. ఏడుపులూ అవీ అయి, సాయంత్రం ఆమెను స్మశానానికి తీసుకు వెళుతుండగా దారిలో లేచి కూర్చుందట. 'ఆకలి' అందట కూడా. ఆమెను వెనక్కు తీసుకువచ్చారట. అంతే— చనిపోయింది అనుకున్న 10 గంటలకు తిరిగి బ్రతికిందన్నమాట. డాక్టర్లు ఆమెను పరీక్షించి, స్థితి యింకా అలాగే వుంది. బ్రతక్కపోవచ్చు అన్నారట. ఇది గోరక్‌పూర్‌లో జరిగింది.

కోటీశ్వరుని భార్యని ఎత్తుకుపోయిన సాధువు!

ఒక కోటీశ్వరుని భార్యను ఒకసాధువుగారు ఎత్తుకుపోయారట. ఇది బొంబాయికి చెందిన ఘట్కోపర్‌లో జరిగింది. స్వామి రామసుందరానంద్ రామానంద్ అనే యీ అందమైన సాధువు పూజల్ని డబ్బుకలవారి వద్ద మంచిని సంపాదించుకున్నాడట. ఒక కోటీశ్వరుని యింటకి వెళ్ళి ఆతని భార్యను తనతో రమ్మని ఘట్కోపర్‌కి తీసుకువెళ్ళి మేడ మీద ఒక గదిలో బంధించేసి, చెరచడానికి ప్రయత్నించాడట. ఆమెను ఎలాగయినా బొంబాయి దాటించాలని ప్రయత్నించాడట. ఆలోగా కోటీశ్వరుని రిపోర్టుతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. అయితే కోటీశ్వరుడు తన భార్య కనబడటంలేదని చెప్పాడు కాని, సా[illegible] తనకు తెలీదు. తెలివిగా వలవేసి యీ సాధువును పోలీసులు పట్టారు.



ప్రేమకు బలి

కావేరీ పట్టణానికి చెందిన కారాచేశా గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో నర్సుగా పనిచేస్తున్న సరోజ అనే ఆమె తన ఆరేళ్ళకూతుర్ని 'ప్రేమ'కు బలి యిచ్చిందట. భర్త చనిపోయాక, ఆరేళ్ల పిల్లున్నా లెక్కచేయక అదేవూరుకు చెందిన భాస్కరన్ అనే అతనితో అక్రమ సంబంధం పెట్టుకోడమే గాక, పోతులా ఎదిగిన కూతురు తన సుఖసంతోషాలకు అడ్డంవస్తోందని ఆమెను తన ప్రియుడి సహాయంతో చంపించేసిందట. (బెల్టుతో బాది). ఆనక ఆ శవాన్ని ఏం చెయ్యాలో తెలియక, ఒక వ్యూహం పన్నారట. పిల్లకి విషజ్వరం వచ్చిందని, మంచి డాక్టరు కోసం కృష్ణగిరి తీసుకుపోతున్నామని పొరుగువారితో చెప్పి, శవాన్ని జాగ్రత్తగా కృష్ణగిరికి తీసుకెళ్ళారట. అక్కడ ఒక హోటల్లో దిగి, జ్వరంతో పిల్ల దారిమధ్యలోనే చనిపోయినట్టు పక్కరూములవాళ్ళతో చెప్పి, హృదయ విదారకంగా ఏడ్చారట. చుట్టుపక్కలవాళ్ళు వారిని ఓదార్చి, శవాన్ని శ్మశానానికి తీసుకు వెళ్ళి (భాస్కరన్ సహాయంతోనే) పాతివేశారట. అయితే పిల్ల చావు విన్న సరోజ చుట్టాలు తమకి ఏదో అనుమానంగా వుందని పోలీసులకు రిపోర్టిస్తే వారు కేసు దర్యాప్తు చేసి శవాన్ని బయటకు లాగి, నిజాన్ని లాగి ప్రేయసీ ప్రియులను అరెస్టు చేశారట. ఇంతపనీ చేసిన ప్రేమ గుడ్డిదన్నదెవరో!!

* * *

గడ్డిలో మాంసకృత్తులు

కాబోయే పరిశోధనల్లో శాస్త్ర విజ్ఞానం మనిషిచేత గడ్డి తినిపించాలని శతవిధాల ప్రయత్నిస్తోంది. కృషి చేస్తోంది. గడ్డిలో మేలురకం మాంసకృత్తులు వున్నాయని, యివి మానవశరీరానికెంతో వుపయోగమని ఇంగ్లండ్‌లో యెస్సెట్ ప్రయోగ శాలలో ఆ మాంసకృత్తులను అధికం చేసి తీసే యంత్రాన్ని కనుక్కొన్నారట. ఈ యంత్రం నిరుపయోగంగా వున్న మొక్కలనుంచి మేలురకం మాంసకృత్తులను లాగివేయ గలదట. ఈ విద్యను వాడుకలోకి వస్తే యిక అన్నం దొరికినా గడ్డేతిని, గడ్డి దొరకనివారే అన్నంతినాల్సిన రోజులూ వొస్తాయన్నమాట— దానివ్వండదీ చూదాం.



తిరిగివచ్చిన తనయుడు

16 సంవత్సరాల క్రితం చనిపోయాడనుకున్న బాలుడు పెద్దవాడై తలిదండ్రులను చూడ వచ్చాడట. ఇది కటక్‌లో జరిగింది. 16 సంవత్సరాల క్రితం సాంబల్పూర్ జిల్లా గంభర్ పంకా గ్రామంలో ప్రజాపతి కొడుకు బృందావన్‌కి కలరా వచ్చిందట. అతన్ని స్మశానానికి తీసుకు వెళ్ళి, చావు బ్రతుకుల మధ్య— చనిపోయి వుంటాడని, చనిపోయాడనీ అనుకుని ఆ స్మశానంలో వదిలి పోయాడట తండ్రి. అయితే కాస్సేపటికి వో సన్యాసుల ముఠా ఆ దారిన వెళుతూ బృందావన్‌కి నీళ్ళు త్రాగించి, తేరుకున్నాక తమలో జేర్చుకున్నారట. 16 ఏళ్ళు వారితో కలిసివుండి, తలిదండ్రులను ఒక్కసారి చూసి, ఉండిపొమ్మని వారు బ్రతిమాలినా వినక, "నాకు ప్రాణ భిక్ష పెట్టినవారితోటే నా జీవితం" అని వెళ్ళిపోయాడట బృందావన్.

గత పదిజన్మల వివరాలు చెప్పిన 13 ఏళ్ళ బాలిక

గతజన్మ ఒక్కటి గుర్తుకొస్తేనే బాబ్బో అని భయపడతాం. దక్షిణాఫ్రికా ప్రిటోరియాల్ జోయీ అనే 13 సంవత్సరాలామె తను క్రితం పది జన్మలు ఎత్తినట్టు చెప్పి, ఆ పది జన్మల వివరాలూ చెప్పిందట. 17 వ శతాబ్దం నుంచీ తన జన్మలను వివరించిందట. 1883—1900. వరకూ ట్రాన్స్వాల్ రిపబ్లిక్ అధ్యక్షుడుగా పని చేసిన స్టెఫెనస్ జోహానిస్ పౌలస్ క్రూగర్‌ను ఎరుగుదు నందట. ఈమెను




దక్షిణాఫ్రికా జోహన్స్ బర్గ్ విట్వాటర్స్రాండ్ విశ్వవిద్యాలయంలో మానసికానుభవాలను ప్రయోగాలు చేసే ప్రొఫెసరు ఆర్థర్ బ్లాక్స్లే యీమెను పరిశీలించారట. అయితే ఆయనకూ యీ విషయం కొరుకుడు పడలేదట.

ట్రంకులో శవం

అక్టోబర్ 27వుదయం హాపురాస్టేషనులో ఢిల్లీ-కల్కామెయిల్ మూడవ తరగతి స్లీపర్‌కోచ్ ముందు ప్లాట్‌ఫారమ్ మీదవున్న ఒక ట్రంకుపెట్టెలో స్త్రీ శవం కనుగొన బడింది. శవాన్ని పరిశీలించగా ఆమె హత్య చేయబడినట్టు తేలిందట. 5 ముక్కలుగా నరికి పెట్లో పెట్టారట. ఈమె వయస్సు 32 సంవత్సరాలని, కనీసం యిద్దరు పిల్లల తల్లి అయినా అయ్యుండాలనీ పరీక్ష తేల్చింది. హత్య జరిగి అప్పటికి 24 నుంచి 36 గంటల వరకూ అయ్యుండాలని లెక్క కట్టారు. ఇంకా అసలు విషయం ఆ స్త్రీ ఎవరు, ఎందుకలా హత్య చేయబడింది అన్నది తేలలేదు. ●

పాతికేళ్ళ నటనానుభవం— పద్మనాభం



'శ్రీరామకథ'లో నారదుడుగా పద్మనాభం.

పట్టుదల, ఆత్మవిశ్వాసం, జీవితంపై ఆశవుంటే యేదయినా సాధించ వచ్చునని పద్మనాభం జీవితం నిరూపిస్తుంది. ఇతగాడు నేడు ప్రముఖ హాస్యనటుడేగాదు; ఒక చక్కటి నిర్దేశకుడుకూడ; ఇదంతా కేవలం అదృష్టంతో జరిగిందికాదు; కృషితో దిన దిన ప్రవర్ధమానుడవుతున్న పద్మనాభం ఒకనాడు పడ్డ శ్రమకు చక్కటి ప్రతిఫలం అనడం సమంజసం.

ప్రముఖ దర్శక, నిర్మాత ఎల్. వి. ప్రసాద్ 'షావుకారు'లో పద్మనాభంకు హాస్య భూమిక నిచ్చారు; వచ్చిన అవకాశాన్ని తన నటనలో అందుకున్నాడు. పాతాళభైరవిద్వారా పద్మనాభం ప్రేక్షకులకు మరీ దగ్గరయ్యారు. అప్పటినుండి యిప్పటి వరకు హాస్యరస పోషణలో ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నాడు.

పద్మనాభానికి సినిమాలలో ఒకప్పుడు బుకింగులు కొస్త మందగించాయి— అయితే యిప్పుడు పద్మనాభం వచ్చే ప్రతిఛాన్సును అంగీకరించడంలేదు; తను మంచి భూమికను ధరిస్తూ, తన నటనతో ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టాలంటే పాత్రపై గురి చాలా అవసరం; అందుకే పాత్రలను పరిమితం చేసుకుంటున్నాడు; అదిగాక యిప్పుడు బాధ్యత పెరిగింది — ఏమిటా బాధ్యత అని మీరు అడుగుతారుగా! అదే దర్శకత్వం; నటుడిగ వచ్చిన పద్మనాభం రేఖా అండ్ మురళీ ఆర్ట్సు చిత్రసంస్థకు అధినేత అయ్యాడు, 'దేవత', 'మర్యాద రామన్న' 'పొట్టి ప్లీడరు' చిత్రాలను నిర్మించిన పద్మనాభం నిర్దేశకుడు;



'ఎవరు మొనగాడు'లో రామ్మోహన్, రాజశ్రీ, మీనాకుమారి, చలం.

సూక్ష్మగ్రాహి, పరోపకారి, క్రమశిక్షణకు కట్టుబడ్డవాడు, వృత్తిలో దీక్షగల పద్మనాభానికి మున్ముందుకూడ ఆంధ్ర ప్రేక్షకుల ఆదరణ, అభిమానం తప్పక లభిస్తాయనడం నిర్వివాదాంశం.

పరిశ్రమలో రెండున్నర దశాబ్దాల సినిమా అనుభవం గడించిన పద్మనాభం కృషి మెచ్చుకోదగినది.

—శ్రీనివాస్

సహజమైన నటనతో పాత్రకి రూపకల్పన

కె. ఆర్. విజయను వీనస్ స్టుడియోలో శ్రీ దేవికంబైన్స్ షూటింగులో కలిశాను; ఆమెతో నాకు వున్న పరిచయం చాలా తక్కువే అయినా నన్ను చూడగానే 'రాండి, రాండి' అని పిలవడంతో ఆమె దగ్గరగా వున్న కుర్చీలో కూర్చుంటూ 'అదేమిటమ్మా, రాండి అంటే యేమిటి' అని అడిగాను. దానికి ఆమె నవ్వి 'తమాషగ అన్నాను, రండి అని అనలేక కాదు' అని చెప్పింది; మీరు 'శక్తి' చిత్రాన్ని చూశారా? ఆ పాత్రను సాధన పోషించిందిగదా! మీరు ఆ పాత్రను యెలా పోషించదల్చుకున్నారు!' అని ప్రశ్నించాను: 'ఆమె మంచి నటి అని అంగీకరిస్తాను; కాని నేను నా సహజమయిన నటనతో ఆ పాత్రకు రూపకల్పన చేస్తాను; చేసి ప్రేక్షకుల్ని మెప్పిస్తాను' అని చెప్తుంటే ఆమె ఆత్మ విశ్వాసానికి, వృత్తిలో ఆమెకు గల పట్టుదలకి ఆశ్చర్యపడ్డాను, 'అమ్మా రెడీ' అన్న పిలుపుతో 'రండి సెట్టులోకి వెళ్దాం' అని అన్నదామె.

సెట్టులో ఒక మంచం వుంది; మంచం పై పండరీబాయి పడుకుని వుంది: కె. ఆర్. విజయ ఆమె దగ్గరగా వెళ్ళి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంది; విజయతో పండరీబాయి యిలా చెప్పసాగింది.

పండరీబాయి : మా రామును గురించి నాకు బాగా తెలుసమ్మా! ప్రాణం పోయినా సరే నా బిడ్డ అబద్ధం ఆడడు.

విజయ : రాము మంచితనం గురించి నాకు తెలుసండి! కాని పరిస్థితులే మనిషి నొక్కొసారి ప్రక్క దారి పట్టిస్తాయి.

పండరి : అంటే మీ వుద్దేశం?

విజయ : మరేమిలేదు; ఆ రాజా కూడా ఒక తల్లిబిడ్డే; అతనికి అన్యాయం జరగడం మనకు శ్రేయస్కరం కాదు; ఆలోచించండి.

విజయ : నిజం బయటపెట్టి నిర్దోషిని కాపాడమని కోరడానికే వచ్చాను; నమస్కారమండీ వస్తాను.' అంటూ కె. ఆర్. విజయ వెళుతూ వుండగా రాము లోనికి వచ్చాడు; ఒకరినొకరు మాటగా చూసుకున్నారు. ఈ సన్నివేశం శ్రీ దేవి కంబైన్స్ తెలుగులో నిర్మిస్తున్న 'శక్తి' చిత్రంలోనిది; రాముగా రాంమోహన్ నటిస్తున్నాడు. కె. ఆర్. విజయకు, పండరీబాయికి గల సంబంధం యేమిటి ? రాంమోహన్ చేసిన నేరం యేమిటి ? అన్న ప్రశ్నలకు 'భలే అబ్బాయిలు' సమాధానం యిస్తుంది. పేకేటి దర్శకత్వంలో నిర్మించ బడుతున్న యీ చిత్రానికి పినిసెట్టి సంభాషణలు వ్రాశాడు: తోట సుబ్బారావు నిర్మించే యీ చిత్రం



'చెల్లెలి కోసం'లో కృష్ణ, చంద్రకళ.

సినిమా

సినిమా డైరీ

● మురుగన్ ఫిలింస్ నిర్మిస్తున్న "మూగనోము" షూటింగు ఎ. వి. ఎం. స్టుడియోలో నవంబరు 11 నుండి 17 వరకు యోగానంద్ దర్శకత్వంలో జరిగింది. నాగేశ్వరరావు, జమున, రంగారావు, రాజనాల పాల్గొన్నారు.

● గౌరి ఆర్ట్సు పిక్చర్స్ నిర్మిస్తున్న "దేవుడిచ్చిన భర్త" షూటింగు గోల్డెన్‌లో నవంబరు 6 నుండి 12 వరకు జరిగింది. క్లయిమాక్సు దృశ్యాలను చిత్రీకరించారు.

● పి. ఎస్. ఆర్. పిక్చర్స్ నిర్మించే "సిపాయి చిన్నమ్మ కథ"లో రామకృష్ణ భయంకరమయిన కత్తిసాము చెయ్యడాన్ని దర్శకుడు సూర్యం వాహిని స్టుడియోలో చిత్రీకరించారు.

● వీనస్ స్టుడియోలో సావిత్రి దర్శకత్వంలో ఎ. కె. వేలన్ నిర్మిస్తున్న "చిరంజీవి" షూటింగు నవంబరు 6 నుండి 10 వరకు జరిగింది. చలం, రామకృష్ణ, ప్రభాకరరెడ్డి, విజయభాను, ఆంజనేయులు పాల్గొన్నారు.

● గోపాలకృష్ణా పిక్చర్స్ నిర్మించే "కథానాయకుడు" చిత్రంలో జయలలిత చేసిన మూడు నృత్యాలను ప్రసాద్ స్టుడియోలో హేమాంబరధరరావు నవంబర్ 9 నుండి 14 వరకు షూట్ చేశారు.

● రాజా పిక్చర్స్ నిర్మిస్తున్న ద్వితీయ జానపదంయొక్క మొదటి పాటను వేటూరి వ్రాశారు. బాలసుబ్రహ్మణ్యం, జానకి సత్యం సంగీతసారధ్యంలో ఎ. వి. ఎం. స్టుడియోలో పాడారు.



'గ్రామదేవతలు'లో రాజసులోచన.

మహాశివర్మాత్రి పర్వదినాన జ్యోతిఫిలింస్ ద్వారా విడుదలౌతుంది.

రెండు మంచిపాత్రలు

విజయితో మాట్లాడినస్తుంటే హాస్య నటుడు చలం యెదురయ్యాడు. 'ఏమిటండీ చలంగారూ, మరీ లావెక్కుతున్నారే' అని అడిగాను; 'అదేనయ్యా ఆలోచిస్తున్నాను. తగ్గాలిమరి' అని చెప్తూ 'సత్తెకాలపు సత్తెయ్య' చిత్రం రష్ యేమయినా చూశావా' అని అడిగాడు; 'చూశానయ్యా, చిత్రం ప్రతి ఫ్రేంలో నువ్వే వున్నావే; ఆవరసాలను యీ పాత్రలో చిందించిన నీకు మంచి పేరువస్తుంది. అమాయకత్వం అభిమానం, అనురాగం మిళితమయిన సత్తెయ్యగా చాలా సహజంగా నటించావు;

సినిమా

అన్నాను. 'ఇదొక్కటే కాదు — మరొకటి వుంది అని చెప్పాడు;' అదేగా 'చిరంజీవి' చిత్రంలోని పాత్రను గురించేగా అన్నాను; 'అవును' అని తలూపాడు; సావిత్రి దర్శకత్వంలో తయారౌతున్న 'చిరంజీవి' చిత్రంలో చలం పోషించే పాత్ర కూడ సత్తెయ్యలాంటిదే; కానీ మొదటిది అమాయకత్వంతో కూడుకున్న పాత్ర; రెండోది అమాయకంగావుంటూ వేదాంతిగా మారే పాత్ర; రెండింటికిగల వైవిధ్యాన్ని చలం చాల చక్కగా చూపించగలాడుఅని నేనంటే సరిపోతుందా! ఆ తీర్పు మీ ద్వారావస్తే అతనికి మంచి జరుగుతుంది



'బందిపోటు దొంగలు'లో కాంచన, జగ్గయ్య.

స్త్రీలకి అహంకారం


అహంభావం శత్రువులు

చలం భావనారాయణగారి ఆఫీసుకి వెళ్తుంటే నేను అతన్ని వెంబడించాను; గౌరి పిక్చర్స్ ఆఫీసులో యెప్పుడూ సందడి గానే వుంటుంది; ఆరోజు కూడా భావనారాయణ గదిలో నిర్మాత ఆజం, డ్యాన్స్ డైరెక్టరు చోప్రా, దర్శకుడు రవి కూర్చుని యేదో చర్చిస్తున్నారు; నన్ను చూడగానే రండి రండి అని లోపలికి ఆహ్వానించాడు; వెళ్ళి కూర్చోగానే 'దేవుడు యిచ్చిన భర్త' చిత్రంపై మీ అభిప్రాయం యేమిటి' అని అడిగాడు; చాలా బాగుంది అన్నాను; 'మొహమాటంగా చెప్పొద్దు' అన్నాడు; 'లేదండీ — ఈమధ్య వస్తున్న జానపద చిత్రాల్లో కథకన్నా మిగతా వాటికి యెక్కువ ప్రాధాన్యత యిచ్చినట్టు కన్పడింది—కానీ 'దేవుడిచ్చిన భర్త' జానపదమేనయినా చక్కటి నీతిని ప్రబోధించే కదానస్తువు కన్పడుతూవుంది; ముఖ్యంగా స్త్రీలకు అహంకారం, అహంభావం శత్రువులు అని చాటే చిత్రం యిది' అన్నాను. 'మిమ్మల్ని ఒకమాట అడగాలనివుంది, అడగొచ్చా' అన్నాను; 'ఆహా నిరాక్షేపణీయంగా అడగొచ్చు;' అన్నాడు. మరేం లేదు — మీలాంటి అనుభవజ్ఞులు, వ్యాపార దక్షతగలవారు యింకా హిందీ చిత్రాలను నిర్మించవూనుకోలేదేం' అని ప్రశ్నించాను; 'నిజమే — నేను అదే ఆలోచిస్తున్నాను; ముందు తెలుగు, హిందీ చిత్రాలను నిర్మిస్తే బాగుంటుంది అని వూహిస్తున్నాను; కన్నడ మార్కెట్టు ప్రోత్సాహకరంగా కన్పడడంలేదు' అన్నారు.

'దేవుడిచ్చిన భర్త' చిత్రంతోపాటు లవ్ యిన్ ఆంధ్రా' 'మనవూరు' చిత్రాల షూటింగు గోల్డెన్ స్టుడియోలో జరుగుతూ వుంది; ఇవిగాక 'ప్రేమకి పర్మిట్' చిత్రం స్క్రిప్టు తయారుగావుంది; మొదటి చిత్రానికి పద్మరాజా దర్శకుడు; మిగతా రెండింటికి రవి దర్శకుడు; నాల్గవ చిత్రానికి సేకెటి దర్శకుడు; ఈ నాల్గుకాక 'సింహస్వప్న'కు జి. వి. జి. రచన సాగిస్తున్నాడు.

ఆవేశంలో కొట్టినందుకు ఐదురూపాయలు

భావనారాయణ ఆఫీసు నుండి వస్తుంటే రాజబాబు యెదురొచ్చి తన కారులో కర్పగం స్టుడియోకి తీసికెళ్ళాడు. స్టుడియోలో నిర్మాత సుంకువల్లి సాదరంగా ఆహ్వానించి సెట్స్కు దారి తీసారు; లోపల కృష్ణ మేకప్‌తో సెట్‌కు రెడీగా వున్నాడు; దర్శకుడు గోపాల్‌క్రిష్ణన్ 'కమాన్, క్విక్ క్విక్' అంటూ రాజబాబును ఆదేశించాడు; 'ఇదో వంచుతేవే సార్' అని గ్రీన్ రూంలోకి వెళ్ళి కరెక్టుగా వదిమిషాల్లో గెటప్‌తో రెడీ అయ్యాడు; కోరమీసాలతో, మెడలో పూసలదండతో చేతిలో ఒక కర్ర పెట్టుకుని, షీనా కుమారి భుజంపై చేయి మోపుతూ కృష్ణ దగ్గరికి వచ్చాడు; వాళ్ళను చూచి కృష్ణకు నవ్వు ఆగలేదు; ఏయ్, ఎంత ఆ దండ' అని అడిగాడు; 'అబ్బె ఎంతో లేదు — రెండు రూపాయలు మాత్రమే' నన్నాడు రాజబాబు; 'ఈ వెధవ దండ వెల రెండు రూపాయలా; అర్ధ రూపాయి యిస్తాను' అంటాడు కృష్ణ; నీవు కొనే దానికైనా బేరమాడడం; మొగాడు వచ్చాడయ్యా పెద్ద కొనడానికి; చాలు చాల్లే వయ్యా' అంటూ కృష్ణను రెచ్చకొడ్తాడు రాజబాబు; కృష్ణకు ఒళ్ళు మండింది; రాజబాబును ఆ చెంప, యీ చెంప వాయించేసాడు; వెంటనే 5 రూపాయలు యిస్తాడు; మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు! ఇదేమిటి దండకు అర్ధరూపాయి యిస్తానన్న కృష్ణ యిప్పుడు 5 రూపాయలిచ్చాడేమిటి అని? అక్కడే వుంది కిటుకు ఆవేశంలో కొట్టేస్తాడు కృష్ణ; దానికి పరిహారంగా 5 రూపాయలివ్వడం అలవాటు చేసుకున్నాడు; కృష్ణ చేసుకున్న అలవాటు మంచిదేనా, దానివల్ల యేర్పడే పరిస్థితులేమిటి అనేది ప్రశ్నలకు శ్రీరాజ్ ఆర్టుఫిలింస్ చిత్రం సమాధానం యిస్తుంది. సావిత్రి, రామారావు నాయకీ, నాయకులుగా నటించే యీ చిత్రం వదిరోజుల్లో తయారైంది; భమిడిపాటి రాధాకృష్ణ సంభాషణలను, టి. వి. రాజు సంగీతాన్ని, సంపత్ ఛాయాగ్రహణాన్ని, దేవరాజన్ కూర్పును, పాణి సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్న యీ చిత్రాన్ని



దేవుడు యిచ్చిన భర్త'లో ఒక దృశ్యం.

సుంకువల్లి నిర్మిస్తున్నాడు. ఈ నెలలో మైసూరు ప్రాంతాల్లో ఔట్‌డోర్‌ను జరుపనున్నారు; శీలా, శోభన్‌బాబులు పాల్గొనే ప్రేమ సన్నివేశాలను యీ షెడ్యూలులో చిత్రీకరిస్తారు.

ప్రతివ్యక్తికీ ఆరుగంటల విశ్రాంతి చాలు

కర్పగం స్టుడియోనుండి ప్రసాద్‌కు వెళ్ళాను; ప్రసాద్ స్టుడియోలోకి నేను వెళ్ళడం, జయలలిత కారుదిగడం యేకంగా జరిగాయి; గ్రామీణ యువతి గెటప్‌లో జయలలితను చూస్తుంటే అంతకు క్రితంరోజు ఆధునాతన వేషంలో చూచిన జయలలితను మర్చిపోయాను; ఇంత చిన్నవయస్సులో తారాస్థాయి నందుకున్న ఒకే ఒకనటి జయలలిత అనడంలో ఆశ్చర్యమూ, అతిశయమూ లేదనుకుంటూ; ప్రతిరోజూ వదహారుగంటలు పనిచేస్తూ, మూడుచిత్రాల షూటింగులకు హాజరయ్యే జయలలిత ప్రస్తుతం 21 చిత్రాల్లో నటిస్తోంది; ఆమె దగ్గరికివెళ్ళి 'మీకు విశ్రాంతి అవసరంలేదా అని అడిగాను; దానికి ఆమె నవ్వి 'నాకు విశ్రాంతి అవసరమే. ప్రతివ్యక్తి రోజుకి ఆరుగంటలు రెస్టు తీసుకుంటే చాలు. అప్పుడే శరీరం మనం చెప్పినట్లు నడుస్తుంది; నేను ప్రతి పనిని డిసిప్లెన్డ్‌గా చేస్తాను' అంది; జయ



'సత్తెకాలపు సత్తెయ్య'లో విజయలలిత.

లలిత తమిళంలో శివాజీ గణేశన్, ఎం. జి. రామచంద్రన్‌లతోను, తెలుగులో నాగేశ్వరరావు, రామారావులతోను నాయికగ నటిస్తుంది; ఆమె దగ్గర్నుండి నిర్మాత గోపాలక్రిష్ణ వద్దకు వెళ్లాము; "'కథానాయకుడు' చిత్రాన్ని చాలా హిట్‌గా తీస్తున్నాను; అసభ్య శృంగారమో, అనవసర సన్నివేశమో కానరాదు మా చిత్రంలో; పాటలుకూడ నేటి సాంఘిక జీవిత ప్రయోజనానికి తగ్గట్టు వ్రాయబడ్డాయి. మా చిత్రాన్నిగురించి నేను చెప్పడంకన్నా మీరు చూసి వ్రాస్తే మంచిదనుకుంటా" అని నిర్మాత గోపాలక్రిష్ణ ముగించారు. దర్శకుడు హేమాంబరధరరావు, లోపల బిజీగా వుండడంవల్ల అయన్ను డిస్టర్బ్‌చెయ్యడం దేనికని నా మాపును యింటివైపు మరల్చాను.

నటిస్తూ నేర్చుకొన్న విద్య

వెళ్తూ వెళ్తూ దారిలోవున్న పద్మనాభం యింటికెళ్ళి పోయాను; అప్పుడే 'వరకట్నం' షూటింగుమండి వచ్చిన పద్మనాభం యింట్లోకయినా వెళ్లకుండా నాతో ముచ్చటించడం మొదలెట్టాడు; 'ఏమండీ పద్మనాభంగారు, 'శ్రీరామకథ' యెప్పుడు రిలీజు చెయ్యదల్చుకున్నారు' అని అడిగాను. 'డిసెంబరులో చేస్తానండి; అన్నాడు; 'పిక్చర్ చాలా బాగా వచ్చిందని చూసినవాళ్లంతా చెప్తున్నారే, మీకు దర్శకత్వంలో యింత అనుభవం యెక్కడిది' అని ప్రశ్నించాను. 'ఇది నా స్వానుభవం అనుకుంటున్నారా! కాదండి. నేను అనుభవజ్ఞులయిన దర్శక శ్రేష్ఠులవద్ద నటించడం మూలాన వారు యెలా సన్నివేశాల్ని చిత్రీకరించేవారో క్షుణ్ణంగా గ్రహించగల్గాను; నాకు దర్శకుణ్ణి కావాలనేడి ఆశ చాలాకాలంగా వుండేది; అందుకే దర్శకత్వ శాఖను మొదట్నించి పరిశీలించేవాణ్ని; దాని ఫలితంగా నేను ఆ శాఖలో నేర్పును సంపాదించాను; ఆ నేర్చుకున్న నేర్పుతో నా నేర్పును జోడించి నా చిత్రాన్ని సర్వాంగ సుందరంగా చిత్రించాను; మున్ముందు యెక్కువ చిత్రాల్లో నటించడం కూడ మంచిది కాదనుకుంటాను; అందుకే నాకు నచ్చిన పాత్రలను ప్రేక్షకులు మెచ్చేవిధంగా నటించి నా జీవితాన్ని సార్థక పర్చదల్చుకున్నాను' అని ముగించాడు. నేను

సినిమా

షూటింగ్ సమయంలో అంజలి పిక్చర్స్ వాళ్లు షూటింగు వుందని ఫోను వచ్చింది; 'టైం అయిందండీ. భోంచేసి మళ్లీ షూటింగుకు వెళ్లాలి, వస్తామరి' అని లోపలికి దారితీసాడు.

శివాజీ గణేశన్ కుమార్తె వివాహం

నవంబర్ 3 ఆదివారం; స్థలం అబట్స్‌బరీ కళ్యాణమండపం; సమయం ఉదయం ఏడుగంటల పదినిమిషాలు — రంగు రంగుల కార్లతో, ఘుమఘుమలాడే సువాసన ద్రవ్యాల పరిమళింపుతో కళ్యాణమండపం స్వర్గలోకాన్ని మరపించింది; ఏమిటి విశేషం అని మీకు తెలియాలిగా. ప్రముఖ నటుడు శివాజీగణేశన్ తన సీమంతి పుత్రిక శాంతినాయకి వివాహాన్ని ఆడంబరంగా జరిపాడు. మండపంకు వెళ్లేప్పుడు రోడ్డుకు యిరువైపులా వివిధ రకాల ఫల, పుష్ప గుచ్ఛాలు వ్రేలాడుతూ వున్నాయి; చలనచిత్ర పరిశ్రమలోని మహామహులందరూ విచ్చేసి వధూవరుల్ని ఆశీర్వదించారు. తమిళరంగ ప్రముఖులేగాక తెలుగు కథానాయకుడు నాగేశ్వరరావు హైదరాబాదునుండి, హిందీరంగాన్నుండి రాజేంద్రకుమార్, లతామంగేష్కర్, రవి,



'కథానాయకుడు'లో జయలలిత.

మీకు తెలుసా?

ప్రముఖ నటుడు అశోక్ కుమార్ తన కనిష్ఠ సోదరుడు కిశోర్‌కుమార్ దర్శకత్వంలో మొట్టమొదటి సారిగా ఒక ముఖ్య భూమికను పోషిస్తున్నాడు.

మలయాళ నటి షీలా ఔట్‌డోర్ దృశ్యాల చిత్రీకరణకు వెళ్లేటప్పుడు జేబీ కాయలను కొసిటినడం అలవాటు.

ప్రముఖ నటుడు వి. సి. గణేశన్‌కు శివాజీ గణేశన్ అనే పేరు ప్రసాదించినది తమిళరాజ్య ముఖ్యమంత్రి శ్రీ సి. అన్నాదురై. ఆయనచే వ్రాయబడ్డ 'శివాజికండ హిందూ సామ్రాజ్యం' నాటకంలో శివాజీపాత్రను అమోఘంగా పోషించడంవల్ల ఆ పేరు యివ్వబడింది.

ఇప్పుడు డి. ఎం. కె. లో ప్రముఖుడిగా వుండే ఎం జి ఆర్. ఒకప్పుడు కాంగ్రెసు వాది; ఇప్పుడు కాంగ్రెసును అభిమానించే శివాజి ఒకప్పుడు డి. ఎం. కె. అభిమాని.

సంజీవ్‌కుమార్ ప్రత్యేకంగావచ్చి వీరి జీవుల్ని సౌభాగ్యవంతులుగా వుండాలని అక్షింతలు చల్లారు.

విచిత్రమైన కార్యక్రమం


ప్రముఖ నటి అంజలీదేవికి యిటీవల కడుపులో ట్యూమర్ ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. డాక్టర్లు పూర్తి విశ్రాంతి అవసరమని అంజమ్మకు చెప్పారు. ప్రస్తుతం అడయారులోని తన స్వగృహంలో స్వస్థత నందుకుంటూ వుంది. ఆమెను చూచి వస్తామని బయల్దేరి వెళ్లాను. అప్పుడే రీ—రికార్డింగుమండి తిరిగివచ్చిన ఆదినారాయణరావు నన్నుచూచి

అంజలిచేసిన విచిత్రమయిన కార్యక్రమాన్ని గూర్చి వివరించేసరికి ఆమెపై సానుభూతి, ఆశ్చర్యం కల్గింది. ఆమెచేసిన 'పని' యేమిటో మీకూ చెప్పాలిగ! కార్తీక సోమవార వ్రతాన్ని ఆచరించడమే. అంటే ఉదయం మంగళస్నానమాచరించి ఆ రోజంతా ఉపవాసం వుండడం అన్నమాట. ఇంకా ఆరోగ్యం మామూలు పరిస్థితికి రాలేదు; అంతలోనే యింతపనా అని ఆది



MODEL: COURTESY AIR-INDIA

గాఢమైన నిద్రకు గాలిని పీల్చుకొనే పరుపు మీద నిద్రపోండి!



కర్ల్-ఆన్ పరుపులోనికి గాలి వెడుతుంది. కనుక మీరు కర్ల్-ఆన్ పరుపు మీద దొర్లినపుడు, మీ దేహముతో వేడి ఎక్కిన గాలి పైకి పోతుంది, తాజాయైన గాలి లోనికి వెళ్లి మీరు చల్లగా, సౌఖ్యముగా నిద్రపోగలుగుతారు.

శాస్త్రరీత్యా చుట్టబడిన లక్షలాది పీచు స్ప్రింగులకు లేటెక్స్ రబ్బరు మిశ్రమము చేయబడి ఋమిడికైన, ముడతలుపడని, సౌఖ్యవంతమైన కర్ల్-ఆన్ పరుపు తయారుచేయబడినది. ఆధునికమైన పరుపులలో కర్ల్-ఆన్ పరుపు ధర చాల తక్కువ. ఆరోగ్యశాస్త్రరీత్యా అతి మెత్తని పరుపు మంచిది కాదు. దానితో ప్రొద్దున్నకు వీపు అంతా నొప్పి పెట్టవచ్చును. కర్ల్-ఆన్ పరుపు సౌఖ్యమునకు తోడు ఆరోగ్యపు దృష్ట్యా కూడ సరియైనది.

విశిష్టమైన కర్ల్-ఆన్ చేకూర్చే లాభములు:

- దీనిమీద నల్లులు, బొద్దింకలు మొదలైనవి చేరవు
- దీనిని కడగవచ్చును
- ఇది ముడతలు పడదు.

Kurl-on

కర్ల్-ఆన్ పరుపు

- ఎంతో సౌఖ్యముగా ఉండేటంత మెత్తనిది
- ఆరోగ్యమునకు తగినంత గట్టిది
- తక్కువ ధర-మీరు కొనుక్కోగలరు!

everest/92/CIP TEL


ఇతర ఉత్పత్తులు: ఫర్నిచర్‌కు కుషన్ బ్లాకులు— స్పెషల్ ప్యాకింగ్ మెటీరియల్స్— ఏర్ కండిషనర్ ఫిల్టర్స్ వగైరా.

లభించు స్థలములు:— **స్టాకిస్టులు: మద్రాసు:** మనోహర్ ఏజెన్సీస్, 163/15 లాయడ్స్ రోడ్, రాయపేట. స్పెన్సర్ & కంపెనీ లిమిటెడ్‌యొక్క బ్రాంచీలు. * **కోయంబత్తూరు:** ఎస్. మహాలింగం & కో., జెయిల్ రోడ్. * **మధురై:** పయొనియర్ ఏజెన్సీస్, 46, టౌన్‌హాల్‌రోడ్ * **తిరుచిరాపల్లి:** బాలాజీ ఏజెన్సీస్, 4, చిన్నకడై వీధి. * **సేలం:** వేలు కార్పొరేషన్, 47-బి, I వ అగ్రహారం. * **చిత్తూరు** ఎస్. గోపాల రెడ్డి & కంపెనీ, బజారు వీధి. * **రాజమండ్రి:** ది సర్వారాయ ఏజెన్సీస్, మెయిన్ రోడ్. * **హైదరాబాద్:** కనరా ఇండస్ట్రీస్ (హైదరాబాద్) 3-4-424, నారాయణగూడ. * **విజయవాడ:** బి. శంకర్ లాల్ & కంపెనీ, ఏలూరు రోడ్. * **బెంగుళూరు:** గీ గీతా పోర్ట్స్ (ఏజెన్సీస్), మెజస్టిక్ సర్కిల్.

ప్రతినిధులు లేని ప్రాంతములకు వ్యాపార వివరములకై వ్రాయ గోరడమైనది.

దరఖాస్తులను కుర్ల్-ఆన్ సేల్స్ ఆఫీసు, 6, మాధవ నగర్, బెంగుళూరు-1 కి పంపండి.

పరిచయం



రచయిత

దాసం గోపాలక్రిష్ణ

"చిల్లరకొట్టు చిట్టెమ్మ" నాటక రచనకు ఆంధ్రనాటక కళాపరిషత్తుచే ఉత్తమ బహుమతి నందుకున్న అభ్యుదయ రచయిత దాసం గోపాలకృష్ణ, విద్యార్థి దశలో ఏకాంకిక నాటకలు వ్రాసేవాడు, తను వ్రాసినదాన్ని పెద్దలకు చూపించి వారి సలహాలను తీసుకునేవాడు. ఫలితంగా ఒక్కొక్క నాటకరచనలో అభివృద్ధిని చూపించేవాడు.

ఒకరోజు ప్రముఖ దర్శకుడు గుత్తా రామినీడు యితగాడి "చిల్లరకొట్టుచిట్టెమ్మ" నాటకాన్ని చదివి, రచయిత స్టైలిని, కథావస్తువును మెచ్చుకుని, యీ యువకుని సినిమారంగానికి "భక్తపోతన" చిత్రం ద్వారా పరిచయం చేసాడు.

రచనలోనయితేనేమి సలహాలను యివ్వడంలో నయితేనేమి, నాకు యితోధిక మయిన ప్రోత్సాహాన్ని యిస్తున్న రామినీడు నాకు "తోడు—నీడ" అంటాడు గోపాలకృష్ణ.

మొదటిచిత్రం పౌరాణికమయినప్పటికీ,సంభాషణలను పుష్టికరంగా వ్రాయగల్గాడు. "పోతన" తర్వాత అనారోగ్యకలంగా స్వస్థలం వెళ్ళాడు. మరలా బాలా ప్రొడక్షన్స్ ప్రారంభించబడ్డప్పుడు రామినీడుచే మద్రాసుకు రప్పించబడ్డాడు. దాసంనుండి వెలువడ్డ రెండవవంట "బంగారు సంకెళ్ళు".

వయస్సు ముదరక పోయినా, కలంలో అనుభవం కన్పడుతూంది, మనస్సు తన వృత్తిపై కేంద్రీకరించవేసి, ఉత్తమ రచనలు వ్రాయడానికి పూనుకుని తన రచనాశక్తితో అందర్ని అనురక్తిని పొందడానికి యత్నించాలి.

సినిమా

నారాయణరావును అడిగాము. ఆయన యిలా చెప్పారు. 'అంజలీదేవికి దైవభక్తి మెండు; ఆ భక్తి పారవశ్యంలో ఆమెకు యెవరు యేం చెప్పినా వినిపించుకోదు; ఆ భగవన్నామ స్మరణలో ఆమెకు కల్గే తృప్తి అనిర్వచనీయమైనది' అని ముగించారు. అంజలీదేవి ముఖ్యపాత్ర ధరించి, నిర్మించిన 'కుంకుమ భరిణె' నవంబరు 15 న లక్ష్మీ ఫిలింస్ద్వారా ఆంధ్రలో విడుదల కాబోతున్నది.

నిర్మాత హఠాన్మరణము

బాలా ప్రొడక్షన్స్ నిర్మించిన 'బంగారు సంకెళ్లు' బాక్సాఫీస్ దగ్గర బాగానే పోతుంది; రామినీడు దర్శకత్వాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు; వసూళ్ళు రోజు రోజుకి ఆశాజనకంగా వున్నట్టు తెలుస్తుంది; ఇంతవున్నా నిర్మాత కుమారులకయితేనేమి, దర్శకుడి కయితేనేమి, బాలాయూనిట్ కయితేనేమి సుఖంలేదు — శాంతిలేదు—సంతోషంలేదు; అందరి వదనాలు విచారంగా వున్నాయి; కారణం — నిర్మాత సత్యనారాయణ హఠాన్మరణమే; చిత్రం నవంబరు 1 న విడుదలైంది; సత్యనారాయణ హైద్రాబాదుకు వెళ్ళాడు; అక్కడ రిపోర్టు బాగావుందని తెల్సుకుని అక్కడినుండి విజయవాడకువచ్చి అక్కడి కలెక్షన్సు చూచుకొని, గుంటూరు,తెనాలి థియేటర్ల పరిస్థితిని పరిశీలించి ఆ రోజు రాత్రి ఏలూరుకి తిరిగివచ్చి, స్నేహితులకు విందునిచ్చి యింటికివెళ్ళి పడుకున్నారు; పడుకున్న తర్వాత అర్ధరాత్రప్పుడు గుండె నొప్పిగా వుందని అన్నారట. డాక్టర్ని పిలవమంటారా అని అడిగితే—యిప్పుడు వద్దులే, ఉదయం చూచుకుందాం అని చెప్పారట. విధి వైపరీత్యం చూశారా! సరిగ్గా తెల్లవారుజాము నాలుగున్నర గంటలకు మరల గుండె పోటు రావడం, డాక్టరు రావడం, బ్లడ్ ప్రెషర్ పరీక్షించబోవడం—పరీక్ష కాకుండానే గుండె ఆగడం—ప్రాణాలు పోవడం ఒక్క క్షణంలో జరిగిపోయింది. అప్పటి వరకు సంతోష తరంగాల్లో తేలియాడుతున్న బాలా ప్రొడక్షన్స్ బృందం దుఃఖ సాగరంలో మునిగిపోయారు. శ్రీ సత్యనారాయణ మంచివాడు, మితభాషి, పరోపకారి, యీ చిత్ర పరిశ్రమకు సత్యనారాయణ లాంటి మంచివాళ్ళు యెంతైనా అవసరం; కానీ యేంచేస్తాం — దైవం చిన్నచూపు చూసింది.

కొత్త చిత్రాల్లో పాటలు

త్వరలో సెట్స్కువెళ్ళనున్న కొన్ని కొత్త చిత్రాలకు సంబంధించిన కొన్నిపాటలు రికార్డు చెయ్యబడ్డాయి. ఆ పాటలు యేయే చిత్రాల్లో, యెవరెవరు పాడారో మీకు తెలియచేస్తాను.

'ఎవరో యీవాడు నా మదిలో చేరెనులే;
నాలో నీ కలలన్నీ నిజమై ఆడెనులే'

అనే పాటను దాశరథి వ్రాశారు; ఘంటసాల సంగీత నిర్దేశకత్వంలో సుశీల పాడింది; శ్రీదేవి కంబైన్స్ నిర్మించే సాంఘిక చిత్రంలో కె. ఆర్. విజయపై యీ పాట చిత్రీకరింపబడుతుంది.

'చూస్తే ఏముందోయ్ రాజా;
జల్సాచేస్తేనే వుంది మజామజా!'

ఈ పాట డి. బి. ఎస్. అండ్ దేగా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'అన్నదమ్ములు' చిత్రంలోనిది; ఆరుద్ర వ్రాసిన యీ పాటకు కె. వి. మహదేవన్ స్వరకల్పన చేసారు; ఎల్ ఆర్. ఈశ్వరి పాడింది; తెరపై, జ్యోతిలక్ష్మి నాట్యంచేస్తుంది.

'ఓ కలలుగనే కమ్మని చిన్నారీ
నీ సొగసులన్నీ నావే వయ్యారీ
ఓ కొంటెచూపు చూసే చెలికాడా
నా వయసు సొగసుదోచే మొనగాడా'

అంటూ సుశీల, బాలసుబ్రహ్మణ్యం సత్యం సంగీత సారథ్యంలో పాడారు; రవిచిత్ర



'అదృష్టవంతులు'లో నాగేశ్వరరావు, జయలలిత, బేబీరాణి.

...క్లైం చిత్రానికిగాను పై పాటను దాశరథి వ్రాశారు: తెరపై కృష్ణ, విజయనిర్మల నటిస్తారు.

'వయసు కుర్రది — వంపులున్నది
నైసు నైసుగ అయిసు వేస్తది'

అంటూ విజయలలిత పాడే ఈ పాటను రసవిద్రుతంగాను ఆరుద్ర వ్రాయగా ఎల్. ఆర్. ఈశ్వరి గానం చేసింది; సత్యం సంగీతాన్ని సమకూర్చాడు.

లక్ష్మీనారాయణ పిక్చర్స్ విఠలాచార్య దర్శకత్వంలో నిర్మిస్తున్న జానపద చిత్రానికి టి. వి. రాజు స్వరకల్పనలో రికార్డు చెయ్యబడ్డ పాటల్ని ఇక్కడ పొందు పరుస్తున్నాను.

'కొమ్మా కొమ్మా కులికినచోట
నువ్వే నువ్వే
కనుబొమ్మా బొమ్మా కలిసిన
చోట నువ్వే నువ్వే'

అని రామారావు ఎదుట విజయలలిత పాడుతుంది: సి. నారాయణరెడ్డి వ్రాసిన ఈ పాటను సుశీల కమ్మగా ఆలపించింది.



'పేదరాశి పెద్దమ్మ'లో
రాజనాల, విజయలలిత

సి. నారాయణరెడ్డి వ్రాసిన:

'కట్టోయ్ కట్టోయ్ గళ్లచీర
పెట్టోయ్ పెట్టోయ్ పెళ్లిబొట్టు'

'చుట్టోయ్ చుట్టోయ్ కొప్పుపాగా'

పాటను సుశీల, ఘంటసాల విజయలలిత రామారావులకుగాను పాడారు.

'ఏం బుల్లెమ్మా సౌఖ్యమేనా
చీర చీర వన్నెలోన ఎర్ర ఎర్ర
జీరలాయె
ఏం బుల్లోడా సౌఖ్యమేనా
వన్నెకాడ నిన్నుజూచి కన్నులన్నీ
ఎర్రనాయె'

అంటూ రామారావు, జయలలిత సరసాలాడ్తూ పాడే ఈ పాటను పి యూ రి వ్రాశారు: టి. వి. రాజు ఆధ్వర్యంలో ఘంటసాల, సుశీల పాడారు.

సుశీల కోయిలకంఠంద్వారా నారాయణ రెడ్డి వ్రాసిన మరొకపాటను జయలలిత పాడుతుంది. ఆ పాట ఇలా ప్రారంభం అవుతుంది.

'ఇక్కడవాడే
అక్కడవాడే
ఎక్కడ చూసిన వాడే వాడే
(ఎవరు...నా జతగాడే')

—శ్రీనివాస్

అప్పీ - యిప్పీ...

చెన్నపురి ఆంధ్ర విద్యార్థి సమితి కొత్త కార్యనిర్వాహక వర్గం

చెన్నపురి ఆంధ్ర విద్యార్థి సమితి వారు నవంబరు 11 న స్థానిక సెంట్రల్ బుహారీలో ఏర్పాటు చేసుకున్న సర్వసభ్య సమావేశంలో 1968–69 సంవత్సరానికి కొత్త కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి నగరంలోని అన్ని స్త్రీ, పురుష కళాశాలల ప్రతినిధులు హాజరైనారు. కొత్త కార్యనిర్వాహక వర్గంలో అధ్యక్షుడుగా శ్రీ టి. పి. కృష్ణ; ఉపాధ్యక్షులుగా శ్రీమతి పద్మ, శ్రీ గోపాలకృష్ణమూర్తి; కార్యదర్శిగా శ్రీ హరి కృష్ణమూర్తి; సహాయ కార్యదర్శులుగా కుమారి సుహాసిని, శ్రీ కుమారస్వామిరెడ్డి; కోశాధికారిగా శ్రీ మదనగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సభ్యుల సహకారానికి మాజీ కార్యదర్శి శ్రీ టి. నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం స్త్రీ కళాశాలలనుంచి సమితికి లభించిన సహకారానికి అధ్యక్షుడు వారికి కృతజ్ఞతలని తెలిపారు. అనంతరం కుమారి ప్రేమలతారెడ్డి వందన సమర్పణ చేశారు. (ఒ. వి.)

అఖిలభారత బాలబాలికల యువమహోత్సవం

అఖిలభారత స్థాయిలో 9వ యువ మహోత్సవం నవంబరు 24 నుంచి 26 వరకు లక్నోలో నిర్వహింపబడుతుంది. ఇందుకు అన్ని పాఠశాలలు, కాలేజీలు, యూనివర్శిటీల నుంచి విద్యార్థులు ఆహ్వానింపబడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆహ్వాన సంఘంలో వున్న ఈ ఉత్సవం భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవ సందర్భంలో అనేక కార్యక్రమాలు ఏర్పరుస్తారు. హాజరు కాదలచువారు జనరల్ సెక్రటరీకి రాసి వివరాలు పొందవచ్చును. రైల్వే కన్సెషన్లు, వసతి సౌకర్యాలు అతి చౌకలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరిగాయి. వివరాలకు: జనరల్ సెక్రటరీ, ఆలిండియా నైన్త్ చిల్డ్రన్ యూత్ ఫెస్టివల్, 12— స్టేషన్‌రోడ్డు, లక్నో— (యు. పి.).

సిండికేట్ బ్యాంకు కొత్త బ్రాంచీలు

సిండికేట్ బ్యాంకు అక్టోబరులో రెండు కొత్త బ్రాంచీలను నెలకొల్పింది. పూనాలోని శివాజీ నగర్‌లో ఒకటి, విజయవాడ బకింగ్‌హామ్ పేటలో మరొకటి. సిండికేట్‌బ్యాంకు బ్రాంచీలు ఇప్పటికి మొత్తం 242.

నవ్యకళాలయ

అక్టోబరులో "నవ్య కళాలయ" వారు మొదటి వార్షికోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 'పూలదోసెళ్లు' అనే నాటకాన్ని ప్రదర్శించారు.

ఉగాది కల్చరల్ అకాడెమీ

మద్రాసులోని ఉగాది కల్చరల్ అకాడెమీవారు నవరాత్ర్యుత్సవములు ఘనంగా జరుపుకున్నారు.

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హైదరాబాదు శాఖవారు మహాసభల్ని అక్టోబరు 4, 5, 6 తేదీల్లో ఘనంగా నిర్వహించారు. (ఒ. వి.)

సింథటిక్ డ్రగ్స్ రిక్రియేషన్ క్లబ్

హైదరాబాదులోని సింథటిక్ డ్రగ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నవంబర్ 2 వ తేదీన కూచిపూడి కళాక్షేత్రవారి భామాకలాపం నృత్యనాటిక ప్రదర్శింపబడింది. సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ యల్. కె. బెహల్ సత్యభామ పాత్రను పోషించిన శ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మని, తదితర పాత్రధారుల్ని అభినందించారు. ఈ ప్రదర్శన మామూలు ప్రేక్షకులనే కాకుండా సోవియట్ సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఆకట్టుకున్నది. అనంతరం 'మధురానగరిలో' తరగం ప్రదర్శింపబడింది. (ఒ. వి.)

* * *

బొంబాయిలోని జీవిత భీమాసంస్థ ప్రజాసంబంధాల అధికారిగా శ్రీ ఎస్. పి. నందా పదవీ స్వీకారం చేశారు. అంతకుముందు ఆ హోదాలో ఉన్న శ్రీ సి. ఎం. దేశాయ్ ప్రమోషన్ మీద డెప్యూటీ జోనల్ మానేజర్‌గా మద్రాసుకి బదిలీ అయినారు.

శ్రీ త్యాగరాజ సంగీత కళాసమితి

విజయవాడ గాంధీనగరంలోని శ్రీ త్యాగరాజ సంగీత కళాసమితివారి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచిక మా కార్యాలయం చేరింది. ఇందులో ప్రముఖుల అభినందనలు, వ్యాసాలు, సంస్థ కార్యకలాపాల వివరాలూ ఉన్నాయి.

పుస్తకాలు

పరుగులిడే చక్రాలు

ఒక ప్రసిద్ధ వారపత్రిక ప్లవంగ సంవత్సరంలో నిర్వహించిన నవలల పోటీలో రెండవ బహుమతి పొందిన నవల ఇది. అనేకమైన కారణాలవల్ల, పోటీలలో బహుమతులు పొందిన రచనలేమీ అంత ఉత్తమంగా ఉండడం లేదు. అందులోనూ అనన్య ప్రచారం గల ఆవారపత్రిక నిర్వహించేపోటీ లల్లో సర్వసామాన్యంగా ప్రథమ బహుమతి రచయిత్రులకే లభిస్తూ వుంటుంది. అది పరిశీలిస్తే ఈ నవలకు రెండవ బహుమతిలభించినా, ఆసంవత్సరం మొదటి బహుమతి పొందిన నవల కన్నా, గుణంలో కాని, రచనా విన్యాసంలో కాని, కథాగమనంలో కాని, తీసిపోయినదేమీకాదు. ఇంక ఉత్తమత్వం విషయంలో తన జాతికే చెందిన అన్ని నవలలకన్నా అన్ని విషయాల్లోనూ ఇది భిన్నంగా వుండి, పాఠకులకు సంతృప్తిని కల్గిస్తున్నది.

బ్రాహ్మణ కుటుంబపు సంప్రదాయపు గోడల మధ్య జన్మించిన, ఉత్తర సర్కారు పంటపొలాల్లో తోటల్లో బాల్యం గడిపి, సంస్కృతం చదువు కొని ఆర్థికంగా చితికి పోయే కుటుంబాన్ని ఆదుకోవాలని, ఉద్యోగాన్వేషణలో యాంత్రిక నాగ రకతా ప్రవాహానికి లోనై, కార్మికుడుగా, ఫైర్ మన్‌గా, ఇంజన్ డ్రైవరుగా మారిన ఒక నిజా యితీ పరుని జీవితగాథ ఇది. సనాతనా చారమూ, ఆధునిక సాంకేతిక ప్రగతి సీటిమధ్య ఇం టులో చక్కని సమన్వయం సాధింపబడింది. రమణయ్య పాత్ర పోషణలో రచయిత చక్కని పేర్పు చూపించారు. అతను భార్యాదాసుడు, స్వార్థపరుడు, లంచగొండి, కార్మిక వర్గ కారులకు బానిస. అట్టివాడు నరసింహం చేసిన ఉపకారంతో పునీతుడై, బాధ్యతారహిత్యం లోంచి అనురాగ పూరిత హృదయుడై, మనిషిగా బ్రతకడం మొదలెడతాడు. ఇంక నవలలోని ప్రధాన పాత్ర నరసింహం గురించి కాలుజార కూడదని, కర్తవ్య నిర్వహణ కఠోరమైనా చేసి తీర వలసినదని, గుండెలో అమృతమూ,మాటలో కండచక్కెరా నింపుకోవాలని అతని తాపత్రయం. స్వార్థాన్ని మరచి పరార్థం కోసం బ్రతికేపాత్ర. ఇంక నవలలో వచ్చే అనేకమైన ఇతర పాత్రలు శాంతమ్మ, వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ, మాధవరావు కొండయ్య, చిన్నదొర, కుమారవేలు, ఒక్కొక్క తత్వానికి ప్రతినిధులు . వారిలో మళ్లీ రక్త మాంసాలు గల పాత్ర కనకమ్మ. శరీరసౌఖ్యం లేక, కాంక్షాహతయై, అకోరిన మగవానిని పొంద లేక , అవసరార్థం ఇంటిలో నుండి లేచిపోయిన స్త్రీ. గోపాలం పాత్రలో కొంత 'ఎగ్జాగరేషన్' వుంది. జానకి పాత్ర చిత్రణలో హైందవ పాతివ్రత్యధర్మం ప్రతిపాదింప బడింది. కానీ అంతటిలోనూ శారదపాత్ర విషయంలోనే రచయిత ఇదిమిద్ధమైన గట్టి మనస్సు చేసుకో లేక పోయారు. ఆమెకూ శ్రీనివాసరావుకూ వివాహం నిశ్చయింప బడింది. శ్రీనివాసరావును ఆమె ప్రేమించినదీ లేనిదీ మనకు తెలియదు కాని, అతనిపై ఆమెకు అయిష్టంలేదు. అతని పూర్వానుభూతికి ఆమె దూరం కాదు. కానీ నరసింహం ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నాడన్న కారణం చేత, రచయిత శారదానరసింహాలకు ముడిపెట్టడం ఎబ్బెట్టుగా వుంది. దీనికి తోడు నవలలో రైలు పెట్టెలు బాగుచేసి ఇంజన్లను నడిపించే కార్మికుల జీవిత గతులను చిత్రించడం రాను రాను తగ్గిపోయి మామూలు సాంసారిక మైన నవలల పంథా త్రొక్కింది. పెళ్ళిళ్ల వర్ణన, పల్లెటూర్ల సౌందర్యం, గొప్పఇంటివారిల చిత్త ప్రవృత్తులు వాటితో పుటలు నిండి పోయాయి. అయితే శైలి చాలా సహజమైంది

ఆటలు

గెలుపు ఎంత ముఖ్యమో ప్రయత్నమూ అంత ముఖ్యం



40 ఏళ్ళుగా ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉండ ఒక్కసారి పడి పోతే! బాధగానే ఉంటుంది. అందు లోనూ రెండవస్థాన మయినా కాకుండా మూడవస్థానం దొరి కితే మరీ బాధ.... ఆస్ట్రేలియాతో వోడి పోయి హాకీలో కంచుపతకం తీసుకున్న భారతదేశం పరిస్థితి ఇలా ఉంది!

అయితే బాధగా ఉన్నంత మాత్రాన మన ఆటగాళ్లని తక్కువగా చూడటం తగునా? ఢిల్లీలో ఈ పని చేశారు. ఇంటికి తిరిగి వచ్చిన వారికి స్వాగతం చెప్పటానికి సరయినవారు రాలేదు. ఆటగాళ్లు ఢిల్లీలో దిగి వెనువెంటనే తమతమ వూళ్లకి వెళ్లి పోయారు.

ఈ రకం ముభావ ప్రవర్తన ఆటగాని తనాన్ని చూపదు. అదీకాక మెక్సికోలోనే వోటమి తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో కంటతడి పెట్టుకుని బాధపడిన ఆటగాళ్లకి ఈ అవ మానం దుర్భరంగా ఉండిఉంటుంది. అపజయం కన్నా సానుభూతి లోపం ఎక్కువ బాధ కలిగి స్తుంది.

వారు ఎంతకాదన్నా మన దేశ ప్రతినిధులు దూరదేశాలకి వెళ్లి కొంతకాలంతర్వాత ఇం టికి తిరిగి వస్తున్నారు. అసలే వారు ఎంతో బాధపడుతూ ఉండిఉంటారు. వారిని కలుసు కొనటానికి ముఖ్యులయిన ఆఫీసర్లయినా కొం దరు విమానాశ్రయానికి వెళ్లకపోతే ఏమి బాగుంటుంది?

అదీకాక వారి అభిప్రాయాలు ఏమిటో, తాము వోడిపోయినందుకు ఏమి చెప్పుకుం టారోనవే బాధ్యత అధికారులకి లేదూ? ఇది భవిష్యత్తుకి ఎంత ఉపయోగకరంగా ఉంటుంది!

హాకీ ఎసోసియేషన్ అధ్యక్షుడు శ్రీఅశ్వినీ కుమార్ ఒక ప్రకటన చేశారు. మనజట్టు 'హాఫ్‌బాక్'కి ఆడుతూ ఉండగా దెబ్బతగిలింది, దీనివల్ల ఆస్ట్రేలియా నెగ్గే అవకాశం ఏర్ప డింది, అని ఆయన అన్నారు. సాకులు చెప్పటం మంచిదికాదని కుమార్ చెప్పినదాంట్లో ఎంత నిజం ఉందో ఆలోచించి చూసి ఆటగాళ్లపట్ల తగిన సానుభూతి చూపాలి. తగిన పలహా ఇవ్వాలి.

గెలుపు ఎంత ప్రధానమో ప్రయత్నం కూడా అంత ప్రధానం. వోడిపోయిన వారంద రినీ అవమాన పరచటం వివేకవంతమయిన విధానంకాదు! ముందు చూపుతో మరింత కృషి చెయ్యాలి!!

—కె. ఎస్. నరసింహన్

కాబట్టి, పాత్రలు సజీవమైనవి కాబట్టి లోపాలు అంతగా కానరావు. మొత్తం మీద శ్రీ బ్రహ్మాజీరావు తొలి ప్రయత్నం విజయవంతమైనదనే చెప్పుకో వచ్చును. కుటుంబం లోని అందరూ సభ్యులూ, వయోభేదంలేకుండా చదువుకొని అందులోని సమస్యలను చర్చించుకుని, సాహిత్య రసార్ణవంలో నిలువు లోతు తెలుసుకోడానికి ఈ రచన సర్వదా ఉపయోగ పడుతుంది. ముచ్చటైన ముద్రణం, కంటికి విందుచేస్తే, ధర ఆరు రూపాయలన్న సంగతి జేబును భయ పెడుతుంది.

—శ్రీరామచంద్రమూర్తి.

బహుళపంచమి జ్యోత్స్న

నవల. రచన: గొల్లపూడి మారుతీరావు, ప్రచురణ: దేశీబుక్ డిస్ట్రిబ్యూటర్స్, శరత్ బిల్డింగు, విజయవాడ —2, పేజీలు:312, వెల: ఆరు రూపాయలు.

నవల అనగానే ఒకటోరెండో జతల ప్రేయసీ ప్రియులు, అందమైన ఆడ పర్సనల్ సెక్రటరీలూ విహారయాత్రలూ, కుపిత ప్రణయాలూ, మధ్య మధ్యలో సాంఘిక సమస్యల చర్చలూ, కులాంతర వివాహాలూ, నిర్దయులైన భర్తల కిరాతక కృత్యాల వర్ణనలూ, వూహించుకునే, సెంటర్ పైసల పత్రికలు కొని చదవడానికి అలవాటు పడిన, తెలుగు పాఠకులకు 'బహుళ పంచమి జ్యోత్స్న' విసుగు కల్గిస్తుంది. ఇందులో మూడువందల పేజీలవరకూ సాగిన కథను మూడు పేజీల్లోకి కుదించవచ్చు. రేఖామాత్రంగా చిత్రింప బడిన పాత్రలకన్నింటికీ రక్తమాంసాలందించి మరింత పుష్టిగా, ఆరోగ్యకరంగా కనిపింపజేయవచ్చును. భావ వ్యక్తీకరణలో కనిపించిన పునరుక్తి దోషాన్ని నివారించి మరింత స్పష్టతను చూపించవచ్చును. పదాల కూర్పులో మరింత సంయమనాన్నీ, వాక్య సంపుటీకరణంలో మరింత తెనుగుతనాన్నీ ప్రకటింపవచ్చును.

పీనిలో ఏ ఒక్క విషయాన్నీ మారుతిరావుగారు దృష్టిలో పెట్టుకోలేదు. మానసిక సంఘర్షణను చిత్రించే ఒక నవలను వ్రాయ తలపెట్టి, ప్రతిపుటలోనూ జీవితంమీద తనకే ఇదమిద్ధమని తెలిని కొన్ని నిర్వచనాలను వ్యక్తీకరించి, రచనను ఆసక్తి విహీనంగా తయారు చేశారు. ఇందులో నికథానాయకుడు కాశీ, చిన్నతనంలోనే తండ్రి ఆత్మహత్యను కళ్లారాచూసి, మతిలేని తల్లితో మేనమామ పోషణలో కొంతకాలం, ఆకాలం గడిపి, విశాఖపట్టణంలో ఒక ఆదర్శ ఉపాధ్యాయునిదగ్గర జీవితాన్నిగూర్చిన మొదటి పాఠాలు నేర్చుకుని, ఆతర్వాత తనకు ఇష్టంవున్న అమ్మాయిని పెళ్లి చేసుకోలేక, కులమింటి కోతినొకదాను మెడకు కట్టుకుని, సంసారపు సుడిగుండంలో చిక్కుకుని, ఆత్మనూ ఆనందాన్నీ పోగొట్టుకుని, ఆత్మహత్యకు పాల్పడబోయి జానోదయమై మళ్లీ ప్రపంచ మార్గంలో పడతాడు. హామ్లెట్‌లో వున్న అనిశ్చితత ఈ పాత్రలోవుంది. కానీ ఆ గంభీరత లేదు. పురుషరూపంలోవున్న ఆడది కాశీ. అతన్ని ప్రేమించిన గిరిక, ఈ నవలలో కనిపించే మరొక అసంపూర్ణ చిత్రణం. మాటలు వాడిగా మనసు చల్లగా బతికుతుంది. ఒక బలహీనమైన

హస్తకాలం

ఘడియలో, కాశీని పొందలేని తన నిస్సహాయతకు బెదరి ఆత్మహత్య చేసుకుంటుంది. కాశీ భార్య అన్నపూర్ణ, కాశీ మజిలీ కథల్లో వుండవలసిన అపర అరుంధతి. భర్త చేత చావు దెబ్బలుతింటూ, శరీరాన్ని చాకిరీకి, మనసును ప్రేమకూ అంకితం చేసుకుని బతుకుతుంది. ఆమె చెల్లెలు వసంత కాలుజారి, మాతృత్వాన్ని పొంది, తిరుగుబాటు చేయకుండా బతుకును తెల్లవారుస్తుంది. చక్రవర్తి గిరికకు వరుసకు అన్న. పాత్ర చిత్రీకరణంలో గిరీశానికి తమ్ముడు. అయితే గిరీశానికీ, చక్రవర్తికీ ఒక ముఖ్యభేదం వున్నది. గిరీశంలోని సంఘవ్యతిరేక బుద్ధి ఒక పాలు. చక్రవర్తిలోని చంచలత, ఆతని మనసులోని పిరికితనం పారలను కప్పిపుచ్చే ఒక తొడుగు. చక్రవర్తి తండ్రి డాక్టరు. జీవిత పరమార్థాన్ని గురించని పాత్ర. మాటల్లోనూ, చేతల్లోనూ తొందరపాటుతనం ఎక్కువ. ఆయనకు సరిగ్గా వ్యతిరేకమైన లక్షణాలున్న పాత్ర మాష్టారు. ఈ నవలలోవున్న వారందరిలోనూ ఈయన ఒక్కడే సంతృప్తిగా, సంపూర్ణంగా చిత్రింపబడ్డాడు! నవల చదువుతూన్నంతసేపూ, రచయిత మనసులో ఏదో గందరగోళం, గజిబిజి వున్నవన్న భ్రాంతి పాఠకుడికి కలుగుతుంది. అక్కడక్కడ కనిపించే 'కాంట్రడిక్షన్స్'తో నవల అంతటా కనిపించే 'ఫారిన్ మెంటాలిటీ'తో, చదువరికి ఒకరకమైన నైన విరక్తి ఈ రచనపై కల్గుతుంది.

—శ్రీ రామచంద్రమూర్తి.

ప్రాచీనదాంపత్య సుఖము

కుటుంబ నియంత్రణ సూచనలు. ప్రాచీన దాంపత్య సుఖము గురించిన వివరాలన్నీ గ్రాంథికంగా చర్చించ బడ్డాయి. రచయిత విద్వాన్ మణిమంగళము పద్మనాభమ్. 116 పేజీలు. రెండు రూపాయలు. ప్రతులకు ఎస్. పద్మనాభన్, 155 కృష్ణప్పనాయకన్ అగ్రహారంవీధి కొండితోపు, మద్రాసు—1.

హేపీన్యూస్

ఆంగ్లనాటిక. పిల్లలకు ఉపయుక్తమగు నాటిక. శ్రీ అన్నపర్తి శ్రీ రామానుజాచేయులు రచన.20 పేజీలు. వెల 50 పైసలు. ఆనందబాల ప్రచురణలు, గుంటూరు—4.

కర్తవ్యం

నాటిక. చిన్నపిల్లలకుపయుక్తమగు నాటిక. రచన శ్రీ అన్నపర్తి. 24 పేజీల పుస్తకం 50 పైసలు. ఆనంద బాల ప్రచురణలు, గుంటూరు—4.

సమర్పణ

కథల సంపుటి. వివిధ రచయితల కథలసంపుటి. చదువతగ్గ రచనలు. 74 పేజీలు.వెల రు 1—50 పై. యువ రచయితల సమితి నల్లగొండ.

విజయపతాక

మద్రాసు విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళిక ననుసరించి వ్రాయబడిన తెలుగు అచ్చు పుస్తకానికి సులభ మార్గదర్శిని. అర్థాలు, వ్యాకరణ విషయాలు విద్యార్థులకు బాగా అర్థమయేట్లు పొందుపరిచారు. 1969 సంవత్సరం పరీక్షకు హాజరు కాబోయే యస్. యస్. యల్. సి. లేదా మెట్రిక్యులేషన్ విద్యార్థులకు మిక్కిలి ఉపయోగకరమైన ఈ 'గైడు'ను పండితులు శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు, విద్వాన్, యస్. వెంకట సుబ్బయ్యగారు రచించారు. వెల రు 2—50 పై. ప్రతులకు— బి. వెంకటరమణయ్య 34, పురుషోత్తమనగర్, క్రోంపేట, మద్రాసు—44.

లేడీడాక్టర్

నవల. ఎమెస్కో వారి పాకెట్ సైజుపుస్తకం. నండూరి విఠల్ గారి కలంనుంచి వెలువడిన తాజా రచన. చివరిదాకా చదివితేనేగాని విడిచిపెట్టలేని నవల. 144 పేజీలు. వెల రెండురూపాయలు యం. శేషాచలం అండ్ కో మచిలీ పట్టణం వారి ప్రచురణ.

శ్రీ వెంకటేశ శతకం

పద్యరచన. గీతపద్యాల్లో శ్రీ వెంకటేశ్వరస్వామిని స్తుతించిన శతకం. రచయిత. విద్వాన్ శ్రీ బూదూర. నరసింహులు రెడ్డి. 22 పేజీలు. వెల 60 పైసలు. ప్రతులకు రచయితపేర జిల్లా పరిషదున్నత పాఠశాల, కార్వేటినగరంకి రాయాలి.

పెళ్లి సంబంధాలు

నాటికలు. స్త్రీ పాత్రలేని రెండు ఏకాంక నాటికల సంపుటి.రచన శ్రీఅయ్యమంత్రి కైలాసరావు 50 పేజీలు. వెల రు. 1—50 పై. ప్రవసాంధ్ర పబ్లికేషన్సు, భిలాయ్‌నగర్ (మ. ప్ర.)

గీతారామాయణము

కవిభూషణ శ్రీ చింతలపూడి సన్న్యాసిరావు రచన. 23 పేజీలు . వెల 50 పైసలు. ప్రతులకు రచయితపేర విజయనగరం—1 కి రాయాలి.

శ్రీ పద్మావతీపరిణయం

పద్యరచన. చక్కనిశైలిలో గీతపద్యరచనపద్ధతి రచయిత శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి. 32 పేజీలు . వెల 75 పైసలు. వెంకటేశ్వర ఎంటర్ ప్రైసెస్, కాకినాడ.

నారదసంచారం

పిల్లలనాటిక. శ్రీ అన్నపర్తి రచన. పుస్తకం వెల 50 పైసలు. ఆనందబాల ప్రచురణలు, గుంటూరు—4.

పృథ్వీరాజు

చరిత్రాత్మక నాటకం. పిల్లలకు ఉపయుక్తంగా వుండే ఈనాటకాన్ని శ్రీ అన్నపర్తి రచించారు. 41 పేజీలు. వెల 75 పైసలు, ఆనంద బాల ప్రచురణలు, గుంటూరు—4.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

